RNI No. APTEL / 2009/27888



# స్థానిక

సంపుటి: 3 సంచిక: 10 పేజీలు: 64




# ఇందిర

పేదలకు సుస్థిర ఆస్తులు

# స్థానిక పాలన

సంపుటి: 3 సంచిక: 10

నవంబర్, 2011



ఎడిటర్

**కె. చంద్రమౌళి** ఐ.ఏ.ఎస్.

కమీషనర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు

కె. అంబరీష్, ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

జి. గంగాధరం

డాక్టర్ పి. కృష్ణ మోహనరావు

ఎమ్.ఎ. కుమార రాజా

ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి

డాక్టర్ లీలా ప్రసాద్

హెచ్. కూర్మారావు

డాక్టర్ కె. లక్ష్మీపతి

ఎమ్. విజయలక్ష్మి

ఎ. సుభాష్‌చంద్ర గౌడ్

డా॥ వి. శివ శంకర ప్రసాద్



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా



ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : krishna.chandramouli90@gmail.com
editorsthanikapalana@gmail.com



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి చెందినవిగా భావించనక్కరలేదు.


# విషయ సూచిక


సంపాదకీయం ........ 2
ఇందిర జలప్రభ ద్వారా పేదలకు సుస్థిర ఆస్తులు, జీవనోపాధి భద్రత ........ 3
హృదయాంతరాళాలను స్పృశిస్తున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సేవాకార్యక్రమం . 6
గిరిజన గ్రామాలకు విస్తరించనున్న అపార్డ్ కీ క్యాప్ ........ 8
గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారుల శిక్షణా కార్యక్రమం........ 9
గ్రామ పంచాయితీలలో ఇంటి పన్ను మదింపు - ప్రాతిపదిక ........ 11
ఇంధన వనరుల కన్నా సహజవనరులు మిన్న ........15
బహుముఖ ప్రజ్ఞానిధి సర్. శొంఠి వెంకట రామమూర్తి ........18
గ్రామ పంచాయితీల ప్రత్యేక అధికారుల విధులు, అధికారాలు........ 20
దెయ్యం (గ్రామీణ కథ) ........ 22
మహిళా రాజకీయ సాధికారతకు యుఎన్ ఉమెన్........ 25
కొలామ్‌ల జీవన విధానం ........ 28
ఆ మహనీయుల త్యాగఫలమే 'ఈదుల్ అజీహా' ........ 30
మన హాకీ ఒక ఎగసిపడిన కెరటం........ 32
గిరిజనుల సాధికారత కోసం పోరాడిన గోండ్వానా విప్లవ జ్యోతి - కొమరం భీమ్ ........ 36
భారత్ నిర్మాణ్ వాలంటీర్ల కృషితో పాండురంగవారి పాలెంలో గ్రంధాలయం ఏర్పాటు........ 38
ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో గిరిజన ప్రాంతాల్లో రహదారుల సౌకర్యం 38
ఆకలి సూచిలో భారత్ కు 67 వ స్థానం ........ 39
బహిరంగ మలవిసర్జన సమసిపోనిదే ప్రజారోగ్యం మెరుగవదు - కేంద్రమంత్రి జైరాం రమేష్........ 39
కీ కాప్ కార్యక్రమ స్ఫూర్తి సుస్థిరంగా నిలవాలంటే?........ 40
సేంద్రియ ఎరువులతో రైతు ఇంట సిరుల పంట ........41
ఆల్కహాల్‌తో అనర్థాలు! ........ 45
షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అత్యాచార నిరోధక చట్టం అమలును మెరుగు పర్చాలి ........ 47
స్వచ్ఛతా ఉత్సవ్ ........ 50
పంచాయితీల పరిపుష్టికి 13వ ఆర్థిక సంఘం నిధులు ........ 52
బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009 ........ 53
నవంబరు 15లోగా గ్రామ పంచాయితీ బడ్జెట్ రూపొందించాలి........ 53
ఆంగ్లంపైనే గురి... తెలుగు మాటకు ఉరి! ........ 54
భారత దేశ మానవాభివృద్ధి సూచిలో మెరుగుదల ........ 57
సమర్థ సేవలే పంచాయితీలకు గీటురాయి........ 58
గ్రామ పంచాయితీ ప్రత్యేకాధికారుల శిక్షణకై శిక్షకులకు శిక్షణా కార్యక్రమం .... 59
సూర్యరశ్మి ఆధారిత నీటి శుద్ధి విధానం ........ 60
బాలల హక్కులపై అంతర్జాతీయ ఒడంబడిక........61
గుట్కా వినియోగం నిషేధించిన గంగదేవిపల్లి........ 63

# సమాజంలో ప్రతీ బాలునికీ, బాలికకూ చదువుకునే హక్కు

ధనిక, పేద వ్యత్యాసాలు, కుల, మతాలకు అతీతంగా పిల్లలందరికి చదువుకునే హక్కుని దఖలుపరుస్తూ 2009లో రూపుదిద్దుకున్న విద్యాహక్కు 2010, ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చింది. అమలులోకి తీసుకొని రావటంలో చొరవ చూపటంలేదు.

విద్యాహక్కు చట్టం అమలులో ఊపు తీసుకుని రావటానికి ఈ నవంబర్ నెల నుంచి 'చదువుకునే హక్కు' కార్యక్రమాన్ని ఉధృతంగా అమలు చేయబోతోంది. విద్యాహక్కు చట్టం ప్రజల్లో మరింత అవగాహన తీసుకుని వచ్చేలా సంవత్సరం పొడవుగా పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నాం ఇందులో స్వచ్ఛంద సంస్థలను, రెండు లక్షల పైగా ఉన్న స్వచ్ఛంద కార్యకర్తలను భాగస్వాములను చేస్తున్నారు. అన్ని పాఠశాలల్లో విద్యాహక్కు సంపూర్ణంగా అమలు కావటమే లక్ష్యంగా జరుగుతున్న ఈ ప్రచార కార్యక్రమాన్ని ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ తన లేఖతో ప్రారంభించనున్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాల్సిన అవశ్యకత గురించి, అందుకు అవకాశం కల్పిస్తున్న విద్యాహక్కు గురించి వివరిస్తూ; పిల్లలను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను విద్యాహక్కు అమలులో భాగస్వాములను చేసేలా ప్రోత్సహిస్తూ ప్రధానమంత్రి ఈ లేఖ రాశారు. ఈ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు పరచేలా రాష్ట్ర ప్రభుత్వాలపై పౌర సమాజం ఒత్తిడి తీసుకొని రావాల్సిన అవసరం గురించి ఈ లేఖలో ఉద్ఘాటించారు.

నవంబర్ 11వ తేదీన దేశవ్యాప్తంగా ఉన్న ప్రతి పాఠశాలకీ ప్రధానమంత్రి రాసిన లేఖ అందుతుంది. ఈ లేఖను పిల్లలందరినీ ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రత్యేకంగా, వ్యక్తిగతంగా రాశారు. ఉదయం పాఠశాలలో జరిగే ప్రార్థనా సమావేశంలో ప్రధానమంత్రి లేఖను పాఠశాల ప్రిన్సిపాల్ పైకి చదివి పిల్లలందరికీ విన్పిస్తారు. ఈ లేఖతో ఏడాదిపాటు జరిగే 'చదువుకునే హక్కు' ప్రచార కార్యక్రమం ఒకేసారి దేశవ్యాప్తంగా ప్రారంభమవుతుంది.

'చదువుకునే హక్కు' ప్రచార కార్యక్రమాన్ని జాతీయ సలహామండలి (NAC) రూపొందించింది. హర్యానాలోకి మేవత్ జిల్లాలో గల నుహ్ గ్రామంలో ప్రచారం లాంఛనంగా ప్రారంభమవుతుంది. దేశంలోనే వెనుకబడిన జిల్లాల్లో మేవత్ ఒకటి అదేసమయంలో ప్రధాని లేఖను దేశవ్యాప్తంగా గల 13 లక్షల పాఠశాలల్లో ఒకేసారి చదివి విన్పిస్తారు. ఈ లేఖను మొత్తం 14 భాషల్లోకి అనువదించారు.

విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి 1) 6 సం॥ల నుంచి 14సం॥ల వయస్సులో ఉన్న పిల్లలందరికీ ఉచితంగా విద్యను (8వ తరగతి పూర్తి) తప్పనిసరిగా అందించాలి. 2) బడి బయట పిల్లలందరినీ వయస్సుకు తగిన తరగతిలో బడిలో చేర్పించి, ప్రత్యేక శిక్షణ ద్వారా విద్యనందిస్తూ బడిలో కొనసాగేటట్లు చూడాలి. 3) 3 సం॥ల నుంచి 5 సం॥ల వరకు వయస్సున్న పిల్లలను అంగన్ వాడీ కేంద్రంలో చేర్పించి విద్యను అందించాలి. 4) విద్యార్థులను అదే తరగతిలో ఒకటి కంటే ఎక్కువ సం॥రాలు కొనసాగించటం, బడి నుంచి తీసివేయడం నిషేధం. 5) ప్రవేశ రుసుము, ప్రవేశ పరీక్ష నిషేధం. 6) బాల బాలికలను శారీరకంగా, మానసికంగా శిక్షించడం చట్టరీత్యా నేరం.

విద్యాహక్కు చట్టాన్ని అమలుచేయటంలో పంచాయితీరాజ్ సంస్థలు బృహత్తర పాత్ర పోషించాల్సి ఉంది. పంచాయితీరాజ్ సంస్థలు ముఖ్యంగా 1) గ్రామ పంచాయితీ పరిధిలోని 0-14 సం॥ల వయస్సు గల పిల్లలందరి రికార్డును నిర్వహిచాలి. 2) పాఠశాల యాజమాన్య కమిటీ (School Management Committee-SMC) (సర్పంచ్) ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేయాలి. ఈ యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి. 3) పాఠశాల భవనం, బోధనా సిబ్బంది, బోధనా పరికరాలతో సహా అన్ని మౌలిక సదుపాయాల కల్పనలో సహకరించాలి. 4) క్రమం తప్పకుండా ప్రతినెల యాజమాన్య కమిటీ సమావేశాలను నిర్వహించి కార్యాచరణ రూపొందించాలి.

'చదువుకునే హక్కు' ప్రచార కార్యక్రమం ప్రారంభమవుతున్న దృష్ట్యా, ఇకనుంచైనా విద్యాహక్కు చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేసి, ప్రతి బాలిక, ప్రతి బాలుడు చదువుకునే విధంగా పంచాయితీరాజ్ సంస్థలు, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తాయని ఆశిద్దాం.

కె.చంద్రమౌళి

(కె. చంద్రమౌళి)




# ఇందిర జలప్రభ

## పేదలకు సుస్థిర ఆస్తులు, జీవనోపాధి భద్రత

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ప్రజల సంక్షేమానికి ఉద్దేశించి రాష్ట్ర ప్రభుత్వం రూ. 1800 కోట్లు భారీ బడ్జెట్‌తో ఇందిర జలప్రభ పథకానికి శ్రీకారం చుట్టింది. అక్టోబర్ 2న ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం జంగాల పల్లిలో ముఖ్యమంత్రి శ్రీ ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి రోజున ఈ కార్యక్రమం ప్రారంభం కావటం శుభ సూచకం అని ముఖ్యమంత్రి అన్నారు.

> **ఇందిర జలప్రభ పథకం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా 55 లక్షల ఎకరాల భూమిని సాగులోకి తీసుకొనిరావలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. తొలివిడతగా ఇందిర జలప్రభ పథకం క్రింద 10 లక్షల ఎకరాలను అభివృద్ధి చేస్తామని, ఈ 10 లక్షల ఎకరాలలో 5.37 లక్షల ఎకరాలు తెలంగాణలో, 2.73 లక్షలు కోస్తా ఆంధ్రలో, 1.89 లక్షల ఎకరాలు రాయలసీమలో అభివృద్ధి చేయటం జరుగుతుందని ముఖ్యమంత్రి తెలియజేసారు.**

ఇందిర జలప్రభ పథకం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా 55 లక్షల ఎకరాల భూమిని సాగులోకి తీసుకొనిరావలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. తొలివిడతగా ఇందిర జలప్రభ పథకం క్రింద 10 లక్షల ఎకరాలను అభివృద్ధి చేస్తామని, ఈ 10 లక్షల ఎకరాలలో 5.37 లక్షల ఎకరాలు తెలంగాణలో, 2.73లక్షలు కోస్తా ఆంధ్రలో, 1.89 లక్షల ఎకరాలు రాయలసీమలో అభివృద్ధి చేయటం జరుగుతుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలియజేసారు. ఇందిర జలప్రభ





కార్యక్రమం క్రింద దాదాపు 6 లక్షల మంది రైతుల భూములను ఎంపిక చేయగా, ఇందులో 3.30 లక్షల మంది షెడ్యూల్డు కులాలు, 2.37 లక్షల మంది షెడ్యూల్డు తెగలకు చెందిన రైతులు ఉన్నారని మంత్రి మాణిక్యవరప్రసాద్ తెలియచేసారు.

ఇందిర ప్రభ అమలులోని లోపాలు ఈ పథకంలో మళ్ళీ దొర్లకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. కేవలం భూపంపిణీ మాత్రమే కాకుండా పంపిణీ చేసిన భూములను సేద్యానికి అనువైనవిగా మార్చటానికి అవసరమయిన అన్ని వసతులనూ ఈ కార్యక్రమం క్రింద సమకూర్చటానికి నిబంధనలు రూపొందించారు. ఇందిర జలప్రభ పథకం క్రింద సాగునీటి వసతితో పాటు బిందు సేద్య పరికరాలు కూడా ప్రభుత్వమే అందచేస్తుంది. బిందు సేద్య పరికరాలను రైతులకు సమకూర్చటానికే సుమారు 1600 కోట్లు రూపాయలు వ్యయం కాగలవని ఒక అంచనా. ఇందిర జలప్రభ కార్యక్రమంలో అభివృద్ధి చేసే భూములకు నీటి వసతి కల్పించటానికి ఎకరానికి రూ 16000/- లు ఖర్చు చేయనున్నారు. ప్రతి 10-250 ఎకరాలను ఒక బ్లాకుగా తీసుకుని అభివృద్ధి పరుస్తారు. ప్రతీ పదిఎకరాలకు ఒక బోరుబావిని త్రవ్వుతారు. ఈ బోరు బావికి విద్యుత్ సౌకర్యం కల్పించి, మోటార్ పంప్‌సెట్ అమర్చటానికి అవసరమయిన నిధులను ప్రభుత్వం సమకూర్చుతుంది. ప్రతీ బ్లాకులో లేదా బోర్‌వెల్ పరిధిలో కనీసం ఇద్దరు లబ్ధిదారులు ఉండేలా చూడటంతో పాటు ఎంపిక చేయబడిన బ్లాకులోని లబ్ధిదారులతో ఒక కామన్ ఇంట్రస్ట్ గ్రూపును ఏర్పరుస్తారు. ప్రతీ బోర్ వెల్‌కు ఒక బోర్‌వెల్ యూజర్ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తారు. ఏదేని బోర్‌వెల్ వైఫల్యం చెందినట్లయితే ఆ బోర్‌వెల్ యూజర్ గ్రూపును ఇతర బోర్‌వెల్ యూజర్ గ్రూపులతో అనుసంధానించి, రైతుకు నీటి వసతి కల్పించబడేలా చర్యలు తీసుకుంటారు. ప్రతీ యూజర్ గ్రూపుకు ఒక లీడర్ ఉండేలా శ్రద్ధవహిస్తారు. బడుగు, బలహీనవర్గాల వారు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే సత్సంకల్పంతో ప్రభుత్వమే సాగునీటి వసతితో పాటు, బిందు సేద్య పరికరాలు, విద్యుత్ కనక్షన్ సౌకర్యం కల్పిస్తూడటంతో లబ్ధిదారులు తమ భూములను ఇతరులకు అమ్మకుండా లబ్ధిదారులే ఆఫలాలను అనుభవించాలని ప్రభుత్వం ఆశిస్తోంది.

ఇందిర జలప్రభ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా 245 బ్లాకులలో అమలు చేస్తారు. లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వం అత్యంయత జాగ్రత్తతో వ్యవహరిస్తోంది. ముందస్తు ప్రణాళికలో పథకం అమలు జరిగే ప్రదేశాలలోని షెడ్యూల్డు, కులాలు, షెడ్యూల్డు తెగల ప్రజలకు చెందిన భూమి వినియోగ వివరాలను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ








ప్రత్యేకంగా సేకరించి, మొత్తం సమాచారాన్ని కంప్యూటరీకరించారు. 31.7.2011 నాటికి ఆ డేటాబేస్‌లో నమోదయి ఉన్న వ్యక్తుల భూములను మాత్రమే పథకంలో తొలివిడతలో పరిగణనలోకి తీసుకుంటారు గతంలో అమలు చేసిన ఆర్.ఐ.డి.ఎఫ్ 13, ఆర్.ఐ.డి.ఎఫ్ 14, ఇందిర ప్రభలలో అభివృద్ధి పరచిన భూములను ఈ ఇందిర జలప్రభ కార్యక్రమంలోకి సాధారణంగా పరిగణనలోకి తీసుకోరు. సర్వే ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా ఇందిర జలప్రభ ప్రాజెక్టు అమలుకు లబ్ధిదారుల ఎంపికకు ప్రాధాన్యతలను కూడా ప్రభుత్వం నిర్దేశించింది.

### లబ్ధిదారుల భూముల ఎంపికను ప్రాధాన్యతలు ఇవే :

- ఎం.జి.ఎన్.ఆర్.ఇజి.ఎస్ భూ వినియోగ సమాచార సర్వే ఆధారంగా ఇప్పటికే పనులు పూర్తి చేసి అభివృద్ధి పరిచిన ఎస్సీ, ఎస్టీ రైతులు బంజరు భూములు.
- ఎం.జి.ఎన్.ఆర్.జి.ఎస్ భూ వినియోగం సమాచార సర్వేలో గుర్తించబడి, ఎటువంటి పనులు చేపట్టబడని ఎస్సీ,ఎస్టీ రైతుల భూములు
- సర్వేలో గుర్తించబడిన వ్యవసాయయోగ్యమైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల భూములు.
- మెట్ట ప్రాంత ఉద్యానవన పంటలు, ఇరిగేటెడ్‌డ్రై క్రాప్స్ వేయటానికి అనువుగా అభివృద్ధి పరచబడిన ఎస్సీ, ఎస్టీల భూములు.
- ఐ.టి.డి.ఎ పరిధిలో విద్యుత్ సౌకర్యం కల్పించటానికి అనుకూలయోగ్యమైన గిరిజనుల భూములు.
- ఆర్.ఓ.ఎఫ్.ఆర్. అటవీ భూములు.

ఇందిర జలప్రభ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో వేగవంతంగా, సమర్థవంతంగా అమలు చేయటానికి కూడా ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేయటానికి కూడా ప్రభుత్వం. క్షేత్రస్థాయి అధికారులకు ప్రత్యేక అధికారులు ఇచ్చింది. భూగర్భజలాలు అందుబాటులో ఉన్నదీ లేనిదీ తెల్సుకోవటానికి సమగ్ర సర్వే జరపటానికి 'జియాల జిస్టుల' సేవలు వినియోగించుకోవటానికి జిల్లా నీటి యాజమాన్యసంస్థలకు అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 15 నాటికి ఎంపిక చేయబడిన బ్లాకులలో ఈ జియోహైడ్రలాజికల్ సర్వేలను పూర్తి చేయటానికి కసరత్తు ఇప్పటికే మొదలు అయింది. సర్వే జరిగే సమయంలో కూడా లబ్ధిదారులతో కూడిన కనీసం 2 కామన్ ఇంట్రస్టు గ్రూపుల భాగస్వామ్యం తప్పనిసరి చేసింది. బోర్‌వెల్సు నిర్మాణంతోపాటే భూగర్భజలాల రీఛార్జి నిర్మాణాలను కూడా తప్పనిసరిగ్గా చేపట్టాలి. అందువల్ల వినియోగిస్తున్న భూగర్భ జలాలను ఎంతో కొంత మళ్ళీ పునరుత్పాదన చేయవచ్చు.

### ఇందిర జలప్రభ ద్వారా అభివృద్ధి చేయబడిన భూములలో సుస్థిర వ్యవసాయం

ఈ ఇందిర జలప్రభ పథకంలో అభివృద్ధి పర్చబడిన భూములలో సుస్థిర వ్యవసాయ పద్ధతులను పాటించే విధంగా రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. అదేవిధంగా ప్రతీ బోర్‌వెల్ పరిధిలో కనీసం అరఎకరం విస్తీర్ణంలో కూరగాయాలు పెంపకం తప్పని సరిగా చేపట్టాలి. గ్రీన్ హౌస్, డ్రిప్ ఇరిగేషన్, వంటి వసతుల కోసం ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులను జోడించి రైతులకు సకల సౌకర్యాలు కల్పించటానికి ప్రభుత్వం ప్రయత్నం మొదలు పెట్టింది.

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ చట్టం స్ఫూర్తికి అనుగుణంగా పేదలకు మన్నికైన, నాణ్యమైన ఆస్తుల కల్పన ద్వారా వారి జీవనోపాధులు మెరుగు పర్చటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన బృహత్తర కార్యక్రమం "ఇందిర జలప్రభ" విజయవంతమయ్యి, పేద, బడుగు, బలహీన వర్గాల జీవితాలలో ఆనందం నింపుతుందని ఆశిద్దాం.

- డా॥ శివశంకర ప్రసాద్

# హృదయాంతరాళాలను స్పృశిస్తున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సేవాకార్యక్రమం

స్పందించే హృదయం ఉంటే, సమస్యల సాధన ఎంత మాత్రం అసాధ్యం కాదని భారత్ నిర్మాణ్ వాలంటీర్లు నిరూపిస్తున్నారని అపార్డు కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్. అన్నారు 13-10-2011న 13 జిల్లాలలోని కీక్యాప్ గ్రామాలలోని భారత్‌నిర్మాణ్ వాలంటీర్లు, గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, విస్తరణ శిక్షణా కేంద్ర అధ్యాపక బృందం, జిల్లా శిక్షణా నిర్వాహకులతో అపార్డు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అపార్డు కమీషనర్ శ్రీ చంద్రమౌళి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చేసే పనిని కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇప్పటికే ప్రామాణికంగా గుర్తించినదన్నారు.

పలు రాష్ట్రాలకు మార్గనిర్దేశం చేయవలసినదిగా అపార్డుకు విజ్ఞప్తులు అందుతున్నాయని, ఈ ఘనత క్షేత్రస్థాయిలో అద్భుతమైన ఫలితాలు రాబట్టుతున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్లకే చెందుతుందని ఆయన అన్నారు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి భారత్‌నిర్మాణ్ వాలంటీర్లు ఏవిధంగా సహాయ పడగల్గుతారన్న విషయంపై అపార్డు రూపొందించిన వ్యూహాన్ని కేంద్ర పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ ఎ.ఎన్.పి.సిన్హా ప్రశంసించారని గుర్తు చేస్తూ, రాష్ట్రంలోని వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలోని గిరిజనులలో అవగాహన కల్పిస్తూ, ఆయా ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా రూపొందించే సమీకృత అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో బి.ఎన్.వి.ల సేవలు ఉపయోగించుకొనటానికి అపార్డు, ఖమ్మం, ఆదిలాబాద్, తూర్పుగోదావరి జిల్లా, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాలలోని ఎంపిక చేసిన గిరిజన గ్రామాలకు కూడా కీ క్యాప్ కార్యక్రమానికి విస్తరించనున్నదని తెలియచేశారు.







ఈ సందర్భంగా అపార్డు కమీషనర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చేసే కార్యక్రమాల వివరాలను సాధించిన విజయాలను ఎప్పటికప్పుడు డాక్యుమెంట్ చేసి అపార్డుకి తెలియపర్చాలన్నారు. అంతకు ముందు మాట్లాడిన అపార్డ్ సి.ఎన్.ఆర్.ఎం. సెంటర్ హెడ్ హెచ్. కూర్మారావు, గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులకు కీ -క్యాప్ కార్యక్రమం పై అవగాహన కలుగచేసారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాలలోని భారత్ నిర్మాణ్ వాలంటీర్లు తాము చేస్తున్న కార్యక్రమాల గూర్చి వివరించారు.

శ్రీకాకుళం జిల్లా కరజాడ గ్రామం నుండి జి. చిన్నబాబు మాట్లాడుతూ, తమగ్రామంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ప్రతీ వారం సమావేశమయ్యి రాబోయే వారం రోజుల్లో ఏఏ కార్యక్రమాలు చేపట్టాలో ప్రణాళికలు రూపొందించుకొని, గ్రామంలో పారిశుద్ధ్యం, త్రాగునీరు, విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, పోషకాహార రంగాలలో



గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొని వెళ్ళటానికి కృషి చేస్తున్నామని తెలిపాడు ఇందుకు గాను గ్రామంలో వివిధ కమిటీల ఏర్పాటు చేశామని తెలియచేసాడు.

కర్నూలు జిల్లా కన్నప్పకుంట గ్రామపంచాయితీ నుండి శ్రీమతి కళ్యాణి మాట్లాడుతూ గ్రామంలో మద్యపానాన్ని నిషేధించామని, పొగరాని పొయ్యిలు పంపిణీ చేయటం జరిగినదని అన్నారు. రైతు సమస్యలు తీర్చటానికి గ్రామంలో రైతులతో చర్చించి వారిని MGNREGS పథకానికి అనుసంధానం చేసి గడ్డిపంటలు వేసుకొనేలా ప్రోత్సహించటం జరిగిందని అన్నారు.

విజయనగరం జిల్లా సంతతోపేట నుండి చుక్కబాబు మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య సాధనకు ప్రతీఇంటికీ ఒక చెత్తబుట్ట భారత్ నిర్మాణ్ వాలంటీర్లు పంపిణీ చేసారని, ఇళ్ళ దగ్గర నుండి చెత్తను సేకరించటానికి కూడా ఒక రిక్షా బండిని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసినందున గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగు అవుతున్నాయని చెప్పారు. గ్రామస్తులలో సమకాలీన పరిస్థితులపై అవగాహన కల్గించేందుకు, ప్రతీరోజూ సాయంత్ర సమయంలో రామమందిరం వద్ద ప్రజలకు ఈనాడు, సాక్షి వార్తా పత్రికలను చదివి వినిపిస్తున్నారని తెలియచేసాడు. అపార్డ్ నుండి పొందిన స్ఫూర్తితో గ్రామంలోని మానవతావాదులను కల్సి నీటిశుద్ధి ప్లాంటు నిర్మాణానికి 3 లక్షలు విరాళాలు సేకరించామని తెలియచేసాడు.

అనంతపూర్ జిల్లా వడ్డివల్లి పంచాయితీ నుండి మాట్లాడిన వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ ఈకీకాప్ కార్యక్రమం వల్ల గ్రామ అభివృద్ధి గాడిలో పడటమే కాక తానుకూడా వ్యక్తిగతంగా సంస్కరింపబడ్డానని అందుకు అపార్డ్‌కి కృతజ్ఞతలు తెలియచేసాడు.

వై.యస్.ఆర్. కడప జిల్లా పొట్లదుర్తి గ్రామం నుండి, సుబ్రహ్మణ్యం, అంజలి అనే భారత్ నిర్మాణ్ వాలంటీర్లు మాట్లాడుతూ గ్రామంలో రక్షిత నీటి సరఫరాకు అవసరమయిన బ్లీచింగ్‌పౌడర్‌ను బియన్‌విలు కొనుగోలు చేసామని తెలియచేశారు. 200 మొక్కలు నాటుకుని, MGNREGS కార్యక్రమాలు పారదర్శకంగా జరిగేలా చూస్తున్నట్లు తెలియచేసారు.

తూర్పుగోదావరి జిల్లా రావులపాడు గ్రామపంచాయితీ నుండి మాట్లాడిన రమేష్ తన గ్రామంలో బియన్‌విలు ప్రతీ మంగళవారం సమావేశమవుతున్నట్లు తెలియచేసాడు. ఘన, ద్రవ వ్యర్థపదార్థాల నిర్వహణకు ప్రజలలో అవగాహన కల్గిస్తున్నట్లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రజలను ప్రేరేపిస్తున్నట్లు, తెలియచేసాడు. గ్రామంలో ఇప్పటికే 80.1 వరకూ మద్యపానాన్ని నిషేదించగల్గుమని త్వరలో సంపూర్ణ మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలియచేసాడు. తూర్పుగోదావరి జిల్లా పంచాయితీ అధికారి, శ్రీ శ్రీధర్ మాట్లాడుతూ బి.ఎన్.వి.లు 2800 మొక్కలు నాటుమని తెలియచేసారు. NEDCAP సహాయంతో 316 ఇళ్ళకు CFL బల్బులను అందచేయటానికి కృషి చేస్తున్నట్లు తెలియచేసారు.

ప్రకాశం జిల్లా కనపర్తి నుండి మాట్లాడిన త్రినాథ్, తమగ్రామం నుండి మండల నివారణకు MGNREGS పథకాన్ని సమర్థవంతంగా వినియోగించుకొనేటట్లు కూలీలను ప్రోత్సహించటంతో ప్రముఖపాత్ర వహించారని చెప్పారు. జన శిక్షణా సంస్థాన్ ద్వారా 72 మందికి, కుట్టు శిక్షణ అందచేసి, శిక్షణ అనంతరం బ్యాంకు బుగలు కూడా అందచేయటం జరిగిందన్నారు. గ్రామంలో రైతులలో అవగాహన తీసుకొని వచ్చి బయోఫర్టిలైజర్ వినియోగాన్ని 40% శాతం వరకు పెంచగల్గామని తెలియచేసారు.

చిత్తూరు జిల్లా కొట్టునుండి మాట్లాడిన సుధ, ఈ కీ క్యాప్ కార్యక్రమం వల్ల తనకు త్రివేంద్రంలో జరిగిన జాతీయ సమ్మేళనంలో పాల్గొనే అవకాశం లభించిందని తెలియచేసారు. వాలంటీర్లకు దేశవ్యాప్తంగా అరుదైన గౌరవం దక్కుతోందని అన్నారు. కొటాల గ్రామంలో కీక్యాప్ కార్యక్రమానికి ముందు అమలు తర్వాత ప్రజలలో స్పష్టమైన మార్పు వచ్చిందని తాము 20 రంగాలలో పురోభివృద్ధి సాధించామని తెలియచేసారు. గ్రామ బి.ఎన్‌విలు మాట్లాడుతూ ఈ నెలలో వినూత్నంగా గ్రామంలో 'జన్మ స్థలం సంయోజనం' అనే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగరీత్యా గ్రామం నుండి వెళ్ళి ఇతర ప్రాంతాలలో స్థిరపడిన వారందరూ ఒకే, వేదికపై కల్సి, గ్రామ అభివృద్ధికి చేయూత అందచేసేలా ప్రేరేపించటం జరగుతుందని తెలియచేసారు.

వీడియో కాన్ఫరెన్సును ముగించే ముందు అపార్డ్ కమీషనర్ శ్రీ చంద్రమౌళి మాట్లాడుతూ, బి.ఎన్.వి.లు చేసే పనులు చూస్తూంటే, సమాజసేవకు అంతం లేదని, ఆ రంభం మాత్రమే ఉంటుందన్న గుర్తుకువస్తోందని, బి.ఎన్.వి.లు తమ గ్రామంలో మొదలుపెట్టిన ఈ సమాజసేవ అనే చిరుమొక్క, వటవృక్షమయ్యి గ్రామీణాభివృద్ధి వేగవంత మవ్వాలని ఆకాక్షించారు.

# గిరిజన గ్రామాలకు విస్తరించనున్న అపార్డ్ కీ క్యాప్





**భారత ప్రభుత్వం ల్యాబ్ టు ల్యాబ్ కార్యక్రమాన్ని, అపార్డ్ కీ క్యాప్ పేరుతో రాష్ట్రంలోనే 78 గ్రామాలలో భారత నిర్మాణ్ వాలెంటీర్‌ల ద్వారా ఆదర్శ గ్రామాలుగా, అభివృద్ధి చెందిన గ్రామాలుగా రూపొందించే ప్రయోగం విజయవంతమైన ఫలితాలను సాధిస్తోంది. ఈ కీ క్యాప్ కార్యక్రమంలో దాదాపుగా 2000 మంది భారత నిర్మాణ్ వాలెంటీర్‌లుగా నమోదు చేసుకోవటం జరిగింది. ఈ స్పందన ఆధారంగా కీ క్యాప్ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్ ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు స్వల్ప మార్పుతో విస్తరింపచేయాలనే కృషిని అపార్డ్ ప్రారంభించింది.**

ఈ కృషిలో భాగంగా పైలెట్‌గా రంపచోడవరం ఐ.టి.డి.ఎ. పరిధిలోని చవిటిదిబ్బల (వై. రామవరం) ఆముదాలబంద (గంగవరం), డి. భీమవరం (అడ్డతీగల) గ్రామాలను ఎంపిక చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అపార్డ్ నుండి సీనియర్ ఫాకల్టీ సభ్యులు సుభాష్ చంద్రగౌడ్, స్టీవెన్ నీల్ లు సెప్టెంబరు 25 నుండి 29 వరకు రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించి, కార్యక్రమానికి నాది పల్కటం జరిగింది.

అపార్డ్ బృందం ముందుగా ఐ.టి.డి.ఎ. పథక నిర్వహణ అధికారిణి శ్రీమతి నాగరాణి గారితో సమావేశమై ల్యాబ్ టు ల్యాండ్. కీ క్యాప్ కార్యక్రమం గూర్చి, పిసాచట్టం, భారత నిర్మాణ్ వాలెంటీర్ కార్యక్రమం గురించి చర్చించి ఐ.టి.డి.ఎ. పరిధిలోని చవిటిదిబ్బల, ఆముదాలబంద, డి. భీమవరం 3 గ్రామాలను ఎంపిక చేయటం జరిగింది. ఎంపిక చేసిన గ్రామాలకు సంబంధించిన మండల అభివృద్ధి అధికారులతో సమావేశమై ది. 27 తేది చవిటి దిబ్బల (వై. రామవరం) గ్రామంలో గ్రామ సభ నిర్వహించటం జరిగింది.

గ్రామ సభలో భారత్ నిర్మాణ్ వాలెంటీర్స్ ఎంపిక, వారి విధులు, భాధ్యతలు, పీసా చట్టం అమలు, గ్రామం యొక్క అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కలిగించటం జరిగింది. దీనికి స్పందించి చవిటదిబ్బల గ్రామం నుండి 39 మంది భారత్ నిర్మాణ్ వాలెంటీర్‌లుగా నమోదు చేసుకోవటం జరిగింది. ఈ గ్రామ సభను వై. రామవరం మండల అభివృద్ధి అధికారి శ్రీ సి.హెచ్. నర్సారావు సమర్థవంతంగా నిర్వహించటం జరిగింది. 28 వ తేది ఉదయం 10 గం.లకు గంగవరం మండలం లోని ఆముదాలబంద గ్రామ పంచాయితిలో గ్రామ సభ నిర్వహిచటం జరిగింది.

ఇందులో మహిళా స్వయం సహాయక సంఘాలు, యువత ఉత్సాహంగా పాల్గొనటం జరిగింది. ఈ గ్రామ సభలో స్థానికంగా పనిచేస్తున్న యన్.జి.ఒ. "గిరిజన దీపిక" ప్రతి నిధులు పాల్గొన్నారు. వీరితోపాటు ఇంధిరాక్రాంతి పథం లీగల్ కో-ఆర్డినేటర్, ఏ.ఒ.పి. కమ్యునిటి కో-ఆర్డినేటర్, మండల పరిషత్ పర్యవేక్షకులు శ్రీనివాస్ దొర హాజరయ్యారు. గ్రామం నుండి 49 మంది వాలెంటీర్స్‌గా నమోదు చేసుకోవటం జరిగిది. ఈ కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. ఆంజనేయులు సమన్వయం చేయటం జరిగింది.

28 వ తేది మధ్యాహ్నాం అడ్డతీగల మండలం, డి. భీమవరం గ్రామంలో గ్రామసభ నిర్వహించటం జరిగింది. ఈ గ్రామ పంచాయితి పరిధిలో గల 7 గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు గ్రామ సభకు హాజరు కావటం జరిగింది. ఈ గ్రామ సభలో గిరిజన దీపిక ప్రతినిధులు కుంజం పండుదొర, మూర్తి, అబ్బాయిరెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఐ.కె.పి. సిబ్బంది పాల్గొన్నారు. ఈ గ్రామం నుండి 79 మంది భారత నిర్మాణ్ వాలెంటీర్‌లుగా నమోదు చేసుకోవటం జరిగింది.

ఈ 3 రోజుల పర్యటనకు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు శ్రీమతి సుగుణ కుమారి గారు సమన్వయ పరిచారు. జిల్లా శిక్షణా మేనేజర్ సత్యనారాయణమూర్తి (దేవుడు), విస్తరణ శిక్షణా కేంద్ర ఫ్యాకల్టి శ్రీ బాబూరావు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో నమోదు చేసుకొన్న భారత నిర్మాణ్ వాలెంటీర్‌లకు వివిధ గిరిజన చట్టాలు, ప్రధానంగా పీసా చట్టం, గ్రామ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలపై శిక్షణ ఇవ్వటం జరుగుతుంది.

పై గ్రామాల వాలెంటీర్‌ల శిక్షణ, తదుపరి అమలు, పర్యవేక్షణ వంటి అంశాలపై ప్రస్తుతం ప్రణాళికల తయారీలో అపార్డ్ నిమగ్నమై ఉంది.



# గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారుల శిక్షణా కార్యక్రమము



**రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం అయి గత 17సం॥రాలలో క్రమం తప్పకుండా రాష్ట్ర ఎన్నికల కమీషను ఆధ్వర్యంలో 3 సాధారణ ఎన్నికలు జరిగాయి. ఆగష్టు 2011 మాసముతో 3వ సాధారణ ఎన్నికల ద్వారా ఎన్నిక కాబడిన పంచాయతీరాజ్ పాలకవర్గాల పదవీకాలం పూర్తవటంతో, వివిధ కారణాల దృష్ట్యా, పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్నికలు నిర్వహించుట సాధ్యంకానందువల్ల, పాలకవర్గం స్థానంలో ప్రత్యేకాధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు నియమించబడ్డారు.**

పంచాయతీల పరిపాలన చట్టబద్ధమైనది కనుక, ఈ సంస్థకు ప్రత్యేకాధికారులుగా నియమించబడిన వివిధ శాఖల అధికారులు ఎన్నో చట్టపరమైన అంశాలను తెలుసుకోవలసిన అవసరం ఏర్పడింది. అందువల్ల గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారుల శక్తి సామర్థ్యములు పెంపొందించుటకు అపార్డు వారిచే శిక్షణ కార్యక్రమము రూపొందించి, రాష్ట్రంలో మొదటివిడతగా రాయలసీమ, కోస్తా జిల్లాలలో(13జిల్లాలు) డివిజన్‌స్థాయిలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్నది.

ఈ కార్యక్రమములో గ్రామపంచాయతీ విధులు, అధికారాలు, ప్రత్యేకాధికారుల విధులు, బాధ్యతలు, కార్యదర్శుల విధులు, గ్రామసభ, గ్రామపంచాయతీ ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, గ్రామపంచాయతీలో పనులు చేయువిధానం, ఆడిట్ అభ్యంతరాలు, లేఅవుట్ మరియు భవన నిర్మాణ నిబంధనలు, ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాలు (మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, వాటర్‌షెడ్, రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ యోజన (ఆర్.జి.ఎస్.వై), వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి (బి.ఆర్.జి.ఎఫ్),

గ్రామపంచాయితీ త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, 13 వ ఆర్థిక సంఘం/రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, సాక్షర భారత్, బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం-2009) మరియు ల్యాబ్ టు ల్యాండ్ (కీ క్యాప్) మొదలగు అంశములపైన శిక్షణ నిర్వహించబడుచున్నది.

ఈ కార్యక్రమమునకు జిల్లాలలో జిల్లా కలెక్టర్లు, జిల్లా ముఖ్యకార్యనిర్వహణాధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు హాజరై వారి సూచనలు అందిచడం జరిగింది. 13 జిల్లాలలో ఇప్పటివరకు 2021 మందికి శిక్షణ ఇవ్వడమైనది.

| క్ర. సం. | జిల్లా పేరు | ఇంతవరకు శిక్షణ పొందిన వారి సంఖ్య |
|---|---|---|
| 1. | అనంతపురం | 110 |
| 2. | చిత్తూరు | 99 |
| 3. | వై.ఎస్.ఆర్ | 237 |
| 4. | విజయనగరం | 118 |
| 5. | శ్రీకాకుళం | 124 |
| 6. | విశాఖపట్టణం | 103 |
| 7. | తూర్పుగోదావరి | 152 |
| 8. | పశ్చిమగోదావరి | 196 |
| 9. | గుంటూరు | 180 |
| 10. | ప్రకాశం | 237 |
| 11. | కృష్ణ | 95 |
| 12. | నెల్లూరు | 146 |
| 13. | కర్నూలు | 224 |
| | మొత్తం | 2021 |

తదుపరి మిగిలిన 9 జిల్లాలలో శిక్షణా కార్యక్రమమునకు నవంబర్ మాసములో నిర్వహించుటకు ఏర్పాట్లు జరుగుచున్నవి.

ఈ శిక్షణా కార్యక్రమము చాలా ఉపయోగకరముగాయున్నదని శిక్షణార్థులు మరియు జిల్లా అధికారులు తెలియజేశారు.

మండల ప్రజా పరిషత్ ప్రత్యేకాధికారులకు కూడా డిశెంబర్,2011 మాసములో జిల్లా కేంద్రములలో శిక్షణను ఇవ్వడానికి చురుకుగా ఏర్పాట్లు జరుగుచున్నవి. ■

# గ్రామ పంచాయతీలలో ఇంటి పన్ను మదింపు - ప్రాతిపదిక

**పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షను 61వ విభాగము క్రింద ఇంటి పన్నును ఈ క్రింది ప్రాతిపదికలలో ఏదో ఒక దానిపై విధించవచ్చు.**

1. వార్షిక అద్దె విలువ
2. మూల ధనపు విలువ

సాధారణంగా ఎక్కువ శాతం నోటిఫైడు గ్రామ పంచాయతీలు వార్షిక అద్దె విలువ ప్రాతిపదికగా, నాన్ - నోటిఫైడు గ్రామ పంచాయతీలు మూలధనపు విలువ ఆధారంగా ఇంటి పన్నును విధించి వసూలు చేసే విధానాన్ని ఇప్పటివరకు అమలు చేస్తున్నాయి.

## 1. వార్షిక అద్దె విలువపై పన్ను విధించడానికి

ఇండ్ల వార్షిక అద్దె విలువను తెలుసుకునే పద్ధతి పాత చట్టంలోని జి.ఒ. 282లో జారీ చేసిన 6(2) నియమంలో వివరించబడింది. ఈ పద్ధతి ప్రకారం ప్రతి నెల ప్రతి సంవత్సరం ఒక ఇంటిని సహేతుకంగా ఎంత మొత్తానికి అద్దెకు ఇవ్వవచ్చునో ఆ మొత్తాన్ని ఆ ఇంటి వార్షిక అద్దె విలువగా భావించాలి. అందులో 10% మరమ్మత్తుల క్రింద మినహాయించాలి. మిగిలిన మొత్తాన్ని గ్రామపంచాయతీ విధించే పన్ను రేటుతో భాగించితే వచ్చే విలువ ఆ ఇంటిపై విధించవలసిన పన్ను అవుతుంది.

**ఉదాహరణ:**

| | | | |
|---|---|---|---|
| 1. | ఒక ఇంటి నెల వారీ అద్దె | = రూ. | 500/- |
| 2. | వార్షిక అద్దె (సంIIరానికి) 500×12 | = రూ. | 6000/- |
| 3. | 10% మరమ్మత్తులు లేదా అరుగుదల క్రింద మినహాయింపు = 6000÷10 | = రూ. | 600/- |
| 4. | నికర వార్షిక అద్దె = రూ. 6000-600 | = రూ. | 5400/- |
| 5. | గ్రామ పంచాయతీ విధించే పన్ను శాతం నికర వార్షిక అద్దె విలువపై 10% అనగా 5400÷10 | = రూ. | 540/- |

6. దానికి 8% శాతం లైబ్రరి సెస్సు, నీటి పన్ను కలిపి వసూలు చేయాలి. మేజరు గ్రామపంచాయతీలలో అయితే ఇంకా యూజర్ ఛార్జీల క్రింద లైటింగు పన్ను, డ్రైనేజి పన్నులు గూడ కలిపి వసూలు చేసుకొనవచ్చును.

## 2. మూలధనం విలువపై పన్ను విధింపు విధానం

భవనాల మూల ధర విలువను తెలుసుకే పద్ధతి జి.ఒ.ఎం.ఎస్.నెం. 282 తేది: 12-3-1965లోని 6(1) నియమంలో వివరించబడింది. దీని

ప్రకారం అంచనా వేసిన భూమి విలువ మొత్తం మరియు ప్రస్తుత భవన నిర్మాణ ఖర్చు మొత్తం కలుపగా వచ్చిన దానిలో 10 శాతానికి తగ్గకుండా అరుగుదల క్రింద మినహాయిపంగా వచ్చిన మొత్తాన్ని ఆ భవన క్యాపిటల్ విలువగా పరిగణించాలి.

క్యాపిటల్ విలువపై పన్ను విధించేటప్పుడు స్థలం విలువ అంటే ఆ స్థలాన్ని ఇప్పుడు అమ్మితే ఎంత వస్తుందో అంత అన్న మాట. అదే విధంగా భవనం విలువ అన్నప్పుడు ఆ భవనాన్ని ఇప్పుడు నిర్మిస్తే ఎంత అవుతుందో అంత అన్న మాట. ఒక భవనం తాలుకు స్థలాన్ని విలువ కట్టేటప్పుడు కేవలం ఆ భవనం ఆక్రమించుకున్న స్థలాన్ని మాత్రమే పరిగణలోనికి తీసుకొనరాదు. మొత్తం స్థలాన్ని పరిగణలోనికి తీసుకొని దాని విలువను నిర్ణయించాలి.

**ఉదాహరణ:** 400 చ.మీ. ప్లాటులో కట్టిన భవనం ప్లింత్ ఏరియా 200 చ.మీ. స్థలం విలువ కట్టేటపుడు భవనం ఆక్రమించిన ప్లింత్ ఏరియా కాకుండా మొత్తం విస్తీర్ణం అనగా 400 చ.మీ. విలువ కట్టాలి.

భవనం ప్లింత్ ఏరియా అంటే బేస్‌మెంట్ లెవల్ వద్ద భవనం వెలుపల కొలతలను తీసుకొని భవనం పొడవు వెడల్పుతో హెచ్చు వేస్తే వచ్చేదే. భవనం లోపల కొలతలతో మనకు అవసరం లేదు. ఆ ప్లింత్ ఏరియాకు మాత్రమే విలువ నిర్ణయించాలి.

పై విధంగా ఒక భవనం క్యాపిటల్ విలువను నిర్ణయించిన తరువాత దాని నుండి అరుగుదల క్రింద 10 శాతాన్ని మినహాయించాలి. ఈ మినహాయింపు కేవలం భవనం విలువకే వర్తిస్తుంది గాని స్థలం విలువకు వర్తించదు. అరుగుదల అయ్యేది భవనాలే గాని స్థలం కాదు.

కొన్ని చోట్ల రకరకాలుగా కట్టిన ఇండ్లు కూడా ఉంటాయి.

**ఉదాహరణ:** ఒక ఇంటిలో రెండు ఆర్.సి.సి. గదులు, ఆ రెండు గదులకు ముందు సిమెంటు రేకులతో వేసిన వరండా, వెనుక భాగంలో వంట కోసం వేసిన పూరిపాక ఉందనుకోండి. అలాంటప్పుడు ఆ మూడింటికి వేరువేరుగా విలువ కట్టి మూడింటిని కలుపుకోవాలి. అప్పుడు ఆ ఇంటి మొత్తం కాపిటల్ విలువ వస్తుంది. ఒక భవనంలో రెండు, మూడు అంతస్తులుంటే అన్నింటిని ఒకే రకమైన మెటీరియల్‌తో కట్టినవైతే, వాటన్నిటి విలువను ఒకే రేటుపై కట్టవచ్చు. అలా కాకుండా ఒక్కొక్క రకానికి చెందిన మెటీరియల్‌తో కట్టినవైతే, ఆ రేటును ఆ అంతస్తుకే వర్తింపజేసి అన్ని అంతస్తుల విలువను కలుపుకోవాలి.

### పన్ను మదింపు

| | | |
|---|---|---|
| 1. రెండు ఆర్.సి.సి డాబా గదుల క్యాపిటల్ విలువ రూ. 410×500 | = రూ. | 2,05,000/- |
| 2. ఇటుక గోడలపై పెంకుటిల్లు రెండు గదుల క్యాపిటల్ విలువ రూ. 180×350 | = రూ. | 63, 000/- |
| 3. ఇటుక గోడలపై పూరి కప్పుతో వేసిన రెండు గదుల విలువ రూ. 120×350 | = రూ. | 42,000/- |
| 4. స్థలం విలువ 500×500 | = రూ. | 2,50,000/- |
| **మొత్తం విలువ** | **= రూ.** | **5,60,000/-** |
| అరుగుదల క్రింద (క్రొత్త భవనం) తరుగుదల వర్తించదు | | |
| భవనం నికరం క్యాపిటల్ విలువ | = రూ. | 5,60,000/- |
| పంచాయతీ విధించు పన్ను రేటు 100రూ.కు 0.50 పైసలు అయితే సదరు భవనంపై విధించు పన్ను | = రూ. | 2800/- |
| లైబ్రరి సెస్సు 8% | = రూ. | 224/- |
| నీటి పన్ను 20% | = రూ. | 560/- |
| డ్రైనేజి సెస్సు 10% | = రూ. | 280/- |
| లైటింగ్ సెస్సు 5% | = రూ. | 140/- |
| **మొత్తం** | **= రూ.** | **4004/-** |

కమీషనర్ మరియు ఇన్‌స్పెక్టర్ జనరల్, రిజిస్ట్రేషన్ 2 స్టాంపుల

శాఖ, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ వారి ప్రొసీడింగ్స్ నెం. యం. ఎ 5/9380/2006 తేదీ. 28.7.2006 ప్రకారం భవనాల విలువ నిర్ణయించడానికి రేట్ల వివరాలను ఈ క్రింది విధంగా యిచ్చియున్నారు.

| వివరము | మాస్టర్ ప్లాన్ పరిధిలోని గ్రామ పంచాయితీలు | మాస్టర్ ప్లాన్ పరిధిలో లేని గ్రామ పంచాయితీలు |
|---|---|---|
| 1. ఆర్.సి.సి. డాబా చ.అ. 1కి (గ్రౌండు, 1 మరియు 2 ఫ్లోర్లకు) | రూ. 450/- | రూ. 410/- |
| 2. 3 ఆపైఫ్లోర్లకు చ.అ.1కి | రూ. 480/- | రూ. 440/- |
| 3. సెల్లార్, పార్కింగ్ మరియు ఇతరాలు చ.అ. 1కి | రూ. 330/- | రూ. 300/- |
| 4. సినిమాహాళ్ళు, మిల్లులు, ఫ్యాక్టరీలు వగైరా (10 అ॥ ఎత్తున మించి గోడల నిర్మాణం కలిగినవి) చ. అ. 1కి | రూ. 320/- | రూ, 290/- |
| 5. ఆర్.సి.సి. కాకుండా యితర నిర్మాణాలు చ.అ.1కి | రూ. 230/- | రూ. 180/- |
| 6. చవిటి మిద్దెలు (మట్టికప్పు) చ. అ. 1కి | రూ.150/- | రూ. 120/- |
| 7. తాటాకు యిళ్ళు చ.అ.1కి | | |
| గోడలతో | రూ.60/- | రూ.40/- |
| గోడలు లేకుండా | రూ. 30/- | రూ. 20/- |

పై తెల్పిన అన్ని రేట్ల స్థలం విలువ మినహాయించి, అన్ని సౌకర్యాల యొక్క విలువతో కలిపి నిర్ణయించబడినవి.

భవనం విలువ లెక్కకట్టేప్పుడు భవనం వయస్సును ఆధారంగా తీసుకుని తరుగుదల లెక్కించాలి. భవనం వయస్సు 1 నుండి 10 సం॥ల లోపు అయితే తరుగుదల లెక్కించకూడదు. అదే విధంగా భవనం వయస్సు 10 సం॥ పైబడితే సంవత్సరంనకు 1% నుండి 50% వరకు తరుగుదల లెక్కించవచ్చును.

స్థలం విలువను లెక్కించడానికి రిజిస్ట్రేషన్ శాఖ వారు యిచ్చిన సమాచారం ప్రకారం లేదా రిజిష్టరు దస్తావేజు చూపబడిన ధరను ఆధారంగా తీసుకోవాలి.

ఉదాహరణకు ఒక భవన నిర్మాణంలో వివిధ రకాల నిర్మాణాలను ఉపయోగించినప్పుడు ఏ విధంగా పన్ను మదింపు చేయాలో చూద్దాం.

**వివరాలు:-**

| | |
|---|---|
| ఎ) భవనం ప్లింత్ ఏరియా | 1200 చ॥ అ |
| బి) అందులో గల 2 ఆర్.సి.సి డాబాగదుల విస్తీర్ణం | 500 చ॥ అ |
| సి) అందులో యిటుక గోడలపై మెకులతో కప్పువేసిన 2 గదుల వైశాల్యం | 350 చ॥ అ |
| డి) ఇటుక గోడలపై పూరి కప్పు వేసిన 2 గదుల వైశాల్యం | 350 చ॥ అ |
| ఇ) మొత్తం స్థలం వైశాల్యం | 1300 చ॥ అ |

### పన్ను మదింపు చేసే విధానం

| | | |
|---|---|---|
| 1. రెండు ఆర్.సి.సి డాబా గదుల క్యాపిటల్ విలువ రూ. 410×500 | = రూ. | 2,05,000/- |
| 2. ఇటుక గోడలపై పెంకుటిల్లు రెండు గదుల క్యాపిటల్ విలువ రూ. 180×350 | = రూ. | 63, 000/- |
| 3. ఇటుక గోడలపై పూరి కప్పుతో వేసిన రెండు గదుల విలువ రూ. 120×350 | = రూ. | 42,000/- |
| 4. స్థలం విలువ 100×1300 | = రూ. | 1,30,000/- |
| **మొత్తం విలువ** | **= రూ.** | **4,40,000/-** |
| క్రొత్త భవనం కనుక నియమాల ప్రకారం తరుగుదల వర్తించదు. | | |
| భవనం నికర క్యాపిటల్ విలువ | = రూ. | 4,40,000/- |
| పంచాయతీ విధించు పన్ను రేటు 100రూ.కు 0.50 పైసలు అయితే సదరు భవనంపై విధించవలసిన పన్ను | = రూ. | 2200.00/- |
| లైబ్రరి సెస్సు 8% | = రూ. | 176.00/- |
| నీటి పన్ను 20% | = రూ. | 440.00/- |
| లైటింగ్ సెస్సు 5% | = రూ. | 110.00/- |
| డ్రైనేజి సెస్సు 10 % | = రూ. | 220.00/- |
| మొత్తం విధించవలసిన పన్ను | = రూ. | 3146.00/- |

# పంచాయతీల పరిపుష్టికి పన్నులు - ఫీజులు - లీజులు తప్పనిసరి

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994 ప్రకారం, పన్నులు, రుసుములు విధించడానికి గ్రామ పంచాయతీలకు విస్తృతమైన అధికారాలు ఇచ్చింది. సదరు అధికారాలను ఉపయోగించుకొని గ్రామ పంచాయతీలు ఈ క్రింద తెలిపిన పన్నులను విధించి, వసూలు చేసుకొని ఆర్థిక పరిపుష్టిని సాధించుకొనవచ్చును.

**ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షను 60వ విభాగం ప్రకారం తప్పనిసరిగా విధించవలసిన పన్నులు:**

1. ఇంటిపన్ను
2. కొలగారం లేక కాటా రుసుం
3. ప్రభుత్వం విధించవలసిందిగా ఆదేశించిన ఇతర పన్నులు

**ఐచ్ఛికంగా విధించదగిన పన్నులు**

4. ప్రకటనలపై పన్ను
5. వ్యవసాయ భూములపై పన్ను
6. ఖాళీగా వున్న భూములపై భూమి శిస్తు
7. గ్రామంలో గల క్వారీల నుండి తీసుకొని పోతున్న వస్తువులపై (ఖనిజాలూ, మైనర్ ఖనిజాలు కానట్టి ప్రభుత్వం వసూలు చేయు సీనరేజి రుసుంపై సర్‌చార్జి)
8. భూమి శిస్తు లేక స్థానిక శిస్తుపై సర్‌చార్జి
9. ఇండ్లపై ప్రత్యేక పన్ను

**రుసుములు**

10. తమ నియంత్రణ క్రింద గల పోరంబోకులను లేక భవనాలను, చావళ్ళను, సత్రాలను ఉపయోగించినందుకు
11. నారు మళ్ళకు నీరు సరఫరా చేసినందుకు
12. దహన, ఖనన ప్రదేశాలను వాడుకొన్నందుకు
13. కుక్కలు, పందుల పైన
14. ఆక్రమణల పైన
15. మార్కెట్ల పైన
16. బండ్ల స్టాండ్లు వాడుకొన్నందుకు
17. పశువధశాలల పైన
18. యంత్రాల స్థాపనకు
19. భవన నిర్మాణాల పైన
20. లే అవుట్ల పైన

ఇన్ని అవకాశాలు వుండి గూడ గ్రామపంచాయతీలు ప్రస్తుతం కేవలం కొన్నింటిపైననే పన్నులు, రుసుములు విధించి వసూలు చేస్తున్నాయి. ఇందుకు పంచాయతీ పాలకులపైన గానీ, ప్రజాప్రతినిధులపైన గానీ నింద వేయవలసిన అవసరం లేదు. ఎందుకంటే వారికి పన్నులు ఎలా విధించాలి, ఫీజులు, లీజులు ఏ దామాషా ప్రకారం, ఎంత శాతము విధించాలి అనే దాని పైన సరి అయిన అవగాహన లేకపోవడం ఇందుకు కారణంగా ఇక్కడ గుర్తించాలి. అందుకు ప్రభుత్వం ప్రస్తుతమున్న పంచాయతీ అధికారులకు అనగా పంచాయతీ కార్యదర్శితో పని చేసే బిల్లు కలెక్టరు మొదలుకొని గుమస్తా, పంచాయతీ కార్యదర్శి, ఇ.ఒ.పి.ఆర్ అండ్ ఆర్.డిలకు అవసరమైతే పర్యవేక్షణ అధికారులైన ఎం.పి.డి.ఒ., డి.ఎల్.పి.ఒ., డి.పి.ఒలకు గూడ పై వాటి పైన ప్రత్యేక శిక్షణ ఇస్తే బాగుంటుంది.

ఉదాహరణకు గత రెండు మూడు సంవత్సరాలుగా మన రాష్ట్రంలో ఇందిరమ్మ పథకం క్రింద కొన్ని లక్షల ఇళ్లు పూర్తి అయినాయి. వాటి పైన యింకా చాలా గ్రామ పంచాయతీలు ఇంటి పన్నులు విధించి, వసూలు చేయలేదు. కారణం పంచాయతీ కార్యదర్శులకు ఇంటి పన్ను విధించడంలో సరైన అవగాహన లేక పోవటమే. అందువలన ప్రతి పంచాయతీ కొన్ని వేల రూపాయలు నష్టపోతున్నది.

రెండవది లే అవుట్లు, బిల్డింగ్ రూల్సుపై జారీచేసిన జి.ఒ.ఎం.యస్.నెం. 67 తేది: 26-2-2001 పైన గూడ పంచాయతీ కార్యదర్శులకు సరైన అవగాహన లేకపోవడం.

తదుపరి గ్రామ పంచాయతీల ఆదాయం దినసరి సంతలు, వారపు సంతల వేలం, పంచాయతీ షాపు రూముల వేలం, చేపల చెరువుల వేలం, ఫలసాయాన్ని ఇచ్చే చెట్లు వేలం వేయడం, పశువుల, గొర్రెల సంతలు వేలం వేయడం, లైసెన్సు ఫీజులు విధించి వసూలు చేయడం, యంత్రాల స్థాపనపై విధించే లైసెన్సు ఫీజులు ప్రకటనలపై వలన గూడ అధిక ఆదాయం వస్తుంది.

మామూలుగా ప్రతి సంవత్సరం గ్రామ పంచాయతీలలో ఇంటిపన్ను రఫ్ డిమాండు జూన్ మొదటి వారానికి తయారు చేసి బిల్లులు వ్రాసి జారీ చేసి సెప్టెంబరు 30వ తేదీన 30% , డిశంబర్ 31వ తేదీన 50%, మార్చి ఆఖరుకు 100% వసూలు చేయాలి. కాని పంచాయతీలు, ఆ ప్రకారం సరైన చర్య తీసుకొని వసూలు చేయనందువలన ప్రజలలో గూడ మార్చి ఆఖరుకు కదా ఇంటిపన్ను కట్టాలి అని మిన్నకుండిపోతున్నారు. చివరకు మార్చి నెలాఖరుకు 100% పన్నులూ వసూలు గాక పంచాయతీలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. కావున పంచాయతీరాజ్ అధికారులు సకాలంలో చర్యలు తీసుకొని ఫీజులు, లీజులు, పన్నులు, వసూలు చేయిస్తే గ్రామపంచాయతీలు ఆర్థికంగా కొంతవరకైనా నిలదొక్కుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాయనడంలో సందేహం లేదు.

*- పి. నాగరాజు,*

*రిటైర్డ్ డి.పి.ఓ., డి.టి.యం. చిత్తూరు, జిల్లా పరిషత్ శిక్షణా విభాగం*

**ప**శు విసర్జితాలు, పశుగ్రాస వ్యర్థాలు ఎరువుగా చేసి పంట పొలాలకు వేయడం అనాదీగా వస్తోంది కాని గ్రామీణ ప్రాంతాలలో లభ్యమయ్యే ఈ ముడిపదార్థాలద్వారా కొన్ని సులభమయిన పద్ధతుల్లో వంటకు, ఇతర అవసరాలకు అవసరమయ్యే వాయువును (Gobar Gas) తయారు చేసుకుని వివిధ రకాలుగా ఉపయోగించుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాలలో గోబర్ గ్యాస్ ఉత్పత్తికి అవసరమయ్యే ముడి పదార్థాలు (పేడ) విస్తారంగా అందుబాటులో ఉంటాయి కాబట్టి, చాలా సులభమైన పద్ధతిలో తక్కువ ఖర్చుతో గోబర్ గ్యాస్ ఉత్పత్తి చేసుకోవచ్చు.

### గోబర్‌గ్యాస్ అంటే ఏమిటి (జీవ సంబంధిత వాయువు)

పునరావృతమయ్యే శక్తి వనరుల్లో గోబర్‌గ్యాస్ ఒకటి. దీనిని అనేక రకాలుగా వినియోగించవచ్చు. జంతువృక్ష సంబంధమైన వ్యర్థపదార్థాలు కుళ్ళినందు వల్ల జీవరసాయన విధానం ద్వారా జీవసంబంధిత వాయువు ఉత్పత్తి అవుతుంది. ఈ రసాయన పద్ధతిలో ఒక రకమైన బ్యాక్టీరియాలు జీవసంబంధిత వ్యర్థాలను ఉపయోగపడే వాయువుగా మార్చుతాయి. ఇదే గోబర్‌గ్యాస్.



- గ్రామీణ ప్రాంతాలలో ఇళ్ళకు గాలి, వెలుతురు తక్కువగా ప్రసారమవుతాయి. కాబట్టి, పిడకలను, కట్టెలను మండించడం వల్ల వచ్చే పొగ ద్వారా ఆరోగ్యానికి హాని కల్గించే విధానం నుండి గోబర్‌గ్యాస్ వాడకం నిరోధిస్తుంది.
- కట్టెల వాడకం తగ్గి గోబర్‌గ్యాస్ అందుబాటులో ఉండటంతో చెట్లు కూడా రక్షింపబడతాయి.

# ఇంధన వనరుల కన్న సహజవనరులు మిన్న

### గోబర్‌గ్యాస్ వల్ల ఉపయోగాలు

*ఇది బహుళార్థక సాధకమయిన గ్యాస్. దీనిని పలు రకాలుగా ఉపయోగించవచ్చు.*

- ఈ గ్యాస్‌తో వంట చేసుకోవచ్చు, దీపాలు వెలిగించవచ్చు, యంత్రాలను నడపవచ్చు
- గోబర్‌గ్యాస్ ఉత్పత్తి అయిన తరువాత పంటలకు ఉపయోగపడే సమృద్ధిగా గల పోషక ద్రవ మిశ్రమాన్ని కూడా ఇస్తుంది.
- ఈగలను, కీటకాలను ఆకర్షించి అంటువ్యాధులను కల్గించే వ్యర్థపదార్థాలు, కుప్పలుతెప్పలుగా ఉండే పేడను లేకుండా చేసే పరిసరాల శుభ్రతకు ఇది సహాయపడుతుంది.



### గోబర్‌గ్యాస్ స్థాపనకు పాటించాల్సిన అంశాలు

- పశువుల ద్వారా వచ్చే పేడ పరిమాణాన్ని బట్టి గోబర్‌గ్యాస్ స్థాపన పరిమాణం ఎంపిక చేసుకోవాలి.
- ప్లాంటును పశువులశాల దగ్గరగా ఏర్పాటు చేసుకోవాలి.
- గ్యాస్‌ను దేని వినియోగానికి వాడతామో దానికి దగ్గరగా ప్లాంటు ఉండేటట్లు చూసుకోవాలి.
- సూర్యరశ్మి, గాలి, వెలుతురు సమృద్ధిగా ఉన్న బహిరంగ ప్రదేశంలో మాత్రమే ప్లాంటు ఏర్పాటు చేసుకోవాలి.
- మంచి నీటికి ఉపయోగపడే బావికి ఈ నిర్మాణం కనీసం 15 మీటర్లు దూరంలో ఉండేటట్లు చూసుకోవాలి.

### గోబర్‌గ్యాస్ ప్లాంటు నిర్మాణం చేసుకునే పద్ధతి

గోబర్‌గ్యాస్ ప్లాంట్‌లో ముఖ్యంగా నుయ్యి మాదిరిలో గుండ్రటి కవ్వాలా ఒక ట్యాంక్‌ను నిర్మించుకోవాలి. దీనిని డైజెస్టర్ (లేదా) పులియబెట్టే తొట్టి అంటారు. ఇది పూర్తిగా లేదా పాక్షికంగా భూగర్భంలో ఉంటుంది. దీని పరిమాణం మనకు కావలసినంత పరిమాణంలో నిర్మించుకోవచ్చు. సామాన్యంగా 3.5 నుండి 6.0 మీటర్లు లోతు, 6 మీటర్ల వైశాల్యంతో నిర్మిస్తారు. ఈ పాత్రను లోపలి భాగంలో రెండుగా విడదీస్తూ ఒక గోడ నిర్మించాలి. దీనిలో ఒక ప్రక్క నీటితో కలిపిన పేడ పడటానికి, రెండోవైపు డైజెస్ట్ అయిన స్లర్రీ పడటానికి ఉంటుంది.

అదేవిధంగా ఈ పాత్ర నుంచి విడుదలైన వాయువును పట్టుకోవడానికి ఒక సాధనం అమర్చుకోవాలి. దీనిని వాయు సంగ్రహణ పాత్ర అని అంటారు. ఈ పాత్ర పైభాగం నుంచి గ్యాస్ బర్నర్ వరకూ లేదా ఇతర ప్రయోజనాలకు తగిన గొట్టం ఏర్పాటు చేసుకోవాలి.



Sthanika_BW_Nov11.indd 30 01/11/11 3:08 PM

# జిల్లాల వారీగా నెడ్‌క్యాప్ (NEDCAP) సంస్థ చిరునామాలు

*ప్రధాన కార్యాలయం*
వి.సి. & మేనేజింగ్ డైరెక్టర్,
**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
రిజిష్టర్ ఆఫీసు : 5-8-208/2, పి కాంప్లెక్స్,
నాంపల్లి, హైదరాబాద్ - 500 001
ఫొన్ : 91-04-23202391

*జిల్లాల వారీగా . . .*

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
ప్లాట్ నెం. 34, కైలాష్ నగర్
ఆదిలాబాద్ - 504 002
ఫొన్ : 08732 226796/ 900050968

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
5-1-94, గణపతి నగర్,
టి.డి.డి. కళ్యాణమండపం, మెయిన్ రోడ్
సంగారెడ్డి, ఫొన్ : 08455 276564
సెల్ : 9703364433

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
అగ్రో భవన్, ఫస్ట్ ఫ్లోర్, క్లాక్ టవర్ దగ్గర
అనంతపూర్ - 515 001
ఫొన్ : 08554 241060
సెల్ : 900050969

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
హౌస్. నెం. 5-4-93/5
మార్కెట్ యార్డ్, బీట్ మార్కెట్
నల్గొండ -508002
ఫొన్ : 08682 22447
సెల్ : 900050980

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
హౌస్ నెం. 10-161, గాంధీ రోడ్
చిత్తూరు - 517 001
ఫొన్ : 08572 233187
సెల్ : 90005 50970.

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
C/O ఆఫ్‌షైర్స్ ఆఫ్ ఎపియస్ఎఐడిసి ఆఫీస్
యంపిడిఓ ఆఫీస్ ఎదురుగా, రైల్వే ఫీడర్స్ రోడ్
నెల్లూరు- 524001. ఫొన్ : 0861-2326616.

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
6-275, శంకరపురం, కెనరా బ్యాంక్ దగ్గర
కడప-516 001. ఫొన్ : 08562-244151.

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
హౌస్ నెం. 6-2-80, సుభాష్ నగర్
రాధాకృష్ణ థియేటర్ దగ్గర
నిజామాబాద్- 503 002
ఫొన్ : 08462 237724

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
జల్ భవన్, సెకండ్ ఫ్లోర్ కలక్టరేట్
కాకినాడ -533 004, తూర్పు గోదావరి జిల్లా
ఫొన్ : 0884 2375974. సెల్ : 9000550972

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
58-13-4 (బి), రాఘవాచారి స్ట్రీట్
ఇండియన్ క్రాస్ బిల్డింగ్ దగ్గర, సంతపేట,
ఒంగోలు -523001. ఫొన్ : 08592 233043.

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
హౌస్ నెం. 27-2-34, ఫస్ట్ ఫ్లోర్, కన్నవారి తోట
చంద్రమౌళి బిల్డింగ్స్, మెడికల్ కాలేజ్ రోడ్,
గుంటూరు-522 004. ఫొన్ : 0863-2350114.

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
ప్లాట్ నెం. 143, 3-2-74
యస్‌బిహెచ్ కాలనీ, వెంచర్ II, ఎల్.బి.నగర్
హైదరాబాద్ - 500074. రంగారెడ్డి జిల్లా.
ఫొన్ : 040-24036869

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
జిల్లా కోర్టు వీధి ఎదురుగా, కవిరాయ్ నగర్
వైరా రోడ్డు, ఖమ్మం-507002
ఫొన్ : 08742 228904.

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
6-18, ఇందిరానగర్ కాలనీ
శ్రీకాకుళం - 532 001
ఫొన్ : 08942 221171 సెల్ : 9000550985.

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
హౌస్ నెం. 2-8-191, ఆర్ బి గెస్ట్‌హౌస్ ప్రక్కన
ముకురంపుర, కరీంనగర్- 505002.
ఫొన్ : 08782 261798.

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
డోర్. నెం. 43-5-58
రైల్వే న్యూ కాలనీ, పాల్లకి స్కూల్ ప్రక్కన,
విశాఖపట్టణం-530016. ఫొన్ : 08912736678.

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
ప్లాట్ నెం. 160, నాల్గవ రోడ్డు, ఆర్‌టిసి కాలనీ,
విజయవాడ - 5200008.
ఫొన్ : 0866 2472586. సెల్ : 9000550976.

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
ఎమ్ఐజిహెచ్-134
యస్‌బిఐ ట్రైనింగ్ కాలేజ్ రోడ్
అలకనంద కాలనీ, విజయనగరం- 535 003.
ఫొన్ : 08922 276866.

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
రూం నెం. 138, ఈస్ట్ సెల్లార్‌వింగ్,
న్యూ కలక్టరేట్ కాంప్లెక్స్, కర్నూలు-518 002.
ఫొన్ : 08518 277975 సెల్ : 94414 69947

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
హౌస్ నెం. 2-714/4, సుబేదారి
ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ దగ్గర
హనుమకొండ- 506 001. వరంగల్ జిల్లా.
ఫొన్ : 0870 2578613

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
హౌస్ నెం. 1-6-148, పాత బస్టాండ్ దగ్గర
ఎమ్‌బిసి చర్చ్ ఎదురుగా
మహబూబ్‌నగర్-509001.
ఫొన్ : 08542 242889.

**నెడ్‌క్యాప్ లిమిటెడ్**
డోర్ నెం. 12-60 యస్‌బిఐ కాలనీ.
సెయింట్ క్జేవియర్ నగర్, ఏలూరు-534 007.
పశ్చిమ గోదావరి జిల్లా. ఫొన్ : 08812 230285



Sthanika_BW_Nov11.indd 31 01/11/11 3:08 PM





- డైజెస్టర్‌కు ఒక ప్రక్కన పేడను సమపాళ్ళ నీళ్ళతో కలుపుకోవటానికి 4.5 నిష్పత్తిలో వీలైన ఒక తొట్టెను నిర్మించుకోవాలి. దీనినే ద్రవ మిశ్రమ తొట్టె అని అంటారు. ఈ తొట్టె నుండి పేడ నీళ్ళ మిశ్రమం డైజెస్టర్ అడుగు భాగానికి వెళ్లడానికి అనువుగా ఒక సిమెంటు గొట్టం అమర్చుకోవాలి.
- అదేవిధంగా డైజెస్టర్‌కు రెండవ ప్రక్కన డైజెస్ట్ అయిన పేడ డైజెస్టర్‌పై భాగం నుండి బయటకు రావడానికి వీలుగా మరొక గొట్టం అమర్చుకోవాలి. ఈ బయటకు వచ్చే చిక్కని ద్రవ వ్యర్థ పదార్థం ఈ గొట్టం ద్వారా కంపోస్టు పిట్‌కు వెళ్ళే విధంగా ఏర్పాటు చేసుకోవాలి.

## గోబర్‌గ్యాస్ ఉత్పత్తికి అనుసరించాల్సిన పద్ధతులు

- పశువుల పేడను సరిపాళ్ళల్లో కలుపుకోవాలి. ఉదా: నాలుగు భాగాల పేడకు 5 భాగాల నీటిని కలపాలి.
- మట్టి లేదా ఇసుక లేకుండా గోబర్‌గ్యాస్ నీటి మిశ్రమం ఉండాలి.
- మొదటిగా వచ్చే వాయువును వినియోగించకూడదు. దీనిలో ఆక్సిజన్ ఉంటుంది. కాబట్టి ఈ వాయువును వాతావరణంలోకి విడుదల చేయాలి.
- గ్యాస్ రావడం ప్రారంభగానే కనెక్షన్‌లో ఏ విధమైన లీకేజిలు లేకుండా సరిచేసుకోవాలి.

## గోబర్‌గ్యాస్ నిర్మాణంలో ప్రభుత్వం పాత్ర

ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమీషన్ గ్రామీణ ప్రాంతాల్లో గోబర్‌గ్యాస్ ప్లాంటు నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సమయం అందజేస్తుంది. అంతేకాదు, (NEDCAP - Non -Conventional Energy development of AndhraPradesh) సాంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థ ద్వారా మన ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో గోబర్‌గ్యాస్ ప్లాంట్‌ను నిర్మించుకోవడానికి అనేక రకాలైన సబ్సిడీలపై రుణాలను అందిస్తుంది. ఈ సంస్థ శాఖలు మన రాష్ట్రంలో జిల్లాలవారీగా అందుబాటులో ఉన్నాయి. వాటిని సంప్రదిస్తే గోబర్‌గ్యాస్ నిర్మాణానికయ్యే ఖర్చు వివరాలు, సబ్సిడీ వివరాలు, ఇతర వివరాలు మనకు అందుబాటులో ఉంటాయి.

సాంప్రదాయేతర ఇంధన వనరులకు సంబంధించిన ఈ ప్రభుత్వ సంస్థ ప్రతి జిల్లాలలోనూ గోబర్ గ్యాస్, ఇతర సాంప్రదాయేతర ఇంధన వనరులను సమకూర్చుకునే లబ్ధిదారులుకు ఎన్నో ప్రోత్సాహకాలను, సబ్సిడీలతో కూడిన రుణాలను, సాంకేతిక సహకారాన్ని, అన్నింటికి మించి ప్రోత్సాహక బహుమతులను కూడా అందజేస్తుంది.




ఈ తరుణంలో గ్రామీణ ప్రాంతాలలో కూడా ప్రస్తుత పరిస్థితుల్లో ఉపయోగిస్తున్న ఎల్.పి.జి. గ్యాస్, కిరోసిన్, కట్టెలు వంటి వాటి ధరలు రోజురోజుకి పెరిగిపోవడమే కాక, వాటికి సంబంధించిన వనరులు భవిష్యత్‌లో తగినంత లభించకపోవచ్చు. కాబట్టి గ్రామీణ ప్రాంతాలలో దొరికే సహజవనరులను వినియోగించి మన అవసరాలకు సాంప్రదాయేతర ఇంధన వనరులు ఉపయోగంలోకి తేవడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు చేసిన వాళ్ళమవుతాం.

*- యం. ప్రదీప్‌కుమార్,*
*రీసెర్చ్ అసోసియేట్, సి.డబ్ల్యు.ఎస్, అపార్డ్*



Sthanika_BW_Nov11.indd 32 01/11/11 3:08 PM

# బహుముఖ ప్రజ్ఞానిధి
# సర్. శొంఠి వెంకట రామమూర్తి

**మహామేధావిగా, పరిపాలనా దక్షునిగా, గణిత శాస్త్రవేత్తగా, రామపాదసాగర్ ప్రాజెక్టు రూపశిల్పిగా చిరస్మరణీయులైన వారు శొంఠి వెంకట రామమూర్తి**

**శొంఠి వెంకట రామమూర్తి 1888 ఆగష్టు 1న, రాజరాజేశ్వరమ్మ, వెంకట రమణయ్య దంపతులకు విశాఖపట్నంలో జన్మించారు. తండ్రి వెంకట రమణయ్య పబ్లిక్ వర్క్స్ శాఖలో ఇంజనీర్‌గా పనిచేశారు. రామమూర్తి విశాఖపట్నంలో మెట్రిక్, ఎఫ్.ఎ., బి.ఏ ఆనర్స్ పరీక్షలలో మద్రాసు ప్రెసిడెన్సీలో సర్వప్రథములుగా ఉత్తీర్ణులయ్యారు.**

భారత ప్రభుత్వ స్కాలర్‌గా, టాటా వారి నుండి విద్యార్థి వేతనం అందుకొని కేంబ్రిడ్జిలో గణితశాస్త్రంలో ట్రైపాస్ పట్టాను ప్రథమశ్రేణిలో అందుకొన్నారు.

1911లో ఐ.సి.యస్.లో ఉత్తీర్ణులైన ముగ్గురు భారతీయులలో ప్రథములుగా ఉత్తీర్ణులై 1912లో సేలం జిల్లా సెర్మాదేవి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా నియమింపబడ్డారు. అప్పట్లో సేలం జిల్లాలో కార్లుండేవి కావు. కలెక్టర్‌తో పాటు గ్రామాలలో పర్యటిస్తూ ప్రజల పరిస్థితులను గమనించే వారు. ఒక్కోసారి ఉదయాన్నే గుర్రాలపై వెళ్ళి తనిఖీలు చేసేవారు

గ్రామీణులు విద్యావంతులు కావాలన్న ఆశయంతో, గ్రామ ప్రజలు, పంచాయితీల ఆర్థిక సహకారంతో గ్రామ ప్రాంతాల్లో పాఠశాలలు ప్రారంభించారు. గ్రామ పెద్దల సహకారంతో కల్లిడైకురుచ్చి గ్రామంలో ఒక సంస్కృత పాఠశాలను ప్రారంభించారు.


తమిళనాడులో వేర్వేరు జిల్లాల్లో కలెక్టరుగా పనిచేశారు. 1939 మార్చిలో సర్ ఆర్థర్ హోప్ మద్రాసు గవర్నరుగా వున్నపుడు రామమూర్తిని మద్రాసు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. **మద్రాసు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన కార్యదర్శిగా నియమింపబడిన తొలి భారతీయుడు శొంఠిరామ మూర్తి.** 1942లో రామమూర్తి మద్రాసు గవర్నర్‌కు సలహాదారునిగా నియమింపబడ్డారు.

1943 డిసెంబర్ 11 న రామమూర్తి ఆంధ్ర విశ్వవిద్యాలయ స్నాతకోపన్యాసమిచ్చారు. ఛాన్సెలర్‌గా గవర్నర్ కూడా సభలో ఆ సభలో ఆసీనులై వున్నారు. రామమూర్తి తమ ఉపన్యాసంలో భాగంగా, మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతం నిర్లక్ష్యానికి గురైనట్లు వివరించారు. పరిస్థితులను చక్కదిద్దటానికి గవర్నర్ ఆమోదం తెలిపారు.

అడ్వైజర్ హోదాలో రామమూర్తి బళ్ళారి వెళ్ళారు. తుంగభద్ర జలాలను మద్రాసు-హైదరాబాద్ రాష్ట్రాల మధ్య విభజించడం జటిలమైన సమస్యగా వుండేది. ఆ సమస్యను గవర్నరుతో చర్చించి ఆమోదం పొందారు. మద్రాసు, మైసూరు, హైదరాబాద్ ప్రభుత్వ ప్రతినిధులతో మూడు రోజులు చర్చించి మూడు ప్రాంతాల అభివృద్ధి కోసం కృషి చేసి 'తుంగ భద్ర ప్రాజెక్టు నిర్మాత'గా పేరు గడించారు.

1942లో అభివృద్ధి విషయాల గురించి ఆలోచిస్తూ గోదావరి నదీ జలాలు 7 శాతం మాత్రమే ప్రజలకు ఉపయోగపడుతున్నాయని, తక్కిన నీరు సముద్రం పాలవుతుందని తెలుసుకొన్నారు.

గోదావరి నదిపై పోలవరం సమీపంలో పాపి కొండల వద్ద ఒక బ్రహ్మాండమైన డ్యామ్ నిర్మిస్తే. ఆంధ్రప్రాంతం సస్యశ్యామలం కాగలదని ప్రముఖ ఇంజనీర్ ఎల్. వెంకట కృష్ణయ్యకు సూచించగా, ఆయన



నిర్మాణం చేపట్టాలని సూచించారు.

ఆ ప్రాజెక్టు ముఖ్యోద్దేశం ధాన్యం పండే 27 లక్షల 50 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా చేయడం. ఆ డ్యామ్ నిర్మాణానికి రూ. 67 కోట్లు ఖర్చు కాగలదని, ఏడాదికి 11 లక్షల టన్నుల ధాన్యం పండుతుందని, 1942 టన్నుల ధాన్యం విలువ రూ. 27.5 కోట్లు వుండగలదని అంచనా వేశారు.

ఈ ప్రాజెక్టు వల్ల 1,50,000 కిలో వాట్ల విద్యుచ్ఛక్తి కూడా లభ్యమవుతుందని అంచనా వేశారు. అంతేకాక 358 మైళ్ల నిడివిగల కొత్త జలమార్గాలు ఏర్పడి రాక పోకలకు, సరకుల రవాణాకు ఉపయోగపడుతుందని, ఈ విధంగా రాష్ట్రం ఆర్థికాభివృద్ధి చెందుతుందని నిరూపిస్తూ, డ్యామ్‌ల నిర్మాణంలో నిపుణుడైన, డా.జె.ఎల్.శావెజ్ ను అమెరికా నుండి పిలిపించారు.

డ్యామ్ నిర్మాణానికి నైజాం ప్రభుత్వం అడ్డుపడగా రామ మూర్తి మద్రాసు ప్రెసిడెన్సీ చీఫ్ సెక్రటరిగా హైదరాబాద్ వెళ్ళి, ప్రధాన




Sthanika_BW_Nov11.indd 22 01/11/11 3:08 PM

మంత్రి మిర్జా ఇస్మాయిల్, కన్సల్టింగ్ ఇంజనీర్ ఆలీ నవాజ్‌జంగ్‌లతో చర్చలు జరిపారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల సింగరేణి బొగ్గు గనులకు ఏ మాత్రం నష్టం కలగదని స్పష్టం చేశారు. అయినా వారు వినలేదు.

అప్పటికి రామమూర్తి సర్వీస్ నుండి రిటైరయ్యారు. అయినా ఆయన ఢిల్లీ వెళ్లి ప్రధాని నెహ్రూ, ఆర్థికమంత్రి జాన్‌మత్తయ్ గారిని కలుసుకొని రామపాదసాగర్ నిర్మాణం వల్ల కలిగే లాభాలను వివరంగా తెల్పారు.

1946లో రామమూర్తి వైస్‌రాయ్ లార్డ్ వేవెల్‌ను కలుసుకొని ప్రాజెక్టు వివరాలు చెప్పారు. వేవెల్ తన ప్రత్యేక కార్యదర్శి వి.పి. మీనన్‌కు రామపాదసాగర్ ప్రాజెక్టును మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు టైప్ చేయమని ఆదేశించాడు.





అంతా జరిగాక ఉత్తర్వులు జారీ చేయటం తెలుసుకొన్న తమిళ అధికారులు, ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 120 కోట్లు ఖర్చు కాగలదని, దానిని నిర్మించడం వల్ల లాభమేమీ వుండదని నివేదికలు పంపారు. డా॥ కె.యల్ రావు ఎంతో శ్రమకోర్చి రామపాదసాగర్ వల్ల ఏమాత్రం నష్టం జరగదని నివేదికలు పంపినా ప్రయోజనం లేకపోయింది. రామమూర్తి భగీరథ ప్రయత్నం విఫలమైంది.

రామమూర్తి బెంగాల్ కరువు కారణం నివేదిక కమిటీ సభ్యులుగా కలకత్తా వెళ్ళారు. ఆహార సరఫరా ఏర్పాట్లు, వ్యవసాయోత్పత్తి ధాన్యం రవాణాకు తగిన ఏర్పాటు సూచిస్తూ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి పంపింది. ఆహార వ్యవసాయ సంస్థ కమీషన్ సభ్యులుగా ఐక్యరాజ్య సమితి వాషింగ్టన్‌కు పంపిన భారత ప్రతినిధి వర్గంలో ప్రత్యామ్నాయ ప్రతినిధిగా వెళ్ళారు.

1947 మే లో 2 వారాలు బొంబాయి గవర్నరుగా పనిచేశారు. 1947 సెప్టెంబర్‌లో ఉదయపూర్ దివాన్‌గా పని చేశారు.

1952లో ప్రజా సోషలిస్ట్ పార్టీ అభ్యర్థిగా ఏలూరు నుండి జనరల్ ఎన్నికలలో పోటీ చేశారు. ఎన్నికల చివరి రోజుల్లో రామమూర్తి పోటీ నుండి విరమించుకొన్నట్లు వదంతులు సృష్టించగా రామమూర్తి ఓడిపోయారు.

రామమూర్తి భౌతిక విజ్ఞాన ఆధ్యాత్మిక దర్శనాల సమన్వయం వల్ల విశ్వ కల్యాణం కలుగుతుందని విశ్వసించారు. విదేశాలలో విస్తృతంగా పర్యటించారు. భారతీయ సంస్కృతిని గురించి పలు ఉపన్యాసాలు చేశారు.




రామమూర్తి తాత్విక వ్యాసాలు 'సైన్స్ అండ్ స్పిరిట్' అనే గ్రంథంగా 1961లో వెలువడ్డాయి. ఆ గ్రంథానికి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ పీఠిక రాశారు. తమ ఆత్మకథను 'లుకింగ్ అక్రాస్ ఫిఫ్టీ ఇయర్స్' అన్న పేరుతో వెలువరించారు.

1964లో బ్రిటిష్ ప్రభుత్వం 'సర్' బిరుదంతో సత్కరించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సన్మానించింది.

బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రశస్తిని గడించిన సర్. కొంటి వెంకటరామ మూర్తి జనవరి 9, 1964 న దివంగతులయ్యారు.

- జానమద్ది హనుమచ్ఛాస్త్రి



Sthanika_BW_Nov11.indd 23 01/11/11 3:08 PM

**మూ**డవ సాధారణ ఎన్నికల ద్వారా పంచాయితీరాజ్ సంస్థలకు ఎంపికకాబడిన ప్రజా ప్రతినిధుల పదవీకాలం ఆగస్టు 2011 మాసంతో ముగిసినప్పటికీ, వివిధ కారణాల దృష్ట్యా, పంచాయితీరాజ్ సంస్థలకు ఎన్నికలు నిర్వహించటం సాధ్యం కానందున ప్రజా ప్రతినిధుల స్థానంలో జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 269 (పం.గ్రా.అని (ఎన్నికలు & నిబంధనలు) తేది: 22.8.2011 ద్వారా ప్రత్యేకాధికారులు నియమితులయ్యారు.

# గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారుల విధులు, అధికారాలు

గ్రామపంచాయతీల చట్టబద్ధమైన పరిపాలనకు నియమితులైన ప్రత్యేకాధికారులు వివిధ శాఖలకు చెందిన వారైనందున, పరిపాలనా సౌలభ్యం కోసం విధి నిర్వహణను ఆటంకాలు లేకుండా నిర్వర్తించుటకు గాను వారి బాధ్యతలు, విధులను ఇక్కడ క్లుప్తంగా పొందుపరచటమైనది.

గ్రామ పంచాయతీలలో ఈ దిగువ తెల్పిన పనులు అతి ముఖ్యంగా నిర్వహించవలసియుంటుంది.

1. గ్రామ ప్రజలకు మంచినీటి సరఫరా
2. పారిశుద్ధ్య నిర్వహణ
3. వీధి దీపాల నిర్వహణ
4. మౌలిక సదుపాయాల కల్పన
5. స్వంత ఆదాయ వనరులు సమకూర్చుకోవటం. (పన్నులు, పన్నేతరములు, ఇతర ఆదాయాలు)
6. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయడానికి గాను కావలసిన సహకారాన్నందించటం మొదలైనవి.

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994 ననుసరించి సర్పంచ్‌గా ఎన్నికకాబడిన వారికి సంక్రమించే అన్ని అధికారాలు, ప్రస్తుతం ప్రత్యేకాధికారులుగా నియమించబడిన వారికి సంక్రమిస్తాయి.

ఈ అధికారాలను పురస్కరించుకొని ప్రత్యేకాధికారులు ఈ దిగువ తెల్పిన అధికారులతో విధులు నిర్వర్తించవలసియుంటుంది.

1. గ్రామ పంచాయతీ, పంచాయతీ కార్యదర్శిపై పరిపాలనా పరమైన నియంత్రణాధికారం.
2. గ్రామ పంచాయతీ రికార్డులను పర్యవేక్షించే అధికారం.
3. పంచాయతీ కార్యదర్శి నుండి అవసరం మేరకు తగిన సమాచారం తెప్పించుకునే అధికారం.
4. గ్రామ పంచాయతీ సిబ్బంది పని తీరు - సామర్థ్యంపై నివేదికలు వ్రాసే అధికారం.
5. ఏప్రిల్ -14, జూలై -1, అక్టోబర్ -3, జనవరి -2వ తేదీలలో జరిగే గ్రామసభలకు అధ్యక్షత వహించడం.
6. గ్రామసభలో లబ్ధిదారుల సక్రమ ఎంపిక, లబ్ధిదారులకు సబ్సిడీ/

మార్జిన్ మనీ సక్రమంగా విడుదల అయ్యేలా చూడటం.

7. స్వయం సహాయక సంఘాల సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై సంఘాల పనితీరు మెరుగు పర్చడం, సూచనలు, సలహాలివ్వటం.

8. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు అందే విధంగా చర్యలు చేపట్టటం.

9. గ్రామ పంచాయితీ పరిధిలో జరిగే వివిధ పనులు, పథకాలు తనిఖీ చేసి, లోపాలు కనుగొన్నట్లయితే సంబంధిత శాఖాధికారులకు నివేదిక సమర్పించడం.

10. గ్రామంలో జరిగే అన్ని ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రొటోకాల్ ప్రకారం పాల్గొనే అధికారం.

11. గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు తమ అవసరాల నిమిత్తం చేసే అభ్యర్థనలను విచారించి, సమస్యలను పరిష్కరించే అధికారం.

12. గ్రామ పంచాయితీ నెలవారీ జమాఖర్చులను, బిల్లులను / ఓచర్లను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లయితే కలెక్టరు (సం.వి) వారికి నివేదించే అధికారం.

13. గ్రామ పంచాయితీ స్థిర చరాస్థులకు నష్టము వాటిల్లకుండా పరిరక్షించటం.

14. ఆర్థిక సంవత్సరం తాలూకు ఆదాయం, ఖర్చులు నిమిత్తం పంచాయతీ కార్యదర్శి తయారు చేసే బడ్జెట్‌ను సమీక్షించి అవసరమైన మార్పులు, చేర్పులతో ఆమోదించటం. (బడ్జెట్‌లో జీతభత్యాలు - 30%, మంచినీటి సరఫరా -15%, పారిశుధ్యం - 15%, వీధి దీపాలు - 15%, అభివృద్ధిపనులు-20% ఇతర ఖర్చుల నిమిత్తం 5% కేటాయించినదీ, లేనిదీ గమనించాలి)

15. గ్రామ పంచాయితీ పరిధిలోని లే అవుట్లు, భవన నిర్మాణాల తాలూకు దరఖాస్తులను పరిశీలించి, నియమనిబంధనలకు లోబడి అనుమతులు జారీ చేయడంలోనూ, సాంకేతిక అనుమతుల నిమిత్తం టౌన్ ప్లానింగ్ అధికారులకు సిఫారసు చేయడంలో తగు జాగ్రత్తలు పాటించాలి.

16. ఆర్థిక సంవత్సరం పూర్తయిన పిదప పంచాయతీ కార్యదర్శి తయారు చేసిన గ్రామపంచాయతీ తాలూకు పరిపాలనా నివేదికను ఏప్రిల్ నెలాఖరులోపుగా పై అధికారులకు సమర్పించడానికి గాను పరిశీలించి ఆమోదించాలి.

17. గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం నిమిత్తం ఏర్పాటు చేసిన కమిటీకి ఛైర్మన్‌గా ప్రత్యేకాధికారి వ్యవహరించడమే గాకుండా గ్రామంలో సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని సాధించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలి.

18. గ్రామ ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేయడానికి గాను చేపట్టవలసిన చర్యలు సక్రమంగా నిర్వహిస్తున్నదీ లేనిదీ పర్యవేక్షించాలి. నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడినప్పుడు వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు తగిన చర్యలు చేపట్టాలి.

19. జనన మరణాల నమోదు సక్రమంగా జరుగుతున్నదీ, లేనిదీ పర్యవేక్షించి, అవసరమైనతే విస్తృతప్రచార ఏర్పాట్లు నిర్వహించాలి.

20. గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించే అన్ని రకాల పనులనూ, పర్యవేక్షించాలి. రూ. 5000/-లు పై బడిన పనులకు చెక్కుల ద్వారానే చెల్లింపులు చేయాలి.

21. గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, ఇతర అవసరాల కోసం చేసే కొనుగోళ్ళన్నింటినీ ప్రభుత్వ నియమనిబంధనల ననుసరించి చేయాలి.

22. గ్రామ పంచాయితీకి అదనపు ఆదాయం చేకూర్చేందుకు, నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు, చర్యలు చేపట్టాలి.

23. పనుల నిమిత్తం, కొనుగోళ్ళ నిమిత్తం చెల్లింపులు జరిపేటప్పుడు బిల్లులన్నీ సక్రమంగా ఉన్నదీ, లేనిదీ గమనించాలి. చెక్కులు వ్రాసేటప్పుడు జాగ్రత్త వహించాలి.

24. ప్రభుత్వం వారు వివిధ పథకాల క్రింద విడుదల చేసే నిధులను సదరు పథకాల నియమ నిబంధనల మేరకు మాత్రమే ఖర్చు చేయాలి.

25. అత్యవసర పరిస్థితులలో పంచాయతీ కార్యదర్శితో సంప్రదించి సాధారణ ప్రజల సేవ లేక భద్రత కోసం వెంటనే నిర్వహించవలసినటువంటి ఏ పనినైనా సెక్షన్ - 33 క్రింద చేపట్టే అధికారం ప్రత్యేకాధికారికి ఉంది. ఈ సెక్షన్ క్రింద చేపట్టిన ఏపని అయినా తదుపరి గ్రామసభలో నివేదించాలి. ఈ సెక్షన్ క్రింద చేపట్టే పనులు ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా ఉండకూడదు.

26. చట్టం ద్వారా గాని, ఈ చట్టం అమలు క్రింద చేసిన నియమాల ద్వారా గాని ప్రత్యేకాధికారికి నిర్దిష్టంగా అప్పగించిన అన్ని అధికారాలను, విధులను ప్రత్యేకాధికారి నిర్వర్తించవలెను.

- సంకలనం: **గంధం సత్యవాణి**
ఫ్యాకల్టీ సభ్యులు, అపార్డు

# దెయ్యం

- టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి

**సాధారణ ప్రచురణకు ఎంపికైన గ్రామీణ కథ**

**పెద్దంత తోట మధ్యన లంకంత బంగళా పెద్దాయనది.**

**"ఆ పాడు కొరివి దయ్యాలేవో ఈ తోటలోనో, ఆ బంగళామీదో అగ్గిబడిపోరాదా? కూటికీ, గుడ్డకీ తడుముకునే మన గుడిసెల మద్దెన తారట్లాడి మన ఉసురు దీయకపోతే" అన్నాడు చిన్న రంగడు . . . తగ్గు స్వరంతోనే అయినా, ఆక్రోశంగా.**

**"నోరుముయ్యరా . . . ఎవరైనా ఇన్నారంటే ముందు నీ మక్కెలిరగదన్ని ఆనక కొదవకు నీ పక్కన కూకున్న నేరానికి నా తాట వొలుత్తారు!" అన్నాడు చిన్న రాముడు భయంగా అటూ, ఇటూ చూస్తూ.**

వారిద్దరూ తోటమధ్యని రాగిమాను పెద్దరుగు క్రింద మట్టినేలమీద కూర్చుని ఉన్నారు. వారేకాదు . . . వారి పల్లెకు సంబంధించిన చిన్నా, పెద్దా మగవాళ్ళంతా దాదాపు నలభయి మంది దాకా అక్కడే నేలమీద చెట్ల క్రింద గుంపులు గుంపులుగా నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నారు.

చిన్న రంగడు మళ్ళీ ఏదో అనబోయాడు . . . అంతలో . . .

అంతమంది మనుష్యులూ ఒక్కసారిగా, నిశ్శబ్దంగా కదలిన చిరుసవ్వడి . . . కళ్ళకు కన్పించని, చెవులకు విన్పించని కలకలం ఏదో విచిత్రంగా కదలాడుతూ ధ్వనించింది.

చిన్నరాముడూ, చిన్న రంగడూ కూడా బంగళావైపునకు చూశారు. చిన్న సింహాసనం లాంటి పెద్ద కుర్చీ నెత్తుకుని మోసుకుంటూ ఇద్దరు మనుషులు బంగళా వైపు నుండీ వస్తూ కన్పించారు.

ఐదు నిముషాలలో వారు రావడమూ, రాగి మాను క్రింద పెద్దరుగుమీద ఆ కుర్చీని దించి నిలబెట్టడమూ జరిగిపోయాయి.

మరో రెండు మూడు నిముషాలకు మళ్ళీ కలకలం. ఈసారి కాస్త స్పష్టంగానే . . .

కూర్చున్న వారంతా లేచి నిలబడ్తున్నారు. . . గబగబా చకచకా! చప్పున పైకి లేవలేని ముసలివాళ్ళకు పక్కవాళ్ళు చేయూతలిచ్చి లేపి నిలబెడ్తున్నారు. అందరితో పాటు చిన్న రాముడు, చిన్న రంగడూ కూడా లేచి నిలబడి బంగళావైపు చూశారు మరోమారు.

రాజఠీవితో నడచి వస్తున్నాడు పెద్దాయన తెల్లటి దుస్తులతో మరింత తెల్లగా వెలిగిపోతూ.

"దండాలయ్యా !"

మూకుమ్మడి నమస్కారాలందుకుంటూ వెళ్ళి రచ్చబండ మీద వెల్వెట్ మెత్తలు అందంగా అతికున్న పెద్దకుర్చీలో మహరాజులా దర్జాగా కూర్చున్నాడు.

"దొరా" అన్నాడు చిన్న స్వామి ఉపోద్ఘాతంగా.

"ఊ . . . కానీ . . ." అన్నట్లుగా చూశాడు పెద్దాయన.



"దొరా, రోడ్డారకాడ పల్లెలో రాత్రుల్లో కొరివిదయ్యాలు తిరుగుతున్నాయట! మూడు నెలల్లో నాలుగడ్డపిండ్లు కాలిపోయి ఆ యిండ్ల మనుషులు ఏసుకున్న గుడ్డల్లవ్వ, ఇంకేం లేకుండా అన్యాయం అయిపోయారు. సీకటిబడ్తే సాలు ఆ పల్లెలో ఒక్క మనిషికీ కడుపారా తిండిలేదు, కంటూరా నిద్రలేదు. గోడాడి పోతున్నారు దొరా!" అన్నాడు చిన్నసామి.



Sthanika_BW_Nov11.indd 24 01/11/11 3:08 PM

బనినికొండ మీద నుండీ బండరాళ్ళు దొర్లిపడినట్లుగా పెద్దగా నవ్వాడు పెద్దాయన.


"వాళ్ళ పల్లెమీద కొరివిదయ్యాలు పడ్తే నేనేం చేసేదిరా? నేనేమయినా మంత్రగాడినా? కాకపోతే భూతవైద్యుడినా?" అన్నాడు నవ్వడం అపిన తరువాత.

"మంత్రాలు, తంత్రాలు అన్నీ అయినాయి దొరా! కొరివి దయ్యాలు లొంగేరకంగా కన్పించడం లేదు".

"అయితే నేనేం చేసేదిరా?'

"గొప్ప ధరమ ప్రభువులు . . . తమరే ఏదయి-ఎవా దారి చూడాల!"

"సరే రా . . . ఇంతమంది ఎంతో ఆశతో నన్నాశ్రయించి వచ్చారు. ఏదో ఒక ఆలోచన చేస్తాను. అందర్నీ పదిరోజులు ఆగి రమ్మని చెప్పు" అన్నాడు పెద్దాయన ఆలోచనగా.




అలా అంటూనే కుర్చీలోంచి లేచి చకచకా రచ్చదిగి వచ్చేశాడు.

వంగివంగి దండాలు పెడ్తున్న పల్లె ప్రజల మధ్య నుండీ టీవిగా నడచి బంగళావైపు వెళ్ళిపోయాడు చరచరా.

సభ ముగిసింది !

* * * * *

**ప**ది రోజుల తరువాత పెద్దాయన తోటలో ఆశగా పోగయిన రొడ్డువారకాడపల్లె ప్రజలకు పెద్దాయన దర్శనమే లభ్యం కాలేదు. 'ఆ విషయంగానే తీవ్రంగా ఆలోచిస్తున్నారనీ ఇరవయి రోజులు ఆగివస్తే ఏదో ఒకటి చేస్తారనీ' కబురు వచ్చింది బంగళాలోపలినుండీ.

* * * * *

**చా**లా భారంగా ఆ ఇరవయి రోజులూ గడిచాయి. పెద్దాయనను దర్శనం చేసుకున్నాక గడచిన మొత్తం . . .ఆ నెలరోజులలోనూ రొడ్డువారకాడ పల్లెమీద కొరివిదయ్యాలు నాలుగు పర్యాయాలు దాడి చేసాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకుని ఏం లాభం? దయ్యాల దెబ్బకు నాలుగు గుడిసెలు, రెండు అర్ధపిండ్లు ఆహుతయిపోయి ఆ ఇండ్ల వాళ్ళూ బజార్న పడిపోయారు!

* * * * *

ఎట్టకేలకు పల్లె ప్రజలకు పెద్దాయన దర్శనమైంది.

మధ్యలో జరిగిన నష్టాలు, కష్టాలు పెద్దాయనకు సవివరంగా ఏకరవు పెట్టబడ్డాయి చిన్నస్వామి ద్వారా.

"ఒకపని చెయ్యండిరా . . . అంజనేయస్వామి గుట్టకింద నా స్థలం ఉంది కదా! ఆ రాళ్ళ చేన్లో అందరూ పోయి ఇండ్లు కట్టుకోండిరా!" అన్నాడు పెద్దాయన ఉదారంగా.

నిజానికి ఆ భూమి రాళ్ళ చేను కాదు . . రాళ్ళ గుట్టే ! కానయితే భయంతో చచ్చిపోతున్న జనాలకు మరోదిక్కు దగ్గరి దాపుల్లో లేదు.

సంశయిస్తూనే చిన్నరంగడు అరుగు క్రిందికి పోయాడు.

పెద్దాయన కాళ్ళ వైపు అరుగుమీద చేతులు పెట్టి మొక్కుకుంటూ "అక్కడెక్కడా నీటి చుక్కలేదు దొరా!" అన్నాడు వినయంగా, భయంగా.

"అవును దొరా !" అంటూ గుంపులోంచే వత్తాసు పలికాడు చిన్నరాముడు.

అప్పుడు అవునవునన్నారు ఒకరి తరువాత మరిఒకరు.

చిన్నసామి మధ్యవర్తిత్వంతో అరగంటపాటు సభ కొనసాగింది మళ్ళీ.

పెద్దాయన తన ఖర్చుతో ఆ ప్రాంతంలో రెండు బోరుబావులు తవ్వించి నీటి అదరువుకు ఏర్పాటు చెయ్యడానికి అంగీకరించాడు.

స్థలమిచ్చినందుకూ, బోరుబావులు ఏర్పాటు చేయించినందుకూ ప్రతిగా ఊరు ఖాళీ అయ్యాక రొడ్డువార కాడ పల్లెను బుల్‌డోజర్లతో నేల మట్టం చేసేసి, పెద్దాయన స్వాధీనపరచుకుని కొరివిదెయ్యాలతో తన తంటాలేవో తను పడుకునేలా ఒప్పందం కుదిరింది.

* * * * *

**సం**వత్సరం రోజులు గడిచాయి.

తినీ తినకా, చచ్చీ చెడీ అందరూ కలసి పెద్దాయన బదులిచ్చిన రాళ్ళచేను చదును చేసుకుని ఇండ్లు కట్టుకోగలిగారు ఈ పాటికి.

అయితే పెద్దాయన వేయించిన రెండు బోర్ల నుండీ వచ్చే చాలీచాలని నీళ్ళతో బాగా ఇబ్బందులెదురయ్యాయి. అందువల్ల వర్షం పడ్డప్పుడు నిరవధికంగా గుట్టమీద నుండి వచ్చే వాననీరూ, ఊటనీరూ నిలవయ్యేలా తమ కొత్తపల్లె పక్కగా ఓ కుంటను తమ శ్రమతో తామే తవ్వి నిర్మించుకోగలిగారు.



Sthanika_BW_Nov11.indd 25 01/11/11 3:08 PM

ఏమయినా పాతవూరు రోడ్డుకు పక్కనే ఉండేది బట్టి కూలీ నాలీ పనులకు, ఇతర పనులకు సులువుగా వెళ్ళివస్తూ సుఖంగా బ్రతుకులు వెళ్ళదీస్తుండిన పల్లె ప్రజలు ఆ సులువు, సుఖాలకు దూరమయ్యారు. కొత్తవూరు రోడ్‌పాయింటు నుండీ రెండు కిలోమీటర్ల అవతలుండడం వల్ల, సరయిన దారి సౌకర్యం లేకపోవడం వల్లా చాలా నెలలపాటు ఇబ్బందులు పడ్డారు.

చివరికి అలవాటు పడసాగారు కాలిదారికి, దూరానికీ!

ఖాళీ అయిన రోడ్డువారకాడ పల్లె మొత్తాన్నీ పెద్దాయన మనుషులు ప్రొక్లెయినర్‌తో పడగొట్టించారు. అక్కడ నేలమట్టమయిన ఇండ్లలోంచీ తీయబడ్డ కర్రాయి మొత్తాన్ని లారీలకెక్కించారు. టవున్‌లో అల్లుడు కాంట్రాక్టు తీసుకున్న స్కూలుభవనం నిర్మింపబడే స్థలానికి ఒక్క రాతిని వదలకుండా చేర్చేశాయి లారీలు.

మన్నూ మశానం అంత వైదొలిగాక రోడ్డు రోలర్‌తో తొక్కించి శుభ్రంగా చదును చేయించారు. అద్దంలా తయారయిన పెద్దంత నేలకు ఫెన్సింగ్ వేయించేసి కొరివిదయ్యాల పీచమణిచి, వాటికి నిలవ నీడ లేకుండా చేసేశారు.

అక్కడ ఉనికిని కోల్పోయిన కొరివి దయ్యాలు రెండు కిలోమీటర్ల అవతల రోడ్డుకు కాస్త సమీపంగానే వున్న అంకిపాడు పల్లెలో చేరి రాత్రులందు తమ ప్రతాపాలు చూపడం మొదలుపెట్టాయి నెమ్మదిగా.

* * * * *

**అం**కిపాడు పల్లె ప్రజలు పెద్దాయన బంగళా ముందర తోటలో వినయంగా సభ తీరడానికి మరో పదిమాసాల కాలం పట్టింది.

* * * * *

**మొ**త్తానికి హృదయమున్న దొడ్డమారాజు పెద్దాయన.

రెండునెలల తరువాత అంకిపాడు గుట్టక్రింద తన రాళ్ళ చేనులో అంకిపాడు పల్లె ప్రజలు ఇండ్లు కట్టుకోవడానికీ, తమ స్వయంగా రెండు బోర్లు వేయించడానికీ, చివరగా అంకిపాడు పల్లె స్థలాన్ని స్వాధీనపరచుకోవడానికి అంగీకరించాడు.

* * * * *

**అం**కిపాడు పల్లె ఖాళీ అవడానికీ, చదునయి చుట్టూ ఫెన్సింగ్ పడడానికి మరో సంవత్సరకాలం పట్టింది.

* * * * *

**"ఇ**న్నాళ్ళూ మనం వాళ్ళకు ఇస్తూ వచ్చిందే బాగా ఎక్కువ కదరా?" అన్నాడు పెద్దాయన.

"వాళ్ళూ ఇన్నాళ్ళూ ప్రాణాలకు తెగించి కొరివి దెయ్యాలాట ఆడినారు కద దొరా?" అన్నాడు చిన్నసామి చిన్నస్వరంతో.

"సరే . . . సరే. . ." అంటూ లోపలికి వెళ్ళిన పెద్దాయన పది నిముషాలలో మూడు నోట్లకట్టలు పట్టుకుని తిరిగి వచ్చాడు.

"ఇందులో రెండు కట్టలు ఆ మొరటోళ్ళిద్దరికీ ఇచ్చి ఊర్లకు పంపించెయ్యి. మళ్ళీ అవసరం పడినప్పుడు పిలిపిస్తామనీ, ఎక్కడయినా నోరు జారితే పీకలు తెగిపోతాయనీ చెప్పి పంపు. ఓ కట్ట నీవు తీసుకో !" అన్నాడు పెద్దాయని.

వంగి వంగి దండాలు పెడ్తూ శెలవు తీసుకున్నాడు చిన్నసామి.

* * * * *

**గ**ది తలుపులు, కిటికీలు మూసి తరువాత గదిలోపలి ఫోను రిసీవర్ అందుకుని నెంబరు నొక్కాడు పెద్దాయన.

"శంకరా, రెండు పల్లెలూ ఖాళీ చేయించి, చదును చేయించి పెట్టడం అయింది. రెండు స్థలాల మధ్యనా లింక్ పడేలా రోడ్డు దగ్గరగా వచ్చే భూములలోంచీ చాలా స్థలాలు కొనుగోలు చేయడం కూడా అయిపోయింది. ఇంకా మధ్యలో మిగిలిన బిట్లను సెజ్‌పాయింట్ల క్రింద తీసుకుని మనకు అప్పజెప్పే ఏర్పాట్లకు తగిన వారితో తగిన విధమైన ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నాను. అదీ సానుకూలం అయిపోయినట్లే. ఇక నీవు ఆ సేట్‌తో మాట్లాడి సెటిల్ చెయ్యాల్సిందే !" అన్నాడు.


". . . . . ."

"ఆ, అధికార యంత్రాంగానిదేముందిలే . . . అంతా లెక్కతోనే నడచిపోతుంది ! మనకు తెలీనిదేముంది? ఇంక పెద్ద వాళ్ళనూ సరి చేసుకుంటాను సులభంగా ! వాళ్ళకే ఇబ్బందీ ఉండదు !"

"........"

"అలాగే, అలాగే . . ఒకే, ఒకే!!" అంటూ బిగ్గరగా పెద్దగా నవ్వుతున్నాడు పెద్దాయన దెయ్యంలా.

◆






Sthanika_BW_Nov11.indd 26 01/11/11 3:08 PM

# మహిళా రాజకీయ సాధికారతకు యుఎన్ ఉమెన్

UN WOMEN
United Nations Entity for Gender Equality and the Empowerment of Women

**పరిపాలనలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించటానికి, మహిళలలో రాజకీయ సాధికారత పెంపొందించటానికి ఐక్యరాజ్యసమితి ఒక క్రొత్త కార్యక్రమానికి మార్చి 2010లో నాంది పలికింది. యుఎన్ ఉమెన్‌గా పిలవబడే ఈ కార్యక్రమం భారత దేశంలోనూ, దక్షిణ ఆసియాదేశాలలోని 15 లక్షల గ్రామాలలోని 30 లక్షల మంది ప్రజాప్రతినిధులను ప్రభావితం చేస్తోంది.**

మార్చి 2011 లో ఒక ఒడంబడిక చేసుకున్నాయి. మన దేశంలో తొలివిడతగా ఈ యుఎన్ఉమెన్ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిషా, రాజస్థాన్ రాష్ట్రాలలో అమలు అవుతోంది.

ఈ కార్యక్రమం ద్వారా ఈ రాష్ట్రాలలోని సుమారు 5 లక్షల ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగాను, 365 మిలియన్ల జనాభా పరోక్షంగాను ప్రభావితం కానున్నారు. మన రాష్ట్రంలో ఈ కార్యక్రమం మహబూబ్‌నగర్, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో అమలు చేయబడుతుంది.




ఈ కార్యక్రమం ముఖ్యంగా ఈ దేశాలలో ఉన్న 15 లక్షల మంది మహిళా ప్రజాపతినిధుల సామర్థ్యాల పెంపుదలకు ఉద్దేశించబడింది. ఈ కార్యక్రమం క్రింద 10.5 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే సుమారు 48 కోట్ల రూపాయలను ఐక్యరాజ్యసమితి వెచ్చించనుంది. చిన్న మొత్తంగా కన్పిస్తున్నప్పటికీ, ఈ మొత్తాన్ని ప్రజాప్రతినిధుల సామర్థ్యాల పెంపుదలమీదే వెచ్చించనుండటం వల్ల పెద్ద ఎత్తున ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

ఈ కార్యక్రమం అమలు కోసం పంచాయితీ రాజ్ సంస్థలలోని మహిళా ప్రజాప్రతినిధుల సామర్థ్యాలను పెంపొందించటానికి గాను, భారతదేశ పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ, యుఎన్ఉమెన్ లు

| రాష్ట్రం | అమలు చేయబడే జిల్లాలు |
|---|---|
| ఆంధ్రప్రదేశ్ | మహబూబ్‌నగర్, శ్రీకాకుళం, విజయనగరం |
| కర్ణాటక | ధార్వాడ్, మైసూర్ |
| మధ్యప్రదేశ్ | జబుఅ, సెహోర్ |
| ఒడిషా | ధెంకనాల్, గజపతి |
| రాజస్థాన్ | అల్వార్, దుంగాపూర్, టోంక్ |
| బీహార్ | నలందా, సుపాల్ |



Sthanika_Color_Nov11.indd 28 01/11/11 3:10 PM

# పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి ఉన్నతాధికారుల నార్వే పర్యటన

యుఎన్ ఉమెన్ కార్యక్రమానికి నిధులు సమకూర్చుతున్న నార్వేదేశంలోని మహిళా ప్రజాప్రతినిధుల స్థితిగతులను, రాజకీయ సాధికారతను, వారి సామర్థ్యాల పెంపుదల కోసం నార్వేదేశంలోని ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల గూర్చి అధ్యయనం చేయటానికి ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ రాజీవ్‌శర్మ, అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి అక్టోబర్ 22న హైదరాబాద్ నుండి నార్వే పయనమయ్యారు.



డాక్టర్ రాజీవ్‌శర్మ
పంచాయితీరాజ్ శాఖ
ప్రిన్సిపల్ సెక్రటరీ

వీరు వారం రోజులపాటు నార్వేలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి, పైన పేర్కొన్న అంశాలపై అధ్యయనం చేసి తిరిగి 29న హైదరాబాద్ వస్తారు. ఈ పర్యటనకు పంచాయితీరాజ్ కమీషనర్ శ్రీ సునీల్‌శర్మ కూడా హాజరు అవ్వవలసి ఉన్నప్పటికీ, అనివార్య కారణాల వల్ల ఆయన హాజరు కాలేకపోయారు.

## యుఎన్ ఉమెన్ కార్యక్రమం దార్శనికత (విజన్)

దక్షిణ ఆసియా దేశాలలోని రాజకీయ నిర్ణయీకరణ ప్రక్రియలో 2030 నాటికి స్త్రీ, పురుషులు ఇరువురూ సమానమైన ప్రాధాన్యాన్ని కలిగి ఉండటం.

## యుఎన్ ఉమెన్ కార్యక్రమ లక్ష్యాలు

2015 నాటికి దక్షిణ ఆసియాదేశాలలోని స్థానిక ప్రభుత్వాలలోని మహిళా ప్రజానిధులంతా ఆయా దేశాలలోని మహిళలు తమ హక్కుల ను పూర్తిస్థాయిలో వినియోగించకొనేలా చర్యలు చేపట్టటం.

## యుఎన్ ఉమెన్ కార్యక్రమం అమలు వ్యూహాలు

స్థానిక ప్రభుత్వాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మహిళా ప్రజాప్రతినిధుల సామర్థ్యాలను పెంపొందించటం ద్వారా ప్రభుత్వ విధాన నిర్ణయాలను, నిధుల కేటాయింపు తీరుని ప్రభావితం చేయటం, తద్వారా మహిళలకు చట్ట ప్రకారం ప్రాప్తించిన హక్కులు వాస్తవంగా ఆచరణలోకి వచ్చేటట్లు చూడటం అనేది ఈ యుఎన్ ఉమన్ కార్యక్రమ ప్రధాన వ్యూహం. దీనిలో భాగంగా 3 చర్యలు చేపట్టనున్నారు.

1. మహిళల హక్కులు పరిరక్షింపబడేందుకు అనువుగా ప్రభుత్వ విధాన నిర్ణయాలను, పథకాల అమలు తీరుతెన్నులను, నిధుల కేటాయింపును ప్రభావితం చేసేందుకు ప్రజాప్రతినిధులకు





Sthanika_Color_Nov11.indd 29 01/11/11 3:10 PM

అవసరమైన సామర్థ్యాలను శిక్షణ ద్వారా పెంపొందించటం.

2. మహిళల రాజకీయ సాధికారతకు అడ్డంకిగా ఉన్న న్యాయం, చట్ట, విధాన పరమైన అడ్డంకులను గుర్తించేందుకు, నివారించేందుకు చేపట్ట వలసిన చర్యలు తదితర విషయాలను గూర్చి పరిశోధించటానికి, విధాన సంబంధ విషయాలపై విస్తృత ప్రచారం కోసం తగు చర్యలు చేపట్టటం.
3. పరిశోధన శిక్షణ కోసం ఒక ప్రత్యేక ప్రాంతీయ కేంద్రాన్ని స్థాపించటం.





ఈ కార్యక్రమం ద్వారా మహిళా ప్రజానిధులు సాధికారత పొంది, వ్యక్తిగతంగానూ, సమూహాలు గాను తగిన సామర్థ్యాలను సంతరించుకోగల్గుతారు. వీరిలో వ్యక్తులుగా, సమూహాలుగా ప్రశ్నించే తత్వం మెరుగై పరిపాలనను సజావుగా నిర్వహించగలుగుతారు. గ్రామసభను బలోపేతం చేయటం ఈ యుఎన్ ఉమెన్ కార్యక్రమంలో ఒక ప్రత్యేక అంశం.

గ్రామసభలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించటానికి గ్రామ పంచాయతీలలో ప్రేరక్ లను (మోటివేటర్లు) తయారుచేస్తారు. గ్రామసభలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విధాన నిర్ణయాల ను తీసుకోవటంలో పాలుపంచుకునేలా ఈ ప్రేరక్‌లు కృషి చేస్తారు. మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడే చర్యలు చేపట్టేలా పంచాయతీ రాజ్ సంస్థలు ముందుకు వచ్చేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది.

### *ఈ కార్యక్రమం ద్వారా ఆశిస్తున్న ఫలితాలు*

- ★ గ్రామసభ, వార్డు సభ, పంచాయతీ సమావేశాలలో మహిళల భాగస్వామ్యం పెరగటం, పంచాయతీ సమావేశాల్లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం పెరగటం.




- ★ మహిళలకు సంబంధించిన అంశాలు ప్రధానంగా జీవనోపాధులు, విద్య, లింగసమానత్వం, త్రాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలు గ్రామసభ, వార్డు సభ, పంచాయతీలలో తరచూ చర్చకు వచ్చి పరిష్కారం లభించటం.
- ★ గ్రామసభలలో మహిళలు, పిల్లల అక్రమ రవాణా, మహిళల పై హింస తదితర అంశాలపై చర్చలు చేపట్టి, సమస్య తీవ్రత తగ్గించటం.
- ★ పంచాయతీ రాజ్ సంస్థలకు ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధుల స్థానే వారి కుటుంబాలలోని పురుషులు పెత్తనం చలాయించే విధానాలు రూపుమాపటం.

## కార్యక్రమ అమలు ఏర్పాట్లు

కేంద్రస్థాయిలో భారతప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ, రాష్ట్రస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్ శాఖ నోడల్ విభాగంగా వ్యవహరిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి అవసరమయిన ధన సహాయం నార్వే ప్రభుత్వం నుండి అందుతుంది. ఈ కార్యక్రమం విజయవంతం కావటానికి అవసరమైన పరిపాలనా పరమైన అంశాలలో సహాయసహకారాలను పంచాయతీ రాజ్ కమీషనరు అందచేస్తారు. ప్రజాప్రతినిధులు శిక్షణా పరమైన అవసరాలను చూడటానికి రాష్ట్ర స్థాయిలో అపార్డ్ నోడల్ ఏజన్సీగా వ్యవహరిస్తుంది. ఎంపిక చేయబడిన జిల్లాల్లో ఈ కార్యక్రమం అమలు కోసం నోడల్ అధికారుల ను ప్రభుత్వం ప్రకటిస్తుంది.

ప్రస్తుతం మన రాష్ట్రంలో పంచాయతీ రాజ్ సంస్థలకు ఎన్నికలు వాయిదా పడినందున, ఎన్నికలు పూర్తి అయిన వెంటనే విజయనగరం, శ్రీకాకుళం, మహబూబ్‌నగర్ జిల్లాలలోని మహిళా ప్రజాప్రతినిధులకు శిక్షణ అందచేయటానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఈ జిల్లాలలో గ్రామ సభ బలోపేతానికి ఇప్పటికే చర్యలు ప్రారంభమయ్యాయి. గ్రామ సభ బలోపేతం చేయటం అనేది ఒక నిరంతరం ప్రక్రియ. ఇది కొనసాగుతూనే ఉంటుంది.

*- డా॥ శివశంకర ప్రసాద్*



Sthanika_Color_Nov11.indd 30 01/11/11 3:10 PM

# కొలామ్‌ల జీవన విధానం



**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల 8 ఆదిమ గిరిజన తెగలలో 'కొలామ్' తెగ ప్రధానమైనది. కొలామ్‌లు ప్రధానంగా ఆదిలాబాద్ జిల్లాలోని దట్టమైన అటవీప్రాంతంలో చిన్నచిన్న ఆవాసాలను ఏర్పరచుకొని జీవనం సాగిస్తారు. వారి ఆవాసాలను 'గూడెం'లు అంటారు. వీరు ఆదిలాబాద్ జిల్లాలోనే కాకుండా ఆ జిల్లా సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్ర (గడ్‌చిరోలి జిల్లా, యవత్‌మల్) చత్తీస్‌గడ్ రాష్ట్రాలలో కూడా విస్తరించి ఉన్నారు.**

కొలామ్‌లు "కొలామి" మాండలికాన్ని మాట్లాడతారు. కొలామి గోండు భాషవలె ఉండి, మధ్యద్రావిడ భాషల విభాగానికి చెందినది. కొలామ్‌లు గోండు జాతి గిరిజనులతో గోండు భాషలో సులభంగా మాట్లాడగలరు. అంటే రెండు మాండలికాలకు (గోండు భాష & కొలామి భాష) గల సారూప్యతను అర్థంచేసుకొనవచ్చు.



కొలామ్‌లను "కొలావార్" అని కూడా పిలుస్తారు. "కొలా" అంటే కొలామ్ మాండలికంలో వెదురు (కర్ర) అని అర్థం. అంటే కొలామ్ గిరిజనులకు వెదురు బుట్టలు అల్లటంలో ప్రత్యేక నైపుణ్యం ఉండటం వలననే వీరిని "కొలావార్" అని పిలుస్తుంటారు.

కొలామ్‌ల జనాభా 41, 254 ఉంటే ఆదిలాబాద్ జిల్లాలోనే 40, 310 ఉంది (1991 జనాభా లెక్కలు). కొలామ్ గిరిజన తెగ 4 సమూహాలుగా విభజించబడింది. ప్రతి సమూహానికి ప్రత్యేకమైన చిహ్నం (టోటామిక్), ఇంటిపేరు ఉంటాయియి. కొలామ్‌లు వారి సమూహానికి చిహ్నం అయిన పక్షి లేదా జంతువును పవిత్రంగా చూడడమే కాకుండా, ఎటువంటి హాని చేయరు. కొలామ్‌ల సమూహాల ఇంటి పేర్లు, చిహ్నాలు క్రింది విధంగా ఉంటాయి.



| క్ర. సం. | సమూహం పేరు | ఇంటిపేరు | టోటామిక్ చిహ్నం |
|---|---|---|---|
| 1. | ఏడు దయాల్ ఖేర్ | మడావి | పోర్కుపైన్ |
| 2. | ఆరు దయాల్ ఖేర్ | ఆత్రం | పులి |
| 3. | ఐదు దయాల్ ఖేర్ | కుమ్ర | కోడి/ఒక రకమైన పక్షి |
| 4. | నాలి దయాల్ ఖేర్ | టేకం | మొసలి |

కొలామ్ తెగలోని పై నాలుగు సమూహాలు బహిర్ వివాహ వ్యవస్థను పాటిస్తాయి.

కొలామ్‌లలో అన్ని గిరిజన తెగలవలె వివిధ రకాలు పద్ధతిలో జీవిత భాగస్వామిని ఎంచుకొంటారు. భాగస్వామిని ఎంచుకొనే విధానాన్ని బట్టి వివాహాలు 5 రకాలుగా ఉంటాయి అవి:

### 1. కడియంపెండ్లి (సంప్రదింపుల ద్వారా వివాహం)

ఈ వివాహ పద్ధతిలో వరుడు, వధువు తల్లిదండ్రులు సంప్రదించి, తెగ పూజారి అయిన "దేలక్" నిర్ణయించిన ముహూర్తం ప్రకారం వరుడు ఇంటిలో వధువుకు వెండి ఆభరణం (కడియం) తొడిగించటం ద్వారా వివాహం జరిపిస్తారు. వరుడి తల్లిదండ్రులు వధువు తల్లి దండ్రులకు బహుమతులను, లాంఛనాలను బహూకరిస్తారు.

### 2. సంమ్తాప్‌సర్ (వశపరుచుకోవడం ద్వారా వివాహం)

కొలామ్ భాషలో "సమ్" అంటే వశపరుచుకోవడం, "తాప్‌సర్" అంటే ఇంటికి తీసుకెళ్ళటం. ఈ వివాహాన్ని సాధారణంగా వధువు తల్లి దండ్రులకు లాంఛనాలు చెల్లించే స్థోమత లేని కొలామ్ కుటుంబాలు పాటిస్తాయి. దాని ప్రకారం వేరే గూడెంలోని వరుడికి నచ్చిన అమ్మాయిని గుర్తించి, ఆ విషయం ఆ గ్రామ పెద్దకు (పటేల్) తెలియపరుస్తారు. గ్రామ పటేల్ రహస్యంగా ఆ అమ్మాయిని గ్రామం అడవులలోకి పంపించటం, అదే రోజు వరుడు వచ్చి అమ్మాయిని తమ గ్రామానికి తీసుకెళ్ళటం జరుగుతుంది. ఆ తర్వాత అమ్మాయి తల్లిదండ్రులు వీరి గూడేనికి వెళ్ళి వరుని తల్లిదండ్రులతో తగువుపెట్టుకొని గూడెం పటేల్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు "పైధాన్" రూపంలో జరిమానా చెల్లించి, గూడెం అందరి సమక్షంలో "పోటిపుస్త" (పెండ్లి తాళి) అమ్మాయి మెడలో వేయటం ద్వారా పెండ్లి జరుగుతుంది.





### 3. ఎల్లోసంత పెండ్లి (చొరబడడం ద్వారా పెండ్లి)
### (ఎల్లో = ఇల్లు, సంత = చొరబడటం)

ఈ వివాహంలో అమ్మాయి తనకు నచ్చిన వరుడు (వేరే ఇంటి పేరుగల) ఇంట్లోకి వెళ్ళి చొరబడి అతనిచేయి పట్టుకొని అక్కడే ఉండిపోతుంది. ఈ విధానంలో వధువు తల్లి దండ్రులకు ఎటువంటి లాంఛనాలు ఉండవు.

### 5. ఇల్లటం పెండ్లి (సేవచేయటం ద్వారా వివాహం)

ఈ విధానంలో వరుడు అమ్మాయి వాళ్ళ ఇంట్లో గూడెం పెద్దలు నిర్ణయించినంత కాలం సేవచేసి ఆ తర్వాత అమ్మాయిని తన గూడెం తీసుకెళ్ళవచ్చు. ఈ విధానాన్ని పేద, అనాథ అబ్బాయిలు ఎక్కువగా ఆచరిస్తారు.

### 6. గొరక పెండ్లి (ప్రేమించి, లేచిపోవటం ద్వారా వివాహం): గొరక-కత్తి

ఈ పద్ధతిలో అమ్మాయి, అబ్బాయి ప్రేమించుకొని, వేరొక గూడేనికి వెళ్ళటం జరుగుతుంది. అక్కడ గూడెం పటేల్, గూడెం మధ్యలో కత్తిని భూమిలో పాతి వీరి వివాహం జరిపిస్తారు.

కొలామ్ తెగలో విడాకులకు అనుమతి ఉంటుంది. ఇది గూడెం పటేల్ ఆధ్వర్యంలో జరుగుతుంది. దీనిని వారు "పార్కత్" అంటారు. ఇది గూడెం పటేల్, ఇతర పెద్దలందరి సమక్షంలో జరగుతుంది. సమస్య ఉండి విడిపోవాలనుకొనే దంపతులను అక్కడికి పిలిపించటం జరుగుతుంది. ఒక మట్టి కుండలో నీటిని పోసి అందులో రెండు కట్టె పుల్లలు ఉంచుతారు. ముందు భర్త అందులో నుండి ఒక పుల్లను చేతితో బయటకు తీసి రెండు ముక్కలుగా విరగొట్టడం జరుగుతుంది. ఆ తర్వాత భార్యకూడా కుండలోగల కర్రపుల్లని బయటకు తీసి రెండు ముక్కలుగా విరగ్గొట్టడం జరుగుతుంది. దాని తర్వాత వివాహ సమయంలో అమ్మాయి వారి ఇంటి నుండి తెచ్చుకొన్న "ఆస్థన్" (వస్తువులను) తిరిగి ఇచ్చివేయవలసి ఉంటుంది.





కొలామ్‌లలో వితంతు పునర్వివాహానికి అనుమతి ఉంది. అయితే భర్త చనిపోయిన తర్వాత పెండ్లి కాని భర్త సోదరున్ని వివాహం చేసుకోవచ్చు. దీనిని "పైపెండ్లి" అంటారు. లేనిచో నచ్చిన వారితో పెండ్లి చేసుకోవచ్చు. అయితే సంతానం ఉంటే వారిని అత్తగారింట్లో అప్పగించాలి.

కొలామ్‌లలో సాంఘిక నియంత్రణ, ఆచార సాంప్రదాయాల పాటింపు, పర్యవేక్షణ గూడెంలో తెగ పెద్ద అయిన "నాయకన్" ఆధీనంలో ఉంటుంది. ఆయనకు పండుగలు, పూజల నిర్వహణలో గూడెం పూజారి "దేలక్" సహకరిస్తుంటారు. వర్తమానం పంపటం వంటి విషయాలను "మహాజన్" నిర్వహిస్తాడు. గూడెంలో జరిగే పూజల సమయంలో వంట చేయటం కోసం "టెక్రకాన్" వండిన పవిత్రమైన తినుబండారాలు గూడెం అంతా పంచటానికి "ఘటియాల్" నాయకన్‌కు సహకరిస్తారు.

గూడెంలో జరిగే చిన్నతగాదాలు మినహా, విడాకుల వంటి తగాదాల పరిష్కారం, గూడెంలో జరగాల్సిన పండగలు, పూజ నిర్వహిస్తారు.

కొలామ్‌ల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. సాధారణంగా అడవిని నరికి పోడు వ్యవసాయం చేస్తారు. వీరు కొండ రెడ్ల కంటే మెరుగైన వ్యవసాయ పనిముట్లను ఉపయోగిస్తారు. కర్రతో కూడిన చిన్న నాగలిని దుక్కి దున్నటానికి ఉపయోగిస్తారు. జొన్నలు, కందులు, పండిస్తారు. వ్యవసాయంతో పాటు వెదురుతో తడకలు, బుట్టలు అల్లటం వీరి వృత్తిగా ఉంటుంది. చిన్నతరహా అటవీ ఉత్పత్తుల సేకరణ, తునికి ఆకు సేకరణ, కోవెల జిగురు సేకరణ వీరి జీవనోపాధికి ఉపయోగపడుతుంది.

భీమదేవర లేదా భీమయ్యక్‌ను ప్రధానంగా పూజిస్తారు. గూడెం దేవత అయిన నడిపియమ్మ గ్రామం మధ్యలో ఉండటం కొలామ్ గూడెంల ప్రత్యేకత. వీరితో పాటు ఇడుమలదేవి (భీముని భార్య), సీతాదేవి, జంగు భాయి, పోతు రాజులను పూజిస్తారు.

ఇప్పపువ్వు వచ్చే సమయంలో "పొక్కికోల్త" పండగ, నాగలి కట్టే సమయంలో "మండోస్" పండగ, భీమయ్య పెండ్లి, పశువుల రక్షణ కొరకు 'అకండి' పండగ, పంట దిగుబడి సమయంలో 'కొత్తల' పండగ జరపటం కొలామ్ తెగలో ఉంటుంది.

కొలామ్‌ల అభివృద్ధి కోసం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా భూమి అభివృద్ధి పథకం, భూమి కొనుగోలు, అధిక దిగుబడి ఇచ్చే వంగడాల సరఫరా, సాగునీటి వాగుల తవ్వకం, విద్యుత్ మోటార్ల పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు జరుపుతోంది.

**- ఎ.సుభాష్ చంద్రగౌడ్**
**సీనియర్ ఫ్యాకల్టీ & డిప్యూటీ డైరెక్టర్ అపార్డు**




ఈ ప్రపంచం ఒక పరీక్షా స్థలం. మంచికోసం, మార్పు కోసం, మానవ సమాజ సాఫల్యం కోసం విప్లవించే వారికి ఇక్కడ అడుగడుగునా పరీక్షలే. అయితే పరీక్షలకు బెదిరి పోకుండా, ఎన్ని కష్టాల పర్వతాలు విరుచుకుపడినా చెక్కుచెదరని మనోనిబ్బరంతో, ఇసుమంతైనా సడలని ఆత్మవిశ్వాసంతో, మొక్కవోని ధైర్య స్థైర్యాలతో ముందుకు సాగిన వారే విజయ కేతనాన్ని ఎగురవేయగలుగుతారు. దీనికి చరిత్రే సాక్ష్యం.

# ఆ మహనీయుల త్యాగఫలమే 'ఈదుల్ అజ్‌హా'

మానవ ఇతిహాసం కనీ వినీ ఎరుగని ఇలాంటి ఓ పరీక్షా సంఘటన దాదాపు ఐదు వేల సంవత్సరాలకు పూర్వం ఒకటి సంభవించింది. మానవ చరిత్రలో ఏ మనిషీ ఎదుర్కొనటువంటి పరీక్షను హ॥ ఇబ్రాహీం (అ) ఎదుర్కొన్నారు. కన్నతండ్రి ఆయన్ని ఇంట్లోంచి గెంటేశాడు. ఊరి వాళ్ళు ఆయన్ని తరిమేశారు. చివరికి పాలకులు కూడా ఆయనకు అగ్ని పరీక్ష పెట్టి, దేశం నుండి బహిష్కరించారు. ఇంతకూ ఆయన చేసిన నేరం ఏమిటి? ఏ తప్పు చేస్తే తండ్రి ఆయన్ని ఇంట్లోంచి గెంటేశాడు. ఏ అఘాయిత్యం చేస్తే ఊరివాళ్ళు తరిమేశారు? ఏ నేరానికి పాల్పడితే, ఏ ద్రోహానికి ఒడిగడితే పాలకులు ఆయన్ని అగ్ని పరీక్షకు గురిచేసి దేశం నుండి బహిష్కరించారు.

ఆయన చేసిన నేరం ఏమిటంటే, తాత ముత్తాతల కాలం నుండి వస్తున్న దురాచారాలను, దుస్సంప్రదాయాలను, మూఢనమ్మకాలను ఎదిరించాడు. అన్యాయాన్ని, అక్రమాలను ప్రశ్నించాడు. అవినీతికీ, అధర్మానికి ఎదురు తిరిగాడు. బహుదైవారాధన, విగ్రహారాధన మహాపాపమన్నాడు. బడుగు బలహీనవర్గాలు, పీడిత తాడిత శ్రామిక వర్గాల గుండె గొంతుకగా మారాడు. అసభ్యం, అశ్లీలత, మద్యపానం, భ్రూణ హత్యలు, అంటరానితనం సామాజిక నేరాలన్నాడు. పుట్టుకతో ఎవరూ ఉచ్చులు, నీచులు కారని మానవులంతా సమానమేనని ప్రకటించాడు. పాలకుల అవినీతిని, పక్షపాతాన్ని, అణచివేతను, అధికార దుర్వినియోగాన్ని నిర్భయంగా ప్రశ్నించాడు. కులమతాలు, భాషాబేధాలు, ప్రాంతీయ అసమానతలు, లింగబేధాలు, రంగురూపు తదితర అన్ని వ్యత్యాసాలకు అతీతంగా మానవులందరికీ సమాన న్యాయం సమ హక్కులు కావాలని నినదించాడు.

తాత ముత్తాల కాలం నుండీ కొనసాగుతూ వస్తున్న దురాచారాలను, విగ్రహారాధను వ్యతిరేకించడాన్ని తండ్రి సహించలేకపోయాడు. సామాజిక నేరాల జాబితాను సమాజం హర్షించలేక పోయింది. అన్యాయం, అవినీతి, అధికార దుర్వినియోగాన్ని ప్రశ్నించడం పాలకులకు కంటగింపైంది. దాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. ఎంతమంది ఎన్ని కష్టాలు పెట్టినా దైవంపై భారం వేసి స్థిరచిత్తంతో ముందుకు సాగారాయన. ఈ పరీక్షలు, కష్టాలు ఆయన వజ్రసంకల్పం ముందు తలవంచాయి. ఏ పరీక్షా ఆయన్ని సన్మార్గం నుండి ఇసుమంతైనా కదిలించలేకపోయింది. అన్యాయాన్ని, అవినీతిని, ఎదిరిస్తూ, మూఢనమ్మకాలను, దురాచారాలను దునుమాడుతూ, బడుగు బలహీన, శ్రామిక వర్గాలకు అండగా, మానవ సమానత్వాన్ని, దేవుని ఏకత్వాన్ని ప్రచారం చేస్తూ దేశదిమ్మరిగా జీవితం గడుపుతూ, సంకల్పించిన కార్యాన్ని సాధించారాయన.



Sthanika_Color_Nov11.indd 31 01/11/11 3:10 PM

తరువాత ఆయనకి మరో పరీక్ష ఎదురైంది. ఈసారి మానవుల నుండి, మానవ సమాజం నుండి, పాలకుల నుండి కాదు. మానవుల సృష్టికర్త నుండి, పాలకులకే పాలకుడైన సర్వాధికారి నుండి, విశ్వప్రభువు నుండి. అవును దైవం కూడా ఆయన్ని పరీక్షించదలిచాడు. ఇందులో తొలివిడతగా భార్య బిడ్డల్ని ఎలాంటి జన సంచారం లేని ఎడారి ప్రదేశంలో వదిలేసి రమ్మని దైవం ఆయన్ని ఆదేశించాడు. హ॥ఇబ్రాహీం (అ) ఈ పరీక్షనూ ఎదుర్కొన్నారు. దైవాదేశ పాలనలో ఈ ఆజ్ఞనూ శిరసావహించారు. ఎలాంటి జనసంచారంలేని ఆ ఏడారి ప్రాంతంలో, కనీసం నాలుక తడుపుకోవడానికి సైతం చుక్కనీరు లేని ఆ స్థితిలో, వారి సహన స్థయిర్యాలకు దైవంపై వారి అచంచల విశ్వాసానికి ప్రసన్నుడైన దైవం ఆ తల్లీ బిడ్డల ఆకలిదప్పులు తీర్చగల ఒక నీటి చలమను ప్రత్యక్షపరిచాడు. ఈనాడు యావత్తు ప్రపంచ ముస్లింలు తీర్థ జలంగా సేవిస్తున్న ఆ ఊట బావి నీటి పేరే 'జమ్‌జమ్'. దీనికి సంబంధించి మరి కొంత చరిత్ర ఉంది. అది ఇక్కడ పేర్కొనడంలేదు.

తరువాత దైవం హ॥ ఇబ్రాహీం (అ) గారికి మరో పరీక్ష పెట్టాడు. ముందే చెప్పుకున్నట్లు ఇది మానవ జాతి ఇతిహాసం. కనీ వినీ ఎరుగని పరీక్ష. విశ్వాస పరాకాష్టకు అనుపమాన సంకేతం ఈ పరీక్ష. ఈ సారి కన్నకొడుకును దైవమార్గంలో త్యాగం చెయ్యమని దైవం ఆయన్ని ఆజ్ఞాపించాడు. హ॥ ఇబ్రాహీం (అ) ఈ ఆదేశాన్ని కూడా సంతోషంగా తలదాల్చారు. క్షణమాత్రం కూడా ఆలస్యం చేయకుండా దైవాదేశ పాలనలో తనయుని మెడపై కత్తి పెట్టేశారు ఇబ్రాహీం. దీంతో దేవుని కారుణ్య కడలి ఉప్పొంగింది. తన ప్రియదాసుకు హ॥ఇబ్రాహీం పట్ల ఆయన ప్రసన్నత పతాక స్థాయిన ప్రసరించింది.

"నా ప్రియ ప్రవక్తా ఇబ్రాహీం! నువ్వు స్వప్నంలో లీలా మాత్రంగా చూసిన నా సూచనను నిజంగానే చేసి చూపించావు. నువ్వూ, నీ తనయుడూ నా ఆజ్ఞా పాలనలో మానసికంగా సిద్ధమైన క్షణంలోనే నేను మీతో ప్రసన్నుడనయ్యాను. నా ఈ పరీక్షలో మీరు ఘనమైన ఉత్తీర్ణత సాధించారు. ఇక భౌతిక కార్యంగా మిగిలిపోయిన బలి తతంగంతో నాకసలు నిమిత్తం లేదు. ఇప్పుడు మీ విశ్వాసం పరిపూర్ణతను సంతరించుకొని, నా ప్రతి ఆదేశ పాలనలో అది నిరూపితమైంది. ఈ శుభ సందర్భంలో మీ త్యాగనిరతికి గుర్తింపుగా ఒక స్వర్గ పొట్టేలును పంపుతున్నాను' అని పలికింది దైవవాణి... అప్పుడు బాబు ఇస్మాయీల్ స్థానంలో ఆ స్వర్గపొట్టేలును జిబహ్ చేశారు హ॥ ఇబ్రాహీం (అ).

ఈనాడు ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సోదరులు జరుపుకునే 'ఈదులే అజ్ హా' / 'బ్రకీద్' పండుగ ఆ మహనీయుల త్యాగస్మరణే. ఇస్లామియా క్యాలండరు ప్రకారం 'జిల్ హజ్జ్' మాసం పదవతేదీన ఈ పండుగ జరుగుతుంది. అదే రోజు పవిత్ర మక్కా నగరంలో 'హజ్' ఆరాధన కూడా జరగుతుంది. ఆర్థికస్థోమత కలిగిన ప్రతి ముస్లిం జీవితంలో కనీసం ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలి. ఎందుకంటే ఇస్లామియా మౌలిక విశ్వాసాల్లో ఇది కూడా ఒకటి. ఆర్థికస్థోమత లేక 'హజ్' యాత్ర చేయలేనివారు పండుగ నాడు తమ తమ గ్రామాల్లోనే నమాజులు చేస్తారు. ఖుర్బానీలు ఇస్తారు. అనివార్య కారణాల వల్ల హజ్ చేయలేకపోయినా, నమాజులు ఆచరించి, ఖుర్బానీలు ఇచ్చిన వారికి కూడా దైవం హజ్ నిర్వహించిన వారితో సమానంగా పుణ్యఫలం ప్రసాదిస్తాడు. ఎందుకంటే, దైవం చిత్తశుద్ధిని, సంకల్పశుద్ధిని మాత్రమే చూస్తాడు. ఎవరు ఏ సంకల్పంతో కర్మలు ఆచరిస్తారో, ఆ ప్రకారమే ఆయన వారికి ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు. ఈ త్యాగాలకు, పరీక్షలకు సదాచరణలకు, దైవప్రసన్నత, దైవ విశ్వాసమే అసలు ప్రేరణ.

అందుకని మానవులు దేవుడున్నాడని, ఆయన ఒకే ఒక్కడని నమ్మాలి. ఈ సమస్త, చరాచర సృష్టి కేవలం ఆయన కనుసన్నలలోనే నడుస్తోంది. ఏదో ఒకనాడు ఈ సృష్టి అంతమైపోతుందని, చివరికి మానవులు నశించిపోతారని, మరణానంతరం మళ్ళీ తిరిగిలేపబడతారని, అప్పుడు సమస్త కర్మలకూ దైవం ముందు సమాధానం చెప్పుకోవలసి ఉంటుందని విశ్వసించాలి. మంచికి సత్ఫలితం, చెడుకు దుష్ఫలితం అనుభవించవలసి ఉంటుందన్న విశ్వాసం హృదయంలో నాటుకుపోవాలి. ఇలాంటి విశ్వాసాలు, ఇలాంటి భావనలను మానవ సమాజంలో జాగృతం చేయడానికే ఈ 'త్యాగోత్సవం'. ఇలాంటి భావనలు గనక సమాజంలో వెల్లివిరిసినట్లయితే, ప్రజల హక్కులు హరించబడవు. పరిరక్షించబడతాయి. హత్యలు, అత్యాచారాలు, ఎన్‌కౌంటర్‌లు ఉండవు.

ప్రతి ప్రాణానికి సంపూర్ణ రక్షణ చేకూరుతుంది. అవినీతి, అన్యాయం, అక్రమాలు, అంటరానితనం, దౌర్జన్యాలు, పీడన, అణచివేత, ఉచ్ఛనీచాలు, అసమానతలు మచ్చుకైనా కనిపించవు. మహిళలు, వితంతువులు, అనాథలు, వికలాంగులు, బడుగు బలహీన వర్గాలు, కార్మిక, కర్షక శ్రామిక తదితర అన్ని వర్గాలకు సమాన హక్కులు, సంపూర్ణ న్యాయం లభిస్తాయి. లంచగొడితనం, వరకట్న, దురాచారం, మత్తు పానీయాలు, మత్తు పదార్థాలు సేవనం ఆగిపోతుంది. అసలు ఒక్కటనేమిటి? సమస్త దుర్మార్గాలూ సమస్త చెడులూ సమసిపోతాయి. ప్రజల్లో, పాలకుల్లో బాధ్యతాభావం, జవాబుదారీతనం లాంటి సుగుణాలు జనిస్తాయి.

ఈ విధంగా దైవానికి జవాబు చెప్పుకోవాలనుకునే వారు తప్పకుండా ప్రజలకూ జవాబుదారీగానే ఉంటారు. ఎట్టిపరిస్థితిలోనూ వారి హక్కుల్ని కాపాడతారు. నిజంగానే ఇలాంటి భావనలు మానవులను మంచివాళ్ళుగా, సౌశీల్యవంతులుగా, పరోపకారులుగా, హక్కుల పరి రక్షకులుగా, త్యాగధనులుగా తయారు చేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.


కనుక శుభ్రమైన ఈ పర్వదినాన ధన ప్రాణత్యాగాలతో పాటు మనోవాంఛల్ని కూడా త్యాగం చేయాలి. స్వార్థం, అనహాయా ద్వేషాలను త్యజించాలి. దుష్టభావనలు, దురాచారాలకు తర్పణం వదలాలి. మహనీయ ఇబ్రాహీం (అ) ఏ విధంగా అన్యాయాన్ని, అవినీతిని, అధర్మాన్ని ఈ ప్రపంచం నుండి తుడిచి వెయ్యడానికి, సత్యధర్మ సంస్థాపన కోసం ఎలాంటి పరీక్షలను ఎదుర్కొన్నారో, దైవ ప్రసన్నత కోసం తమ సర్వస్వాన్నే దైవమార్గంలో అర్పించడానికి ఎలా సంసిద్ధులయ్యారో, దాన్నుండి మనం స్ఫూర్తిని పొందాలి. సత్యం కోసం, ధర్మం కోసం, ధర్మ సంస్థాపన కోసం, ఆ మార్గంలో ఎన్ని కష్టనష్టాలు, పరీక్షలు ఎదురైనా సహన స్థయిర్యాలతో, ఇబ్రాహీం, ఇస్మాయీల్ గార్లు ఎలాంటి త్యాగాలు చేశారో, అవసరమైతే అలాంటి త్యాగాలకే తాము కూడా సిద్ధమని చాటి చెప్పడమే ఒక రకంగా ఈ పండుగ ఉద్దేశ్యం.

కనుక ఇబ్రాహీం, ఇస్మాయిల్ గార్ల త్యాగనిరతని, 'హజ్' ఆరాధనలోని నిగూఢార్థాన్ని అర్థం చేసుకొని 'ఈదుల్ అజ్‌హాఖా' / 'బ్రకీద్' పండుగ జరుపుకుంటే నిజంగానే ఈ త్యాగోత్సవానికి అర్థమూ పరమార్థమూ చేకూరుతుంది. దైవం మనందరిచే ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకొనే భాగ్యం కలగజేయాలని, తద్వారా మానవసమాజంలో మహత్తర సుగుణాలు జనించాలని కోరుకుందాం.

*- యం.డి. ఉస్మాన్ ఖాన్*



Sthanika_Color_Nov11.indd 32 01/11/11 3:10 PM



# మన హాకీ

**చాలాకాలం తరువాత భారతదేశం ఇటీవల ఒక అంతర్జాతీయ హాకీ టోర్నమెంటును గెలుచుకుంది, నిజంగా ఈ గెలుపు భారతీయ హాకీకి మంచి నైతిక స్థైర్యాన్ని అందించింది. ఎందుకంటే, ఇప్పటికి అనేక సంవత్సరాలుగా భారతీయ హాకీ నెమ్మదిగా పతనావస్థకు చేరుకుంది. పతనావస్థ ముగియనున్నదనే ఆశలకు ఈ విజయం ఊపిరి పోసిందని చెప్పవచ్చు. 20వ శతాబ్దం మొదటి అర్ధభాగంలో చూసిన హాకీ వైభవాన్ని మళ్లీ దేశం సాధించగలదని హాకీ క్రీడాభిమానులు ఆశిస్తున్నారు.**

సెప్టెంబర్ నెలలో మంగోలియాలోని ఓర్డోస్‌లో మొదటి ఆసియన్ ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్ జరిగింది.ఈ టోర్నమెంట్ ఫైనల్ పోటీలో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో తలపడిన భారతదేశం పెనాల్టీ షూట్ అవుట్‌లో 4-2 గోల్స్‌తో ఘన విజయం సాధించింది.

ఫైనల్ మ్యాచ్‌కి సరిగ్గా రెండు రోజుల ముందు రెండు జట్లు తలపడగా, 2-2 డ్రాగా మ్యాచ్ ముగిసింది. ఈ మ్యాచ్‌లో తొలుత పాకిస్తాన్ రెండు గోల్స్ సాధించే సమయానికి భారతజట్టు శూన్య హస్తాలతోనే ఉంది. అయితే, సమయానికి స్పందించిన భారత జట్టు స్కోర్‌ను సమం చేసింది.

పాకిస్థాన్‌పై సాధించే విజయం భారతదేశానికి ఎప్పుడూ తీయగానే ఉంటుంది. రెండు దేశాల్లోని క్రీడాభిమానులు ఇదే విధంగా ఆలోచిస్తారు. ఏ ఆటలోనైనా టోర్నమెంట్ గెలవటం కంటే కూడా భారత ఉపఖండంలోని తన పొరుగుదేశంపై సాధించే విజయమే రెండు దేశాల క్రీడాభిమానులకు ముఖ్యమైనది. రెండు దేశాల జట్లు ఏ క్రీడలో తలపడినా ఇరు దేశాల క్రీడాభిమానుల్లో ఇటువంటి భావనలే ఉంటాయి. అందువల్ల, ఈ సారి జరిగిన హాకీ టోర్నమెంట్ కూడా ఇందుకు మినహాయింపు కాదు. నిర్దేశించిన సమయం లోపల ఫలితం తేలక పోవటంతో పెనాల్టీ షూట్ అవుట్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇటువంటి నరాలు తెగే ఉత్కంఠతో భారత హాకీ జట్టు ఆటగాళ్ల





# ఒక ఎగసిపడిన కెరటం

ప్రశాంతంగా ఉంటూ లక్ష్యం సాధించారు. ప్రత్యేకించి గోల్‌కీపర్ ఎస్. శ్రీజీష్ సాహసోపేతంగా ఆడి, పాకిస్తాన్ దాడిని ఎదుర్కొని హీరోగా నిలిచారు. ఆస్ట్రేలియాకు చెందిన మైఖేల్ నోబ్స్ భారత హాకీ జట్టుకి కోచ్‌గా నూతనంగా నియమితులయ్యారు. తన అధ్వర్యంలో భారత జట్టు విజయ తీరాలకు చేరటంతో నోబ్స్ కూడా పరమానంద భరితుడయ్యాడు.

భారతదేశ హాకీ పతనా వ్యవస్థలో ఉన్న దశలో చేకూరిన ఈ విజయం చాలా గొప్పగా అన్పించింది. హాకీ నిర్వహణ కూడా అనేక వాద ప్రతి వాదాలలో, వివాదాలలో కూరుకునిపోయి, కునారిల్లుతున్న సమయంలో సంభవించిన ఈ గెలుపు ఎంతో సంతోషాన్ని తెచ్చింది. 20వ శతాబ్దపు తొలి 50 సంవత్సరాల పాటు భారతదేశం హాకీలో తిరుగులేని రాజుగా వెలిగిపోయింది. ఆ తరువాత వరుస వైఫల్యాలు ఆటను దెబ్బతీశాయి. హాకీతో అగ్రస్థానంలో ఉన్న భారత్ క్రమంగా పతనదిశలో ప్రయాణించింది.

అత్యంత అవమానకరమైన విషయం ఏమిటంటే, భారతదేశం 2008లో బీజింగ్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి కనీసం అర్హత సాధించలేకపోయింది. గత ఏడాది న్యూఢిల్లీలో జరిగిన 10వ కామన్‌వెల్త్ క్రీడల్లో ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతుల్లో భారత్ పరాజయం పాలైంది. అయితే, కామన్‌వెల్త్, క్రీడల్లో పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించిన సంతృప్తిని భారత్ దక్కించుకుంది.

అయితే, ఈ ఏడాది జరిగిన ఆసియా క్రీడల్లో కాని, అజ్లాన్ షా కప్ టోర్నమెంట్‌లో కాని భారతదేశం పెద్దగా ప్రతిభ కనపరచలేకపోయింది. హాకీ క్రీడపై ఆధిపత్యం సాధించడానికి హాకీ ఇండియా, ఇండియన్ హాకీ ఫెడరేషన్‌ల మధ్య జరుగుతున్న పోరాటం తారా స్థాయికి చేరి, అనేక చేదు అనుభవాలను మిగిల్చింది. ఈ గొడవల కారణంగానే, డిసెంబర్‌లో భారతదేశంలో జరగాల్సిన ప్రతిష్ఠాత్మకమైన ఛాంపియన్స్ ట్రోఫీని ఇక్కడ నిర్వహించకుండా, న్యూజీలాండ్‌లోని ఆక్‌లాండ్‌కు అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్ తరలించింది. ఈ రెండు సంస్థల మధ్య విభేదాలను పరిష్కరించడానికి చేస్తున్న ప్రయత్నాలు ఇంతవరకు ఫలించలేదు.

క్రికెట్ పట్ల, క్రికెట్ క్రీడాకారుల పట్ల ఉన్న మోజు వల్ల, క్రికెట్‌కు మీడియా ఇస్తున్న విపరీతమైన ప్రచారం వల్ల ఇతర క్రీడలు







బలహీనపడ్డాయి. ముఖ్యంగా భారతీయ సాంప్రదాయిక క్రీడలు బలైపోయాయి. చివరికి మన జాతీయ క్రీడ ఫీల్డ్ హాకీ కూడా ఇందుకు మినహాయింపు కాదు. నూతనంగా ప్రారంభించిన ఆసియాన్ ఛాంపియన్స్ ట్రోఫీని సాధించి మాతృదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా భారత హాకీ జట్టుకి లభించిన స్వాగతం తీరుతెన్నులు గమనిస్తే, ఈ విషయం స్పష్టమవుతుంది.

సుదూరాన ఉన్న మాంగోలియాలో మన హాకీ జట్టు సాధించిన విజయం గురించి ఎవరూ పెద్దగా మాట్లాడుకోలేదు. ఎవరూ సంబరాలు జరుపుకోలేదు. టపాకాయలు కాల్చలేదు. జాతీయ పతకాలను గర్వంగా ఊపలేదు. క్రికెట్‌పై ఉన్నట్లుగా హాకీ పట్ల మనవాళ్లకు మోజు లేదు. అధికారంలో ఉన్నవారెవరూ హాకీ విజయంపై ప్రకటనలు ఇవ్వలేదు. వార్తా పత్రికలు ఏదో మొక్కుబడిగా వార్తలు ప్రచురించాయి. ఇక టెలివిజన్ ఛానళ్లయితే మొత్తం టోర్నమెంట్‌నే విస్మరించాయి. హాకీ జట్టు విజయం సాధించిన అపురూపక్షణాలు బుల్లి తెరపై ప్రత్యక్షం కాలేదు. బాధాకరమైన విషయం ఏమిటంటే, మన క్రీడా ఛానళ్లు ఇంగ్లాండులోని లార్డ్స్ మైదానంలో - ఇంగ్లాండు, భారత్ జట్టుకు మధ్య జరిగిన క్రికెట్ టెస్టు మ్యాచ్‌ను భక్తిగా ప్రసారం చేశాయి - భారత జట్టు ఓటమి పాలయి, ఇంగ్లాండు జట్టు గెలిచినప్పటికీ. ఓడిపోయినప్పటికీ, క్రికెట్టే కావాలని మన దేశంలోని క్రికెట్ వీరాభిమానులు కోరుకుంటూ ఉండటమే ఇందుకు కారణం.

ఇదంతా చాలదన్నట్టు, మరెన్నో వింతలు జరిగాయి. ఈ సారి అధికార యంత్రాంగం నుంచి. హాకీ టోర్నమెంటు గెలిచినందుకు హాకీ ఇండియా నిర్వాహకులు ఒక్కొక్క క్రీడాకారునికి 25,000 రూపాయల బహుమతిని చాలా ఉదారంగా ప్రకటించారు. అయితే, ఈ అతితక్కువ మొత్తాన్ని స్వీకరించేందుకు ఆత్మాభిమానం కలిగిన హాకీ క్రీడాకారులు అంగీకరించలేదు. ఈ స్వల్ప మొత్తాన్ని బహుమానంగా ఇవ్వచూపటం ఆటకే అవమానమని, ఇదే ధోరణి కొనసాగినట్లయితే, హాకీ ఆడటానికి ఎవరూ ముందుకు రారని జట్టులోని క్రీడాకారులు హెచ్చరించారు. బోలెంత డబ్బు, కీర్తి ప్రతిష్ఠలను అందించే క్రికెట్ అంటేనే యువత ఆసక్తి చూపిస్తారని కూడా వారు హెచ్చరించారు.

అయితే, ఇటువంటి వైఖరి ఎవరినీ ఆశ్చర్యపరచలేదనే చెప్పాలి. ఎందుకంటే, క్రికెట్‌పట్ల కనపరుస్తున్న మోజు గురించి, హాకీ పట్ల ఉన్న సవతితల్లి ప్రేమ గురించి అందరికీ తెలిసిందే. హాకీ టోర్నమెంట్‌లో ఘనవిజయం సాధించి స్వదేశానికి వచ్చిన క్రీడాకారులకు ఇవ్వజూపిన మొత్తంతో మూడు జతల బూట్లు కూడా రావని మాజీ కెప్టెన్ ఒకరు వ్యాఖ్యానించవలసి వచ్చింది.

2012లో లండన్ ఒలింపిక్స్, తదితర అనేక ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ పోటీలు జరగనున్న దృష్ట్యా, క్రీడాకారులను ఉత్తేజపరచడానికి, ప్రోత్సహించడానికి మంచి నగదు బహుమతులు, ప్రోత్సాహకాలను అందించటం అవసరం. హాకీ విషయంలో ఇప్పటికే జరిగిన నష్టాన్ని క్రీడా మంత్రి జోక్యం కాని, నగదు బహుమతి పెంపుకాని తగ్గించలేకపోయాయి.

ప్రతిష్ఠాత్మక టైటిల్ గెలుచుకుని వచ్చిన హాకీ జట్టు సభ్యులకు ఇవ్వజూపిన స్వల్పబహుమతిని క్రికెట్ ఆటగాళ్లకు ఇచ్చిన కోట్లాది రూపాయలు, ప్లాట్లు, ఇంక్రిమెట్లు, ప్రమోషన్లు, ట్రెయినింగ్ అకాడమీల ప్రారంభించడానికి సహాయం, ప్రకటనలు, ప్రపంచవ్యాప్తంగా మీడియా ప్రచారం మొదలైన వాటితో పోల్చి చూడండి - ఎంత తేడా ఉంటుందో మన హాకీ జట్టు సభ్యుల గురించి, వారి పేర్ల గురించి మనలో ఎంత మందికి తెలుసు?

### ఆనాటి స్వర్ణయుగం

ఒకప్పటి భారతదేశ హాకీ గురించి, నాటి స్వర్ణయుగం గురించి












నేటి క్రీడాభిమానులు తక్కువగానే వినిఉంటారు. నాటి హాకీ క్రీడలో మేటి ఆటగాళ్లయిన ధ్యాన్‌చంద్, కె.డి.సింగ్ 'బాబు', తదితరుల గురించి కూడా పెద్దగా తెలిసి ఉండకపోవచ్చు. కాని గత శతాబ్దపు తొలి అర్ధభాగంలో హాకీ పోటీల్లో మిగిలిన దేశాలను భారత్ ఎలా మట్టి కురిపించిందో కూడా వీరు విని ఉండరు. నేటి హాకీ జట్టు సాధిస్తున్న అతికొద్ది విజయాలు, ఎక్కువ పరాజయాల గురించి మాత్రమే తెలిసివున్న ఈ నాటి యువతరానికి ఈ విశేషాలన్నీ నమ్మశక్యంగా కనపడకపోవచ్చు.

ఒలింపిక్ క్రీడా చరిత్రలో అత్యంత విజయవంతమైన హాకీ జట్టుగా భారతదేశం రికార్డు సాధించింది. 8 స్వర్ణ పతకాలు, ఒక వెండి పతకం, రెండు కాంస్య పతకాలను భారత హాకీ జట్టు గెలుచుకుంది. అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్‌లో భారతదేశం మొదటి యూరోపియనేతర సభ్యురాలిగా ఉండింది.

స్వాతంత్ర్యానికి పూర్వమే బ్రిటిష్ ఆర్మీ రెజిమెంట్లు హాకీని దేశంలో ప్రవేశపెట్టారు. త్వరలో ఈ క్రీడ చాలామంది భారతీయుల ఆదరాభిమానాలను చూరగొన్నది. 1885-86లో కలకత్తాలో మొదటి హాకీ క్లబ్బును ప్రారంభించారు. ఆ తరువాత బాంబే, పంజాబ్‌లలో హాకీ క్లబ్బులు ప్రారంభమయ్యాయి.

త్వరలోనే భారతీయులు హాకీలో తమ గురువైన బ్రిటిష్‌వారికి పాఠాలు నేర్పే స్థాయికి ఎదిగారు. ఆమ్‌స్టర్‌డామ్‌లో 1928లో జరిగిన ఒలింపిక్స్‌లో ప్రత్యర్థులకు ఒక్క గోల్‌కూడా ఇవ్వకుండా భారతదేశం హాకీ టైటిల్‌ను గెలుచుకోవటంతో ప్రపంచం నివ్వెరపోయింది. హాకీ క్రీడలో భారతదేశాన్ని ఇలా సమున్నతంగా నిలబెట్టిన ఖ్యాతి ధ్యానిన్‌చంద్‌దేనని చెప్పాలి. తన అత్యద్భుతమైన ప్రతిభాపాటవాలతో ధ్యాన్‌చంద్ అంతర్జాతీయ హాకీ క్రీడాభిమానులను ఉర్రూతలూగించాడు.

1928 నుంచి 1956 వరకు భారత హాకీ జట్టు 8 ఒలింపిక్ స్వర్ణ పతకాలను గెలుచుకుంది. 27 మ్యాచ్‌లలో వరుసగా గెలుపొందింది. ప్రత్యర్థులకు 7 మాత్రమే గోల్స్ ఇచ్చి తాను 178 గోల్స్ సాధించింది. ధ్యాన్ చంద్ మంత్ర తంత్రాలతో బంతిని తన ఇష్టానుసారం అదుపు చేస్తున్నాడని ప్రత్యర్థి జట్లు భావించేంతగా మన జట్టు /విజయప్రస్థానం సాగింది.

ఒక టోర్నమెంట్‌లో ధ్యాన్‌చంద్ 14 గోల్స్ సాధించాడు. దాంతో ఒక వార్తాపత్రిక ఇలా వ్యాఖ్యానించింది. "ఇది హాకీ కాదు. ధ్యాన్ చంద్ మ్యాజిక్ మాత్రమే", అని 1932లో జరిగిన ఒలింపిక్స్ పోటీల కోసం భారతజట్టు లాస్ ఏంజిల్స్‌కు వెళ్లింది. ఫైనల్ పోటీల్లో అమెరికాను ఒక గోల్ మాత్రమే చేయనిచ్చి, భారతజట్టు 24 గోల్స్ చేయటంతో, ధ్యాన్‌చంద్ ప్రతిభను అమెరికన్లు కళ్లారా చూశారు. తొలిమ్యాచ్‌లో జపాన్‌కు ఒక గోల్ మాత్రమే ఇచ్చి ఇండియా 11 గోల్స్ చేసింది. ఈ టోర్నమెంట్‌లో ధ్యాన్‌చంద్, ఆయన సోదరుడు రూప్‌చంద్ కలసి 25 గోల్స్ చేశారు. భారతజట్టు ఈ టోర్నమెంట్‌లో చేసిన మొత్తం గోల్స్ 35. హాకీ క్రీడకు ధ్యాన్‌చంద్ చేసిన సేవలకు గాను ఆయనకు తరువాత పద్మభూషణ్ అవార్డును ఇచ్చారు.

1960లో రోమ్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు పాకిస్తాన్ చేతిలో ఓడిపోవటంతోనే భారతీయ హాకీ స్వర్ణయుగానికి తెరపడిందని చెప్పవచ్చు. తరువాత టోక్యోలో జరిగిన ఒలింపిక్స్‌లో భారతజట్టు తిరిగి స్వర్ణపతకం సాధించింది. ధ్యాన్‌చంద్ కాక, కె.డి.సింగ్, బల్బీర్ సింగ్, లక్ష్మణ్, ధనరాజ్ పిళ్ళై, దిలీప్‌టిర్కీ మొదలైన వారు కూడా భారతీయ హాకీ రంగానికి గణనీయంగా సేవలందించారు.

**- దాసు కేశవరావు**

**(అనువాదం : వై. సరోజ)**





# గిరిజనుల సాధికారత కోసం పోరాడిన గోండ్వానా విప్లవ జ్యోతి - కొమరం భీమ్



**ఆదివాసి గిరిజనుల హక్కులకోసం నిజాం నిరంకుశ పాలనను అత్యంత ధైర్యసాహసాలతో ఎదిరించి, చారిత్రాత్మక పోరాటం చేసిన గోండ్వానా విప్లవ జ్యోతి..... కొమరం భీమ్.**

కొమరం భీమ్ పేరు స్మరిస్తేనే ఆ ప్రాంతంలోని ప్రజలలో హక్కుల కోసం స్వయం పోరాట స్ఫూర్తి రగులుతుంది అనడంలో ఏ మాత్రం సందేహంలేదు. ఆయన పోరాటం త్యాగం ఫలితంగానే అనంతర కాలంలో గిరిజనులకంటూ ఒక ప్రత్యేక అస్తిత్వం ఏర్పడింది అంటే అతిశయోక్తికాదు. కొమరం భీమ్ 71వ వర్థంతి సందర్భంగా ఆయన త్యాగాన్ని స్మరించుకోవలసిన ఆవశ్యకత నేడు ఎంతైనా ఉంది.

ఆదిలాబాద్ జిల్లా దట్టమైన అడవులతోపాటు, ఆదివాసీ గిరిజనులైన గోండుల నిలయంగా పేర్కొనవచ్చు. గోండులు ఉన్నతమైన సంస్కృతీ సాంప్రదాయాలతోపాటు రాజ్యాల వారసులు. ఇప్పటికీ, ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, సిర్పూర్-(టి) ప్రాంతాలలో గోండు రాజుల కోటలు ఉన్నాయి.

సాధారణంగా గోండులు దట్టమైన అటవీ ప్రాంతంలో జీవిస్తారు. వీరి గూడేల పరిపాలనా అంశాలు వీరి సాంఘిక పెద్ద ఆధీనంలో ఉంటాయి. ఇటువంటి సామాజిక నియంత్రణ కలిగిన గోండులు కొన్ని వందల సంవత్సరాల నుండి వారి గూడెంల ఆదీనంలో ఉన్న సహజవనరులపై (భూమి, అడవి, నీరు) స్వేఛ్ఛా హక్కులను అనుభవిస్తూ జీవనం కొనసాగి స్తూండేవారు.

గోండు రాజుల తర్వాత "అసఫ్ జాహి" వంశానికి చెందిన నిజాం నవాబుల పరిపాలన దక్కన్ ప్రాంతంలో హైదరాబాద్ రాజధానిగా కొనసాగేది. ఆ కాలంలో గోండు గూడెంలపై నిజాం నవాబు వివిధ రకాలైన నియంత్రణలు, పన్నులు విధించటం జరిగింది. స్వతహాగా ప్రకృతి ఒడిలో స్వేచ్ఛా జీవనం సాగిస్తూ, తమతమ జీవనోపాధికి అవసరమైన భూమిని - (అడవిని నరికి చదనుచేసి) సాగుచేయటం అలవాటైన గోండులకు భూమి, అడవివంటి వనరులపైన నియంత్రణ చేయటం వలన నిజాం నవాబుపై ఆగ్రహం కలిగించింది. అంతే కాకుండా గోండుల ఆధీనంలో ఉన్న భూమిని నిజాం స్వాధీనం చేసుకోవటం, అడవిలోకి ప్రవేశంకోసం అటవీశాఖాధికారుల అనుమతి వంటి అంశాల వలన సహజవనరులపై వీరి హక్కులను కాలరాయటం వలన గిరిజన గూడేలు ఏకమై నిజాం నవాబుపై చారిత్రాత్మకమైన పోరాటం జరిపినవి. పోరాటానికి నాయకత్వం వహించిన గోండ్వానా

విప్లవ జ్యోతే-కొమరం భీమ్.

కొమరం భీమ్ ఆదిలాబాద్ జిల్లా కేరామేరి మండలంలోని జోడెఘూట్ గూడెంలో గోండు గిరిజన కుటుంబంలో జన్మించారు. ఎప్పుడూ పాఠశాలకు వెళ్ళి చదువుకోని భీమ్ అన్ని విషయాలపట్ల మంచి అవగాహన ఉండి చుట్టు పక్కల ఉన్న 17 గూడెంల గోండు ప్రజల కష్ట, సుఖాలలో భాగస్వామిగా ఉండి వారి నాయకుడిగా గుర్తింపు పొందాడు.

నిజాంనవాబు నిరంకుశ పాలన గోండుల స్వేచ్ఛా జీవనంపై ప్రభావం చూపటం, వారి జీవనాధారాలైన జల్, జంగల్, జమీన్ (నీరు, అడవి, భూమి) లపై నిర్ణయాధికారం కోల్పోవటం భీమ్ ని కలచివేసింది. అనేక దఫాలు నిజాం - అధికారులైన తాలుక్‌దార్, నాజాం (సబ్-కలెక్టర్) జంగ్లాత్ అధికారులకు, వినతి పత్రం సమర్పించి వారి సమస్యలను విన్నవించటం జరిగింది. అయినా ప్రభుత్వం గిరిజనుల సమస్యలను అత్యంత తేలికగా తీసుకోవడమే కాకుండా అవిచివేతకు పాల్పడటం వలన కొమరంభీమ్ చుట్టుగల 17 గూడెంల ప్రజలను సమాయత్తం చేసి నిజాంపై పోరాటం సాగించాడు. చివరికి నిజాం సైనికుల తూటాలకు బలై ఆ ప్రాంత సహజ వనరులపై నిర్ణయాధికారం కోసం, గిరిజనుల స్వయంపాలన కోసం ఆదిలాబాద్ అడవులలో అమరులైనారు.



కొమరం భీమ్ త్యాగానికి, స్పందించిన నిరంకుశ నిజాం నవాబు ప్రముఖ ఆంత్రపాలజిస్ట్ హైమన్‌డార్ఫ్ గారిని గోండులలో అలజడికి కారణాలు అన్వేషించాల్సిందిగా కోరడం జరిగింది. నిజాం ప్రభుత్వం హైమన్‌డార్ఫ్‌గారి సూచనల మేరకు గోండుల సంక్షేమానికి చర్యలు తీసుకోవటం జరిగింది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా గోండుల సంక్షేమానికి నిరంతర కృషి జరుపుతూ వచ్చింది.



ఇటీవల కాలంలో భారత ప్రభుత్వం పంచాయితీ విస్తరణ చట్టం - (షెడ్యూలు ప్రాంత) 1996 చట్టం చేయటం జరిగింది. ఈ చట్టం షెడ్యూల్ ప్రాంతంలోని గిరిజనుల ఆచార - సాంప్రదాయాలకు అనుగుణంగా పరిపాలన సాగించుకోవటం కోసం ఆ గిరిజన గూడెం గ్రామసభకు సహజ వనరుల యాజమాన్యంపైన నిర్ణయాధికారాన్ని ఇవ్వటమే కాకుండా గిరిజనుల స్వయంపాలన అనే భావనను సాధ్యం చేసే దిశగా అడుగులు వేస్తుంది.

కొమరం భీమ్ 71వ వర్ధంతి సందర్భంగా మరొకసారి జల్, జంగల్, జమీన్ - సహజవనరులపై నిర్ణయాధికారం, గిరిజనుల స్వయం పాలనకోసం ప్రాణత్యాగం చేసిన గోండ్వానా విప్లవ జ్యోతి కొమరంభీమ్‌కు నివాళులర్పిస్తూ, భారత ప్రభుత్వం షెడ్యూల్ ప్రాంతం గిరిజనుల స్వయం పాలన కోసం చేసిన పిసాచట్టం-96 అమలుకు కృషి చేయటం ద్వారా, కొమరం భీమ్ ఆశయ సాధనలో ముందడుగు పడుతుందని ఆశిద్దాం.

**ఎ. సుభాష్ చంద్ర గౌడ్**
**సీనియర్ ఫ్యాకల్టీ, & డిప్యూటీ డైరెక్టర్, అపార్డు**

# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల కృషితో పాండురంగవారి పాలెంలో గ్రంథాలయం ఏర్పాటు



కొటాల శివారు గ్రామం పాండురంగపల్లెలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు స్వచ్ఛందంగా పఠనా మందిరాన్ని ఏర్పాటు చేయటంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల నుండి సేకరించిన రూ. 7500/-లు విరాళంలో సుమారు 250 పుస్తకాలతో ఈ పఠనామందిరం ఏర్పాటు చేసారు.

గ్రామంలో నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనానికి చిన్న చిన్న మరమ్మత్తులు చేసి ఈ భవనాన్ని పఠనా మందిరంగా మార్చాటానికి భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చొరవ తీసుకోవటంతో గ్రామస్తులంతా ముందుకు వచ్చి గ్రామంలో ఒక చక్కని వసతి సమకూర్చుకోగల్గారు. ఈ పఠనా మందిరాన్ని స్థానిక పార్లమెంట్ సభ్యులు ఎస్.శివప్రసాద్ ప్రారంభించడం ఒక విశేషం.

గ్రామస్తులలో చొరవ, స్వయం సహాయక ప్రవృత్తిని పెంపొందిస్తున్న బి.ఎన్.వి.ల సేవలను ఆయిన కొనియాడారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ఈ గ్రామంలో సుమారు 500 మొక్కలు నాటి ఒక్కొక్క వాలంటీర్లు 7 మొక్కలను దత్తత తీసుకొని సంరక్షిస్తుండటం ఒక ప్రత్యేకత పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై గోడలపై నినాదలాలు వ్రాసి ప్రజలలో చైతన్యం కలుగచేసి పలువురికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. ■

# ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో గిరిజన ప్రాంతాల్లో రహదారుల సౌకర్యం

'గ్రామీణ అనుసంధానం' ప్రాజెక్టు క్రింద గిరిజన గ్రామాలలో ఆవాస ప్రాంతాలను కలుపుతాం రహదారులు నిర్మించటానికి ప్రభుత్వం రూ. 210.64 కోట్లు కేటాయించింది. గిరిజన సంక్షేమశాఖ కమీషనర్ అభ్యర్ధన మేరకు ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్, కర్నూలు, మహబూబ్‌నగర్, ప్రకాశం జిల్లాలలో రూ. 249.64 కోట్లు రూపాయల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రాజెక్టుల అమలుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుండి గతంలో 39 కోట్లు కేటాయించగా, ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 210.64 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం జి.బి.ఎం.ఎస్ 343 ద్వారా ది. 17.10.2011న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులలో పైన పేర్కొన్న 6 జిల్లాలలోని 800 గిరిజన నివాసిత ప్రాంతాలలో 1729 కి.మీ. మేర రహదారుల నిర్మాణం చేపడతారు.

| వ.సం. | జిల్లాపేరు | ప్రతిపాదిత అంచనా వ్యయం రూ. కోట్లు | గిరిజన ఉప ప్రణాళిక ప్రాంతాలకు కేటాయించిన మొత్తం | |
|---|---|---|---|---|
| | | | గతంలో కేటాయించిన మొత్తం రూ. కోట్లు | ప్రస్తుతం కేటాయించిన మొత్తం రూ. |
| 1 | ఖమ్మం | 56.10 | 12.00 | 44.10 |
| 2 | ఆదిలాబాద్ | 97.26 | 12.00 | 85.26 |
| 3 | వరంగల్ | 50.00 | 10.00 | 40.00 |
| 4 | కర్నూలు | 8.08 | 0.00 | 8.08 |
| 5 | మహబూబ్‌నగర్ | 21.00 | 5.00 | 16.00 |
| 6 | ప్రకాశం | 17.20 | 0.00 | 17.20 |
| | | 249.64 | 39.00 | 210.64 |

IFPRI INTERNATIONAL FOOD POLICY RESEARCH INSTITUTE

# ఆకలి సూచీలో భారత్‌కు 67వ స్థానం

**అంతర్జాతీయ ఆహార విధాన పరిశోధనా సంస్థ (IFPRI) ఇటీవల విడుదల చేసిన 2011 ప్రపంచ ఆకలి సూచీ (గ్లోబల్ హంగర్ ఇండెక్సు -GHI)లో భారత్ 67వ స్థానంలో నిలిచింది. గ్లోబల్ హంగర్ ఇండెక్సు విలువ భారత్‌లో 23.7 గా నమోదు అయ్యింది. గత ఏడాదితో పోలిస్తే ఈ విలువ కొంచెం ఎక్కువగానే ఉంది. మొత్తం 84 దేశాలకు ర్యాంకులు కేటాయించగా, మన పొరుగుదేశాలైన చైనా 4 స్థానంలోనూ, పాకిస్తాన్ 59వస్థానం, శ్రీలంక 36వ స్థానంలో నిలిచాయి.**

పోషకాహారలోపం ఉన్న జనాభాస్థాయి, తక్కువ బరువు ఉన్న పిల్లల జనాభా, ఐదేళ్ళలోపు సంభవించే శిశుమరణాలు ఆధారంగా ఈ సూచీని రూపొందిస్తారు. ఈ సూచీ ప్రకారం మన కన్నా కేవలం 14 దేశాలలోని ప్రజలు మాత్రమే పోషకాహార స్థాయిలో అత్యంత దీనస్థితిలో ఉన్నారు. ఐ.సి.డి.ఎస్, మధ్యాహ్న భోజన పథకం, పి.డి.ఎస్ (చౌక ధరల దుకాణాలు- ప్రజా పంపిణీ వ్యవస్థ) వంటి పథకాలెన్ని అమలు జరుగుతున్నా పరిస్థితిలో మార్పు రాకపోవటం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ పనిచేస్తున్నప్పటికీ, ఆశించిన రీతిలో శిశుమరణాలు తగ్గక పోవటం కలవరపెట్టే అంశమే. తాజా సూచీ ప్రకారం పాకిస్థాన్, నేపాల్, ఆఖరుకి సూడాన్, రువాండా దేశాలకన్నా మన దేశం వెనుకబడి పోవటం బాధాకరమైన విషయం. ప్రపంచంలో బ్రిక్ దేశాలలో (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా) ఒకటిగా పరిగణించబడి అత్యంత వేగవంతంగా ఎదుగుతున్న దేశాలలో ఒకటైన మన దేశ జనాభా ఆకలితో అలమటిస్తే రాబోయే కాలంలో ఆశించిన అభివృద్ధి కుంటుబడే ప్రమాదం ఉంది. ■

# బహిరంగ మలవిసర్జన సమసిపోనిదే ప్రజారోగ్యం మెరుగవదు - కేంద్రమంత్రి జైరాం రమేష్

**దేశంలో నిర్మించబడుతున్న వ్యక్తిగత మరుగుదొడ్ల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, బహిరంగ మలవిసర్జన నేటికీ దేశాన్ని పట్టిపీడిస్తున్న తీవ్రమైన ఆరోగ్య సమస్యగానే మిగిలినదని భారతదేశ మానవ అభివృద్ధి నివేదిక 2011 స్పష్టం చేస్తోంది.**



'అనువర్తిత మానవ వనరుల పరిశోధనా సంస్థ' రూపొందించిన ఈ నివేదికలో బహిరంగ మల విసర్జన అలవాటు ముస్లింలలో కన్నా షెడ్యూల్డుకులాలు, షెడ్యూల్డు తెగల జనాభాలోనే ఎక్కువగా ఉన్నట్లు విశదమవుతోంది. ఇందుకు గల ప్రధాన కారణం ముస్లిం జనాభా పట్టణాలలో కేంద్రీకృతం కావటమే. మానవ ఆరోగ్యం, పోషణపై తీవ్రమైన ప్రభావం చూపటమేకాక మహిళలు, బాలికల భద్రతకు కూడా ఈ బహిరంగ మలవిసర్జన ఒక పెనుముప్పుగా పరిణమించినదని ఈ నివేదిక విడుదల చేసిన ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షుడు మాంటిక్ సింగ్ అహ్లువాలియా ఆవేదన వ్యక్తం చేసారు. 2008-09 సమాచారం ఆధారంగా రూపొందించిన ఈ మానవ అభివృద్ధి నివేదిక ప్రకారం, దేశంలో 50/- శాతం మంది సరైన పారిశుద్ధ్య వసతి లేక ఇబ్బంది పడుతున్నారు. బీహార్, ఛత్తీసగఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిషా, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో 60% కుటుంబాలకు మరుగుదొడ్డి సౌకర్యం లేదని ఈ నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. నివేదిక విడుదల సందర్భంగా, గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖా మంత్రి శ్రీ జైరామ్ రమేష్ మాట్లాడుతూ, దేశంలోని 6 లక్షల గ్రామాలలో కేవలం 25000 గ్రామాలు మాత్రమే నిర్మల గ్రామాలుగా ప్రకటించబడ్డాయని, మిగిలిన గ్రామాలను కూడా ఈ స్థాయికి తీసుకొని రావాలంటే శాఖాపరంగా బడ్జెటు కేటాయింపులు పెంచటంతోపాటు, ఒక బహుముఖ వ్యూహంతో సమస్య పరిష్కారానికి అందరూ కృషి చేయాల్సిన అవశ్యకత ఉందని అన్నారు. ■

# కీ క్యాప్ కార్యక్రమ స్ఫూర్తి సుస్థిరంగా నిలవాలంటే?







**ప్రజలను చైతన్య వంతులను చేసి సామాజిక సమీకరణ ద్వారా గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేయటానికి భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సహకారంతో అపార్డు చేపట్టిన కీక్యాప్ ప్రయోగం స్ఫూర్తి గ్రామాలలో కలకాలం నిలిచిఉండాలంటే ఏం చెయ్యాలనే విషయంపై 16.10.2011 అపార్డులో ఒక మేధోమధనం కార్యక్రమం జరిగింది. అపార్డు కమీషనరు ఆధ్వర్యంలో జరిగిన ఈ మేధోమధనంలో గ్రామీణాభివృద్ధి రంగంలో నిష్ణాతులైన విషయనిపుణులు, పత్రికావిలేఖరులు, విద్యావేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.**

ఈ సందర్భంగా కీక్యాప్ కార్యక్రమంపై ఆసక్తి కరమైన చర్చ జరిగింది. చర్చలో పాల్గొన సభ్యులంతా కార్యక్రమం ప్రజలను సమీకరించి చైతన్య పర్చటంలో సఫలీకృతమయిందని, అయితే ఈ మార్పుకి భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ఉత్ప్రేరకంగా పనిచేయటం వల్ల సాధ్యమయినందువల్ల, ఈ వాలంటీర్లు భవిష్యత్తులో కూడా ఈ సేవా కార్యక్రమాలు కొనసాగించాలంటే, జీవితాలలో వారు నిలదొక్కుకొనేలా ఏమైనా నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు రూపొందించి, ఈ కార్యక్రమంలో పాల్గొనటం ద్వారా వ్యక్తిగతంగా కూడా లబ్ధి చేకూరిందనే భావనను కలుగ చేయవలసినదన్న అవసరం ఎంతైనా ఉన్నదనే భావం వ్యక్తమయింది. అపార్డు కేవలం శిక్షణా సంస్థ మాత్రమే అయినందువల్ల, ఈ బి.ఎన్.విలను వివిధ ప్రభుత్వశాఖలు తమ శక్తిగా భావించిననాడు వారి సేవలు విస్తృతం చేయవచ్చనే భావన కూడా వ్యక్తమయింది. ప్రతీ గ్రామంలోనూ కొన్ని రంగాలలో 'బెంచ్‌మార్కు' ఏర్పాటు చేసుకొని ఆ రంగాలలో పురోభివృద్ధిని సాధించి చూపితే అది మిగిలిన గ్రామాలకు స్ఫూర్తి దాయకంగా ఉంటుందనే అభిప్రాయం కూడా వ్యక్తమయింది.

బి.ఎన్.వి.లు కూడా అదే గ్రామానికి చెందిన వారు, పైగా గ్రామ పంచాయితీ గ్రామసభలో సభ్యులు అయినందున, గ్రామసభలను విస్తృతంగా జరపటం ద్వారా జన చైతన్యం తేగల్గితే ఆ స్ఫూర్తి కలకాలం నిల్చి ఉంటుందనే భావం వ్యక్తమయింది. ఇంకా పలు అంశాలపై ఆసక్తి కరమైన చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డి.పొ॥ ఆర్.ఆర్.ప్రసాద్ జిమో 40 నుండి డా. విజయభాస్కరరెడ్డి, సీనియర్ పాత్రికేయులు శ్రీ సిద్దయ్య, మార్కండేయ, గ్రామీణాభివృద్ధి రంగ నిపుణులు పాలోరీ బెనర్జీ, వందేమాతరం ఫౌండేషన్ మాధవరెడ్డి, డా. జగన్, విద్యావేత్తలు, వినాయక్, విజయారావు, రాజేంద్రరెడ్డి, ఉప్రేందర్ రెడ్డి, అపార్డు ఫాకల్టీ తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ ఎరువులతో రైతు ఇంట సిరుల పంట

**ఆర్థిక సంస్కరణలు దేశంలో ఊపందుకొనే వరకూ వ్యవసాయ రంగం భారతదేశానికి వెన్నెముకగా నిలిచింది. రాను రాను జాతీయాదాయంలో కూడా ఈ రంగం వాటా తగ్గుతూ వస్తోంది. ఇందుకు కారణంగా రైతులు వ్యవసాయంలో ఆధునాతన పరిజ్ఞానాన్ని వినియోగించకుండా, ఒకే పంట విధానాన్ని అవలంబించడాన్ని చెప్పుకోవచ్చు. అంతేకాకుండా ప్రకృతి సిద్ధమైన వనరుల వినియోగాన్ని తగ్గించి, రసాయనిక సమ్మేళనాలను అధికంగా వినియోగించడం వల్ల క్రమేపీ భూసారంలో కూడా మార్పులు సంభవించాయి. ఈ విధానాల వల్ల సాంప్రదాయ విధానంలో వ్యవసాయం చేసే రైతులు కాలంతో పోటీపడలేకపోతున్నారు.**

ఈ క్రమంలో వ్యవసాయంలో స్థానిక వనరులను ఉపయోగించేందుకు, ప్రకృతి సహజమైన ప్రత్యామ్నాయాలు ఎంతగానో ఉపయోగపడతాయని నిరూపిస్తూ, సాంప్రదాయక రైతులకు అనుగుణంగా కాలం మార్పు చెందుతూ వచ్చింది. ప్రకృతి సహజంగా ఏర్పడిన ప్రత్యామ్నాయాలలో సేంద్రీయ ఎరువుల నిర్వహణ చెప్పుకోదగినది. చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయం కొరకు ఉపయోగించే రసాయనిక ఎరువుల వల్ల, వ్యవసాయంపై వారు పెట్టే అధిక పెట్టుబడుల వల్ల కలుగుతున్నటువంటి ఎన్నో అనర్థాలను దృష్టియందుంచుకొని 'గ్రామీణ దారిద్ర్య నిర్మూలన సంఘం', 'ఇందిరా క్రాంతి పథం' సమిష్టిగా మహిళా స్వయం సహాయక సంఘాల (మండల సమాఖ్య) ద్వారా సేంద్రీయ ఎరువుల నిర్వహణ (Non Pesticidal Management) ను, ఉపయోగ విధానాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించాయి. ఇందుకు గాను ప్రజల నిర్వహణలో సుస్థిర వ్యవసాయం (Community Managed Sustainable Agriculture CMSA) పద్ధతిని ప్రవేశపెట్టాయి.

రైతులు సుస్థిర వ్యవసాయ పద్ధతులనుపయోగించే విధంగా వారిని ప్రోత్సహించటం, తద్వారా వ్యవసాయాధారిత జీవనోపాధి పెంపొందించటం, వ్యవసాయంపై పెట్టే పెట్టుబడులు తగ్గించటం, నికర ఆదాయాన్ని పెంపుదల చేయటమే సి.ఎమ్.ఎస్.ఎ. ముఖ్య ఉద్దేశ్యం. అంతేకాకుండా వ్యవసాయరంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న పెనుసవాళ్లయినటువంటి అధిక రసాయనిక ఎరువుల వినియోగం, స్థానిక వరిజ్ఞానాన్ని సరిగా వినియోగించకపోవడం, అసాధారణ వ్యవసాయ పద్ధతులను (ఉదా: ఒకే పంట విధానం, మార్కెట్ హెచ్చుతగులు మొ॥వి) కూడా ఈ విధానం ద్వారా రూపుమాపటం కూడా మరొక ఉద్దేశ్యం.

**సి.ఎమ్.ఎస్.ఎ. లక్ష్యాలను ఈ క్రింది విధంగా చెప్పవచ్చును.**

1. వ్యవసాయాధారిత జీవనోపాధులను కొనసాగించడం.
2. అధునాతన పరిజ్ఞానం ద్వారా భూనమూనా నుండి పంట నిర్వహణ వరకు ఉపయోగపడే విధంగా వర్షపు నీటిని రక్షించే చర్యలు చేపట్టటం.
3. సన్న, చిన్నకారు రైతులు, మహిళలు, కౌలురైతులు, వ్యవసాయ కూలీలపై ప్రత్యేక శ్రద్ధ.
4. గృహస్థాయిలో పోషకాహార భద్రత కల్పించడం.

ఈ ప్రాజెక్టు ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాలోని కోస్గి మండలంలో గల 12 గ్రామాలలో 400 ఎకరాలలో మొట్టమొదటిగా సాగు ప్రారంభించబడినది. ఇక్కడ సాధించినటువంటి ఫలితాలు పంట దిగుబడితో నిమిత్తం లేకుండా కృత్రిమ ఎరువుల వినియోగాన్ని నిలిపివేయవచ్చునని నిరూపించాయి. ఈ ఫలితాలతో మిగిలిన అన్ని జిల్లాలకు ఈ కార్యక్రమం విస్తరించబడినది.

2009-10 సంవత్సరంలో మహిళా స్వయం సహాయక సంఘాలు, మండల సమాఖ్యల అనుభవాల ద్వారా సేంద్రీయ ఎరువుల నిర్వహణ విజయవంతమైనట్లుగా నిరూపితమైనది. ఈ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని 21 జిల్లాలోని 4114 గ్రామాలలో గల 4.56 లక్షల మంది రైతుల ద్వారా 18.15 లక్షల ఎకరాలను సాగులోనికి తీసుకురావటం జరిగింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టును 22 జిల్లాలకు వ్యాపింపచేస్తూ 25 లక్షల ఎకరాలను సాగులోనికి తీసుకురావటానికి

ప్రణాళిక తయారు చేయబడినది.

ప్రజల నిర్వహణలో సుస్థిర వ్యవసాయ నిర్వహణ (సి.ఎమ్.ఎస్.ఎ) ను మనం గమనించినట్లైతే గత 6 సం॥రాలలో ఈ క్రింది విధంగా ప్రయాణం సాగింది.

| వ. సం. | సంవత్సరం | జిల్లాల సంఖ్య | క్లష్టర్ల సంఖ్య | గ్రామాల సంఖ్య | రైతుల సంఖ్య | మొత్తం ఎకరాలు |
|---|---|---|---|---|---|---|
| 1 | 2005-06 | 10 | 90 | 450 | 15000 | 25000 |
| 2 | 2006-07 | 17 | 210 | 1050 | 80000 | 200000 |
| 3 | 2007-08 | 18 | 338 | 1715 | 189000 | 675000 |
| 4 | 2008-09 | 18 | 625 | 3171 | 318420 | 1379000 |
| 5 | 2009-10 | 21 | 805 | 4114 | 456604 | 1815358 |
| 6 | 2010-11 | 22 | 1504 | 7565 | 1000000 (లక్ష్యం) | 3000000 (లక్ష్యం) |

సేంద్రీయ ఎరువులు, వ్యర్థపదార్థాలతో వ్యవసాయం చేసే విధానాన్ని ప్రజలలోకి వ్యాపింప చేయడానికి గాను సి.ఎమ్.ఎస్.ఎ. ఈ దిగువ వ్యూహాలను అవలబించింది.

**1. విజ్ఞానం ఆధార నమూనా (Knowledge Centric)**

బోధన ఆధారిత నమూనా నుండి విజ్ఞానం, నైపుణ్యం ఆధారిత నమూనాకు మార్పు చెందడానికి ముఖ్య ఉదాహరణగా సి.ఎమ్.ఎస్.ఎ.ను చెప్పుకోవచ్చు. ఈ విధానంలో స్థానికంగా దొరికే సహజ వనరులను వీలైనంతగా వినియోగించుకొనే అవకాశం ఉంది. అంతేకాకుండా ఈ విధానంలో సహజ సిద్ధమైన పద్ధతుల ద్వారా లభించే ఉన్నతమైన ప్రయోజనాలను పొందవచ్చును.

**2. సహజ సిద్ధమైన విధానాలు (Natural Processes)**

సి.ఎమ్. ఎస్.ఎ. ద్వారా సూచించబడిన సహజసిద్ధమైన విధానాలన్నీ కూడా సైద్ధాంతికంగా నిరూపించబడిన సాంకేతిక, స్థానిక నైపుణ్యాల మిశ్రమమే. గతకొద్ది కాలంగా ఈ విధానాలు ఎరువుల వినియోగం తాలూకు ఖర్చులు తగ్గించటానికి, వ్యవసాయానికి మిత్రులైనటువంటి క్రిమికీటకాలు, పురుగులు, ఎరువుల మధ్య సమతుల్యతను సాధించే పర్యావరణాన్ని నిర్మిస్తున్నాయి.

**3. సేంద్రీయ ఎరువుల నిర్వహణ (Non-Pesticidal Management-NPM)**

సి.ఎమ్.ఎస్.ఎ. మొక్కలను రక్షించటానికిగాను ఎన్.పి.యం. విధానాన్ని అనుసరించింది. సి.ఎమ్.ఎస్.ఎ. విధానంలో ఎన్.పి.యం ఒక కలికితురాయి. క్రిమికీటకాల జీవచక్రాన్ని, నడతను అర్థం చేసుకోవటం ద్వారా చీడపీడలను తగ్గించటం కంటే కూడా నివారించడమే చీడపీడల నిర్వహణలో ముఖ్యసూత్రం. ఇదే



ఎన్.పి.యం.లో అంతర్గతంగా దాగివున్న అంశం కూడా.

**4. రాజీలేని అంశాలు (Non - Negotiables)**

చీడ పీడల నిర్వహణకై నాన్ నెగోషియబుల్స్ అనే విస్తారమైన వ్యూహాన్ని సి.ఎమ్.ఎస్.ఎ.లో భాగంగా కనుగొనడం జరిగింది. ఇందులో వేరుశనగపంట నాశించే వివిధ తెగుళ్ళు, చీడపీడలు, వరిపంటల నాశించే తెగుళ్ళు, వరినారు నాటే సమయంలో చివర్లు కత్తిరించడం మొదలగునవి వుంటాయి.

**5. భూసారాన్ని పరిరక్షించటం (Building soil Health)**

సి.ఎమ్.ఎస్.ఎ. విధానంలో భూమిని కూడా ఒక జీవిగానే కాకుండా పంట కవసరమైన పోషకాల నందించే ఒకగనిగా పరిగణిస్తారు. అందువల్ల భూసారాన్ని పరిరక్షించటానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. భూమిలో వానపాముల (రైతు మిత్రుడు) చర్యలను పెంపొందించడం, రసాయనిక ఎరువుల నిషేధం, కుళ్ళ బెట్టిన, పేడతో కూడిన పదార్థాల వినియోగం అనే మూడు పదునైన వ్యూహాలను సి.ఎమ్.ఎస్.ఎ. అవలంబించింది.

భిన్నమైన పంటల విధానం ద్వారా భూసారాన్ని పెంచడంతోపాటు చీడపీడల బారి నుండి కాపాడవచ్చును. పంట నాశనానికి వ్యతిరేకంగా విపత్తు బీమాగా ఇది పని చేస్తుంది. భిన్నమైన పంటలను పండించడం ద్వారా పంట దిగుబడి పెరగడంతో పాటు రైతులకు ఆదాయం కూడా పెరుగుతుంది. సంవత్సరమంతా కూడా ఏదో ఒక పంట పండించడానికి, తద్వారా ఆహార సరఫరా చేయడానికి అవకాశం వుంది. విభిన్న పంటలు పండించడం ద్వారా ప్రజలకు పోషకాహార భద్రత కూడా కల్పించబడుతుంది.

## సి.ఎమ్.ఎస్.ఎ. క్రింద చేపట్టిన ప్రాయోజిత కార్యక్రమాలు

2010-11 సం॥రనకు గాను సి.ఎమ్.ఎస్.ఎ.లో పి.ఓ.పి విధానం, 36×36 నమూనాలు, శ్రీవరి, వర్షాధారిత వ్యవసాయం మొ॥వి ప్రాయోజిక కార్యక్రమాలుగా గుర్తించబడ్డాయి.

### పి.ఓ.సి విధానం

- భూమి లేని నిరుపేదలకు భూమిని కౌలుకివ్వటం ద్వారా, సి.ఎమ్.ఎస్.ఎ. విధానాలనుపయోగించి ఈ భూముల్లో సాగుచేసే విధంగా వారికి సదుపాయాలు కలుగజేయటం.
- నిరుపేద కుటుంబాలకు 0.50 ఎకరం కౌలు కిప్పించి, 0.25 ఎకరంలో శ్రీవరి సాగు చేసేందుకు, 0.25 ఎకరంలో విభిన్న పంటలు అనగా కూరగాయలు, చిరుధాన్యాలు పండించేందుకు ప్రేరేపించడం.
- ఈ విధానం 2 లక్ష్యాలను సాధించడానికి గాను నిర్దేశించబడినది. ఒకటి నిరుపేద కుటుంబాలు సం॥రానికి రు. 40.000/-లు నికరాదాయం సంపాదించడం. రెండవది ఉత్పత్తులను మార్కెట్లో అమ్మడంతోపాటు వారి స్వంత వినియోగానికి కూడా దాచుకోవడమే కాకుండా పొలంలోని వివిధ పోషకాలను వారు పొందగలరు.
- పి.ఓ.సి. విధానాన్ని 2009-10 సం॥లో రాష్ట్రంలోని 251 నిరుపేద కుటుంబాలలో అమలు చేయడం జరిగింది. పంటవిధానం, విత్తనాలు విత్తే సమయం ఆధారంగా ఖరీఫ్ సీజన్‌లో నిరుపేద కుటుంబాల ఆదాయ స్థాయి రూ. 15,000/- నుండి రూ. 40,000/ - వరకు పెరగటం జరిగింది.
- ఈ విధానాన్ని అవలంబించడానికి మొత్తం అన్ని జిల్లాలలో సుమారు 1000 నిరుపేద కుటుంబాలను గుర్తించటం జరిగింది.

### 36X36 నమూనా

- గృహస్థాయిలో పోషకాహార భద్రత సాధించడానికి 36×36 నమూనాను సి.ఎమ్.ఎస్.ఎ. అభివృద్ధి చేసింది. పంటలలో భిన్నత్వాన్ని ఆపాదించడం ద్వారా అనగా దుంపల నుండి పండ్ల వరకు, కూరగాయల నుండి చిరు ధాన్యాల వరకు అన్ని పంటలను పండించడం ద్వారా ఒక కుటుంబానికి కావలసిన పోషకాహార అవసరాలు తీరుతాయి. చిన్న స్థలాలలో కూడా విభిన్న పంటలు పండించడం ద్వారా పోషకాహార భద్రత కలగటమే కాక,సంవత్సరం పొడవునా కుటుంబ ఆదాయం పెంపుదలలో ఈ నమూనా ఎంతో విలక్షణంగా పనిచేస్తుంది.
- 2009-10 సం॥రంలో రాష్ట్రం 7000 పైబడి 36×36 నమూనాలు లేదా 7 టైర్ నమూనాలను ఏర్పాటు చేసారు. ఈ నమునా నుండి రూ. 4000- రూ. 12000/-లు వరకు ఆదాయం లభించింది. ఐతే ఆదాయంలో ఏర్పడిన వ్యత్యాసాలకు కారణం పంట విస్తీర్ణంలోని సాంద్రత. ప్రత్యేకంగా ఆకుకూరలు మాత్రమే పండించిన నమూనాలో హెచ్చు మొత్తం ఆదాయం లభించింది.
- 2010-11 సంవత్సరానికి రాష్ట్రంలో 36×36 నమూనా గురించి ప్రచారం చేయటానికి గాను, నిరుపేద కుటుంబాలు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చేతల్లులు ఉన్నటువంటి వెనుకబడిన కుటుంబాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ సి.ఎమ్.ఎస్.ఎ. గ్రామాలలోని సి.ఎ.మరియు సి.ఆర్.పి.లతో ప్రత్యేక కార్యక్రమం రూపొందించబడినది. 2010-11 సంవత్సరానికి 25 వేల 36×36 నమూనాల రూపకల్పన లక్ష్యంగా నిర్ణయించబడినది.

### శ్రీవరి

- వరిసాగుకై సి.ఎమ్.ఎస్.ఎ. అభివృద్ధి చేసిన ,తక్కువ ఖర్చుతో కూడిన, ప్రయోజనకరమైన మార్గమే 'శ్రీ'. అనగా ధాన్యాన్ని బలోపేతం చేసే పద్ధతి (System of Rice intensitication)
- 2009-10 సం॥రంలో రాష్ట్రంలోని 1800 ఎకరాలలో 'శ్రీ' పద్ధతిని అమలు చేయడం జరిగినది. జిల్లాలోని సాగుదారుల సంఖ్య ఆధారంగా లక్ష్యం నిర్ణయించబడినది. 3 ఎకరాలలో శ్రీవరి సాగును చేపట్టడం, సాగుదారు లక్ష్యం. 2009-10 సం॥రంలో నిర్ణీత లక్ష్యంలో 55% లక్ష్య సాధన జరిగింది.
- 2010-11 సం॥రం నకు గాను 5000 ఎకరాలలో శ్రీవరి సాగును చేపట్టడం లక్ష్యంగా నిర్ణయించబడినది.

### మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో వర్షాధార జలాలతో కొనసాగించే వ్యవసాయం (Rainfed Sustainald Agriculture - RFSA - MGNREGS Convergence)

- ప్రతి రైతు తన స్వంత పొలంలో పంట మొత్తాన్ని వర్షపునీరుతో పండించడానికిగాను ఈ ఆర్.ఎఫ్.ఎస్.ఎ. అనే ప్రత్యయం అభివృద్ధి చేయబడినది.
- గ్రామాలలో ఆర్.ఎఫ్.ఎస్.ఎ. ఉత్పాదక వ్యయం 2009-10 సంవత్సరానికి రూ. 1630 కోట్లు మరియు 2010-11 సంవత్సరానికి రూ. 1433 కోట్లు.
- హద్దుల వెంబడి కందకం ఏర్పాటు, పొలమంతటా నీటిని గ్రహించే

విధంగా వాలుతో కూడిన నీటి చాళ్ళ ఏర్పాటు, నీటి చెలమ త్రవ్వకం, కంపోస్టు గుంట ఏర్పాటు, నాగలితో దున్నడం, పండ్ల మొక్కల పెంపకం మొ॥వి ఆర్.ఎఫ్.ఎస్.ఎ.లో భాగాలుగా వున్నాయి.

- పై తెల్పిన అంశాలు అభివృద్ధి చేయటానికి ఒక ఎకరానికి రూ. 48,910/-లు ఖర్చు చేయబడుతున్నది. ప్రస్తుతం ఈ విధానం 1.46 లక్షల షెడ్యూలు కులాలు / తెగల రైతుల తాలూకు 3.19 లక్షల ఎకరాలలో అమలు చేయబడుచున్నది.

### ఆర్. ఎఫ్.ఎస్.ఎ పొలాలో పంట నిర్వహించే విధానం

1. వర్షపు నీటిని గ్రహించటానికి పొలంలో త్రవ్విన నీటి చాళ్ళ గట్లపై సంవత్సరం పొడవునా జీవించే మొక్కలతో పాటు ఆకుపచ్చ ఎరువు మొక్కల పెంపకం చేపట్టాలి.
2. పొలంలోని నీటి చెలమల వద్ద 36×36 నమూనాలో 25 పండ్ల మొక్కల పెంపకం.
3. పొలం హద్దుల వెంబడి త్రవ్విన కందకం చుట్టూ చెట్ల పెంపకం.
4. నీటి చాళ్ళ మధ్యలో 2:1 నిష్పత్తిలో కందులు, 5:1 నిష్పత్తిలో జొన్నలు, వేరుశనగ విత్తే విధంగా పంట విధానాన్ని కొనసాగించాలి.
5. ఒక ఎకరంలో సుమారుగా 1250 చిన్న చిన్న చెట్లను నాటాలి. ఇందులో పొలం హద్దుల వెంబడి 100 జీవ కంచెమొక్కలు, 150 టేకు మొక్కలు నీటి చాళ్ళలో నాటేవి అయివుండాలి. 1000 పచ్చి ఎరువు మొక్కలు నీటి చాళ్ళలో నాటిన కందులు, ఆముదం మొక్కల మధ్య నాటాలి.

**ఇతర పద్ధతులు**

1. **(NADEP) కంపోస్టు గుంటలు:-** ఎరువుల అవసరాలను తీర్చుకోవటానికి గాను ఈ గుంటలు అభివృద్ధి చేయబడ్డాయి. ఇంతవరకు 15426 కంపోస్టు గుంటలు నిర్మించబడ్డాయి.
2. **NPM దుకాణాలు :-** సమయానుకూలంగా జీవ ఔషధాలను, పర్యావరణానికి మిత్రులుగా ఉపయోగపడే వస్తువులను సరఫరా చేయడానికి గాను ఈ NPM దుకాణాలు ఏర్పాటు చేయబడ్డాయి. అంతేకాకుండా ఈ దుకాణాలు నిరుపేద కుటుంబాలకు నిరంతర ఆదాయాన్ని అందిస్తున్నాయి. ప్రాజెక్టు ప్రాంతం మొత్తంలో ఇప్పటి వరకు 2394 NPM దుకాణాలు ఏర్పాటు చేయబడ్డాయి. NPM దుకాణాల నుండి లభించే ఆదాయం సీజన్‌లో అయితే రూ.1500/-లు, సీజన్ కానప్పుడు రూ. 500/-లు వరకు ఉంటుంది.
3. **కస్టమ్ హైరింగ్ సెంటర్లు (Custom Hiring Centres) :-** చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయావసరాలను సాధారణ ధరలకు అద్దెకు సరఫరా చేయడమే ఈ సెంటర్ల ముఖ్య ఉద్దేశ్యం. ఇలా చేయడం వల్ల నిర్ణీత సమయంలో రైతులు వ్యవసాయాన్ని చేపట్టగలుగుతారు. ఈ సెంటర్ల వల్ల సమాఖ్యలు ఆదాయాన్ని పొందుతున్నాయి. ఇంతవరకు 304 మండలాలలో 789 కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేయబడ్డాయి.

**వేప పల్వరైజర్లు (Neem Pulvarizer) :-** వేప చెక్క, పొడి వగైరా వేప సంబంధిత పదార్ధాలను సరఫరా చేయడానికిగాను వ్యవసాయ శాఖ వారి సమన్వయంతో సమాఖ్యలు 198 వేప పల్వరైజర్లను కొనుగోలు చేసాయి.

**గట్లపై మొక్కల పెంపకం (Bund Plantation) NPM :-** ఆకుపచ్చ ఎరువును సరఫరా చేయడానికిగాను 66822 మంది రైతుల పొలాల్లో గట్లపై మొక్కల పెంపకాన్ని చేపట్టారు.

### సి.ఎమ్.ఎస్.ఎ. కార్యక్రమం ఇంత త్వరగా వ్యాప్తి చెందడానికి ముఖ్యకారణాలు

1. వ్యవసాయంపై రైతులు పెట్టే పెట్టుబడి అంటే రసాయనిక ఎరువులు, పురుగు మందులపై ఖర్చు గణనీయంగా తగ్గిపోవడం, వారి ఆదాయంలో పంట పంటకీ మిగులు కనిపించడం.
2. ఈ విధానంలో వ్యవసాయం చేసిన రైతులు తమ పొలాలను తనఖాదారులు, వడ్డీ వ్యాపారుల నుండి తిరిగి పొందగలిగారు.
3. కొంతమంది చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయం నిమిత్తం మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకున్నారు.
4. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించడం వల్ల అనారోగ్యం బారిన పడటం కూడా తగ్గిపోతుంది. అందువల్ల ఆదాయం మిగలడమే కాకుండా పౌష్టికాహారం తీసుకునే అవకాశం కలుగుతున్నది.
5. ఈ వ్యవసాయ విధానంలో సంవత్సరం పొడవునా పండించే విభిన్న పంటల వల్ల గ్రామస్థాయిలో పోషకాహార భద్రత కూడా పెరుగుతున్నది.

ఇన్ని ఉపయోగాలున్న సి.ఎమ్.ఎస్.ఎ. విధానాన్ని రాష్ట్రంలో రైతులందరికీ చేరువగా తీసుకువెళ్ళేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ మరింత కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. అంతేకాకుండా ఈ విధానంలో వ్యవసాయం చేయడం వల్ల ప్రస్తుతం ప్రపంచ దేశాలను పట్టి పీడిస్తున్న గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులను కూడా కొంతమేరకు తగ్గించే అవకాశం వుంటుంది.

మరి ఈ లక్ష్య సాధనకు మనందరం కూడా చేతనైనంత సాయం చేయడానికి, ఎప్పటి సమాచారం అప్పుడు రైతులకు అందంచటానికి నడుం బిగిద్దామా?

**"రైతే రాజు" అన్న నానుడిని సార్థకం చేద్దామా?**

**- గంధం సత్యవాణి**
ఫ్యాకల్టీ సభ్యులు, ఆపార్డు

# ఆల్కహాల్‌తో అనర్థాలు!

**తాగుడికి ఎక్కువమంది అలవాటు పడడానికి కారణం దీనిని సేవించినపుడు మనసులోని ఆందోళన, ఉద్రిక్తత మటుమాయమై వారికి తాత్కాలిక ఉపశమనం కలుగుతుంది. మనిషి సహజసిద్ధమైన సిగ్గు, మర్యాద, గౌరవం వంటి లక్షణాలు కల్గి ఉంటాడు. మద్యం సేవించేసరికి ఇవన్నీ అతని నుండి తొలగిపోతాయి.**

బాధపడడం, దిగులుగా ఉండడం వారికి తెలియదు. మొండి ధైర్యం వచ్చేస్తుంది. దీనికి కారణం మద్యం మెదడులోని కొన్ని ముఖ్య భాగాల చర్యలు అణచివేయడమే. అందుకే తాగిన మనిషి సభ్యప్రపంచం హర్షించలేని సిగ్గుమాలిన పనులు చేస్తూ ఉంటాడు.

మనం ఏ పదార్థాలు తిన్నా, తాగినా అవి జీర్ణమై రక్తంలో ప్రవేశించి వాటి ప్రభావాన్ని చూపడానికి కొన్ని గంటలు పడుతుంది. కాని మద్యం నోట్లో పోసుకున్నప్పుడే కొంత రక్తంలోకి శోషించబడుతుంది. ఇది శరీరంలోని ఏ మెత్తటి  భాగం ద్వారా నైనా శరీరంలోకి వెళ్లిపోతుంది.

మద్యం మనిషికి చురుకుదనం పుట్టించదు సరికదా నిద్రను కలుగజేస్తుంది. మెదడును పూర్తిగా బలహీనపరుస్తుంది. త్రాగుడుకు అలవాటు పడినవారిలో విచక్షణ, వివేకం మందగిస్తాయి. ఆలోచనాశక్తి, నిర్ణయం చేయగల సామర్థ్యం సన్నగిల్లిపోతాయి.

మితిమీరి దీర్ఘకాలం మద్యానికి బానిసలయిన వారికి జ్ఞాపకశక్తి పూర్తిగా కోల్పోవడమే కాదు మాట మందగించి ప్రవర్తనాతీరు వికృతంగా మారి పూర్తిగా ఉన్మాదుడుగా తయారవుతాడు.

మద్యం సేవించడం వల్ల మగవారు పుంసత్వం కోల్పోతారని శాస్త్రవేత్తల పరిశోధనలు చెబుతున్నాయి. లైంగిక ప్రక్రియలో మగతనాన్ని ఏర్పరచే సెక్స్‌హార్మోన్ టెస్టోస్టిరోన్ ఉత్పత్తి మద్యం తాగడం వల్ల తగ్గిపోతుంది. దాని వల్ల సంభోగశక్తి క్షీణించి నపుంసక లక్షణాలు వస్తాయి.

### దోసు పెరిగే కొలది. . .

మనిషి తాగే మద్యం దోసు పెరిగే కొలది మనిషి ప్రవర్తనలో మార్పులు మొదలవుతాయి. రక్తంలో ఆల్కహాల్ స్థాయి పెరుగుతున్న కొలదీ పాటలు పాడడం, జోకులు విసరడం, ఇతర ఉత్తేజిత లక్షణాలు కన్పిస్తాయి. జీవక్రియ రేటు పెరుగుతూ, తగ్గుతూ ఉంటుంది. మెదడు సంకేతాలు తికమకగా ఉంటాయి. మనిషి దిగజారడం మొదలవుతుంది.

మాటలు తొట్రుపాటుగా ఉంటాయి. కదలికలు అస్తవ్యస్తంగా తయారవుతాయి. రక్తంలో మద్యం వంద మిల్లీలీటర్లకు 25 గ్రాముల స్థాయి ఉన్నంతవరకు ఫరవాలేదు. ఆ సమయంలో రక్తంలో కొన్ని రసాయన మార్పులు జరుగుతాయి. మెదడులో ఆలోచన, జ్ఞాపకశక్తి ఆనందం కోరుకునే భాగాలు వల్కాలం, హిప్పో కాంపస్, న్యూక్లియస్ ఎక్కంబెన్స్ వరుసగా ప్రభావితం అవుతాయి.

ఈ సమయంలో ఇన్‌హిబిషన్స్ తగ్గిపోతాయి. అందుకే అసభ్యంగా

మాట్లాడడం, అసహ్యకరమైన జోకులు విసరడం కన్పిస్తుంది. తక్కువ డోసులో మద్యం తీసుకున్నప్పుడు మనిషికి హాయిగా వున్నట్లనిపిస్తుంది.

డోసు పెరిగే కొలది రక్తంలో ఆల్కహాలు స్థాయి వంద మిల్లీలీటర్లకు 50 మిల్లీగ్రాముల నుండి 80 మిల్లీగ్రాములకు పెరుగుతుంది. అప్పుడు మనిషి ముఖం ఎర్రబడుతుంది. రక్తం ఎక్కువగా మెదడు ముందు భాగానికి, ప్రీఫ్రాంటల్ కార్టెక్సుకి, కుడి టెంపోరల్ కార్టెక్స్‌కి ప్రవహిస్తుంది.

డోసు మరీ ఎక్కువయితే మెదడులోని రిసెప్టార్సు ప్రతిచర్యలు ఆగిపోతాయి. మనిషి తాగుతూ పేలుతూ ఉంటాడు. నాడీకణాలు పనిచేయడం మందగిస్తుంది. ఈ నాడీవ్యవస్థ మీద ఆల్కహాలు నిద్రమాత్రల మాదిరి ప్రభావం చూపుతాయి.

మనిషి మనిషికి డోసు ఎక్కువయినపుడు ప్రవర్తనలో తేడాలకు కారణం వారి జన్యువ్యత్యాసాలు. ఈ కారణంగా వ్యక్తుల మధ్యతేడాలు ఉంటాయి. కొంతమంది దెబ్బలాటకు దిగితే మరికొందరు నిద్రలోకి జారుకుంటారు. ఆల్కహాల్ సేవించిన వారు ఆదమరచి నిద్రపోలేరు.

బాగా తాగిన వారిలో కొందరే ఇంటికి సురక్షితంగా చేరుకోగల్గుతారు. తాగిన సమయంలో జరిగిన సంగతులు వారికి గుర్తు ఉండవు.

### అపోహలు - వాస్తవాలు

1. ఆల్కహాలు సేవిస్తే మనిషిని ఉత్తేజపరుస్తుందని ఒక అపోహ
   - వాస్తవానికి ఆల్కహాలు మెదడులోని కొన్ని భాగాలను మొద్దుబర్చి దానికి శరీరాంగాలు కొన్నింటిపై అదుపులేకుండా చేస్తుంది.
2. జలుబు చేస్తే ఒక పెగ్ బ్రాంది మంచిదని జనంలో ఒక భ్రమ.
   - వైరస్ వల్ల జలుబు వస్తుంది. జలుబు వచ్చిన వ్యక్తికి బ్రాందీ ఇస్తే మగతగా ఒక మూలపడి ఉంటాడు. అప్పుడు ఈ వైరస్ ఇతరులకు సోకదు. ఇదీ అసలు సంగతి.
3. ఆల్కహాల్‌లో మంచి పోషక విలువలు ఉన్నాయని చాలామందిలో నమ్మిక.
   - నిజానికి ఆల్కహాల్‌లో ఏవిధమైన పోషకవిలువలు లేవు. ఒక గ్రాము ఆల్కహాలు దాదాపు ఏడు కిలో కేలరీల శక్తిని ఇస్తుంది. ఆల్కహాలుకు బాగా అలవాటుపడిన వారికి అనుదినం పనిచేసేందుకు అవసరమైన శక్తిలో సగం ఆల్కహాల్ నుండి లభిస్తుంది.
4. గుండె జబ్బులున్న వారికి ఆల్కహాల్ చాలా లాభదాయకమని అనుకుంటారు.
   - ఇది పూర్తిగా అపోహ. ఇది గుండెకు రక్తాన్ని సరఫరా అయ్యేటట్లు చెయ్యదు. ఆల్కహాల్ ఎక్కువగా తీసుకుంటే కార్డియో మయోపతి అనే గుండె కండరాల జబ్బు వస్తుంది. రక్తపోటు పెరిగి గుండెపోటు రావచ్చు.
5. ఆల్కహాల్ గర్భిణీస్త్రీలకు మంచిదని ప్రజల్లో ఒక నమ్మకం ఉంది.
   - గర్భిణీస్త్రీలు ఆల్కహాల్ సేవిస్తే వారికి వికృతరూపంలో పిల్లలు పుట్టే అవకాశం ఉంటుంది.

### ఆల్కహాల్ - అనర్థాలు

- అతిగా ఆల్కహాల్ తీసుకుంటే లివర్‌కు సిరిహాసిస్ వస్తుంది.
- ఆల్కహాల్ సేవించం వల్ల మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధులు, గుండెజబ్బులు, అల్సర్లు వస్తాయి.
- కారణం దొరకని తలనొప్పి, కడుపులో అశాంతిగా ఉండడం జరుగుతుంది.
- వివరించలేని విధంగా శరీరం వణకడం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు కన్పిస్తాయి.
- ఆకలి మందగించడం, నిద్రలేమి, చేతులు, కాళ్ల సూదులతో గుచ్చినట్లు బాధ కల్గుతుంది.
- ఆతృత, నిరాశ, అనవసర భయాందోళనలు వీరిలో కన్పిస్తాయి.
- వైవాహిక జీవితం దెబ్బ తింటుంది. స్నేహితులను దూరం చేసుకుంటారు.
- ఉద్యోగ విధులకు గైరుహాజరవ్వడం, ఉద్యోగాలు మారిపోవడం, పనిలో నాణ్యత కోల్పోవడం, ఏకాగ్రత తగ్గడం, జ్ఞాపకశక్తి క్షీణించడం, అసహ్యంగా, అనారోగ్యంతో ఉండడం సంభవిస్తుంది.
- తాగుడు వల్ల మగవారి కన్నా స్త్రీలకు తొందరగా లివరు దెబ్బతింటుంది.
- కడుపులో బిడ్డపడిన మూడు నెలల నుండి తల్లి తాగే ప్రతిచుక్క మద్యం ప్రభావం బిడ్డపై ఉండి ఎంతో చెడును కల్గిస్తుంది.
- ఆల్కహాల్‌కు బాగా అలవాటుపడిన వారికి చివరకు చూపు మందగిస్తుంది.
- ఆల్కహాల్ మనిషి ప్రతిభకు పెద్దమబ్బుగా తయారవుతుంది. సమాజంలో మనిషి గౌరవం కోల్పోతాడు. వ్యక్తిత్వం దెబ్బతింటుంది.
- మద్యం సేవించం స్టాటస్ సింబల్‌గా భావిస్తే అదొక వ్యసనంగా మారి మనిషిని పీల్చి పిప్పి చేసేస్తుంది.
- ఆల్కహాల్‌కు బానిసలు కాకుండా ఉండాలంటే ఎప్పుడూ దాని జోలికి వెళ్లకూడదు.

- సి.వి. సర్వేశ్వరశర్మ

# షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అత్యాచార నిరోధక చట్టం అమలును మెరుగు పర్చాలి

**భారతదేశంలో జరిగే నేరాలన్నింటినీ నిర్వచించి శిక్షించే చట్టం భారతీయ శిక్షాస్మృతి చట్టము (Indian Penal Code 1860) అందరికీ తెలిసిన విషయమే. భారతదేశం పరాయి దేశస్తుల పాలన క్రింద వున్నప్పుడు పరాయి దేశస్థుడైన లార్డు మెకాలే రూపొందించిన చట్టం ఇది.**

ఎక్కువగా ఆంగ్లేయుల పాలనాభవితకు, మాన ప్రాణ ఆస్తుల రక్షణకు సంబంధించి వారి అనుభవాల నుండి రూపొందించిన చట్టంగా కనిపిస్తుంది గాని, మన సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరమైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన ఆనవాళ్ళు ఎక్కడా కనిపించవు. సమాజంలోని నిమ్న వర్గాలపట్ల పెత్తందారీ కులాల వారు జరిపే అనేక సాంఘిక వివక్షతలకు , అత్యాచారాలకు, అన్యాయాలకు సంబంధించిన నిర్వచనాలుగాని, దానికి విధించ కలిగిన శిక్షలుగాని మనకు కనిపించవు.

డా॥బి.ఆర్. అంబేద్కర్‌గారి సారధ్యంలో రూపొందించబడిన రాజ్యాంగంలో శతాబ్దాలుగా అణచివేయబడిన, వివక్షకు గురిచేయబడిన అనేక సామాజిక వర్గాలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక హక్కులను గుర్తించి రక్షణ ఇవ్వబడింది. సమాజంలో సాంఘిక వివక్షకు, అంటరానితనానికి గురిచేసి వెలివేయబడిన అనేక సమూహాలను షెడ్యూల్డు కులాలుగాను మరియు షెడ్యూల్డ్ తెగలుగాను గుర్తించి ఇతర సామాజిక వర్గాలతో సమానంగా అభివృద్ధి క్రమంలోనికి తీసికొని రావడానికి అనేక హక్కులు కల్పించడం, వాటి అమలుకు చట్టాలను తీసుకొని రావడం అందరికీ తెలిసిన విషయమే. ఈ క్రమంలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డ్ తెగలకు సంబంధించి వారిపై జరిగే అన్ని రకాల అత్యాచారాలను నిరోధించడానికి, అత్యాచారాలు చేసిన వారిని శిక్షించడానికి రూపొందించబడిన చట్టం"షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచార నిరోధక చట్టం) 1989". భారతదేశ చరిత్రలో ఇదొక విప్లవాత్మక చట్టంగా మనం పరిగణించవచ్చు.

నేర నిర్వచనానికి సంబంధించి వాస్తవ పరిస్థితులను పరిగణనలోనికి తీసుకోవడమే గాక, అత్యాచారానికి గురైన బాధితులకు నష్టపరిహారం కల్పించడంలోను అత్యాచారంలో అతలాకుతలమైన బతుకులకు తిరిగి నిలదొక్కుకోవడానికి కావలసిన పునరావాస సహాయ సదుపాయాలు కల్పించడంలోను, అత్యాచారం జరిపిన పెత్తందారీ కులాల నిందితుల నుండి బాధితులకు తక్షణ రక్షణ చర్యలను చేపట్టడంలోనూ బాధితులకు న్యాయం చేకూర్చడంలో ఒక వినూత్న ఆలోచనావిధానం ఈ చట్టం. 1989 సెప్టెంబర్ 11వ తారీఖున పార్లమెంట్‌చే ఇది ఆమోదించబడింది.

ఈ చట్టం 1990 జనవరి 30వ తారీఖు నుండి అమలులో కొచ్చింది. ఈ చట్టం ఆమోదించబడిన నాటి నుండి ఈ ఇరవై ఏండ్ల ప్రస్థానంలో ఈ చట్టం అమలుకు, తగిన రూల్స్ రావడానికి ఆరేండ్లు పడితే, ఇది ఎవరికొరకైతే నిర్దేశించబడిందో వారు ఈ చట్టం గురించి ఇప్పుడిప్పుడే తెలుసుకొంటున్నారు. ఈ చట్టం ఇరవై ఏండ్ల ప్రస్థానంలో చట్టం ఉద్దేశించిన ఫలితాలు పొందడంలో బాధితులు ఎదుర్కొంటున్న అడ్డంకులు, చేదు అనుభవాలు అనేకం. ఈ చట్టం క్రింద నమోదైన కేసులలో న్యాయస్థానాల్లో నూటికి ఒక కేసులోనే శిక్షపడటం, మిగిలిన 99 కేసులలో నిందితులు ఏ శిక్షలేకుండా విడుదల కావడం, కోర్టుకు పోక మునుపే అనేకమైన కేసులను తప్పుడు కేసులుగా చూపించి కొట్టివేయడం, బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వెంటనే వారి ఫిర్యాదులను స్వీకరించి కేసు రిజిష్టరు చేయకుండా తీవ్ర జాప్యాన్ని చేయడం, అనేక కేసులలో బాధితులు సాక్షులు, నిందితులకు అనుకూలంగా లొంగిపోవడం, బాధితులపైన తప్పుడు కేసులు పెట్టి కౌంటర్ కేసులుగా ఉపయోగించి వారిని మానసిక వత్తిడికి గురిచేయడం, విచారణలో తీవ్రజాప్యం, చార్జీషీట్ వేయడంలో తీవ్రజాప్యం, ఉచిత న్యాయ సహాయం అందని దాక్షపండ్లుగా వుండడం మొదలైనవి కలవరపెట్టే విషయాలుగా వున్నాయి. దళితులపై ఈ చట్టం క్రింద నమోదయ్యే అత్యాచారాల కేసులు ప్రతి ఏటా పెరుగుతూ వుండడం దళితులలో ఈ చట్టం ద్వారా న్యాయాన్ని పొందాలనే పట్టుదల ఒక కారణం కావచ్చు

ఈ చట్టాన్ని ఉపయోగించి పనిచేసే వివిధ ప్రజాసంఘాలు దళిత న్యాయవాదులు, మానవ హక్కుల కార్యకర్తలు, సంస్థల అనుభవాలు చూస్తే చట్టంలోని అనేక నిబంధనలను బాధితులకు వ్యతిరేకంగా, నిరుత్సాహపరిచే విధంగానూ అమలు చేస్తున్నారని తెలుస్తూ ఉంది.

1. చట్టంలోని సెక్షన్ (4) - ఈ చట్టం నిర్దేశించిన ప్రకారం నిర్వహించవలసిన బాధ్యతను నిర్లక్ష్యం చేసిన షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందని అధికారి అయితే 6నెలలు నుండి 1వ

సం॥ వరకు శిక్షార్హుడవుతాడు. అయితే ఎక్కడైనా తీవ్రమైన అత్యాచారం జరిగినప్పుడు అక్కడున్న షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందని అధికారులను బదిలీ చేసి ఆ స్థానంలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన అధికారులను నియమించడం ద్వారా అధికారుల నిర్లక్ష్యతను కొనసాగిస్తూ సెక్షన్ 4 నుండి రక్షణ కల్పిస్తున్నారు.

2. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నిరోధక) నిబంధనలు 1995 ప్రకారం ఈ చట్టం క్రింద నమోదైన కేసులో నేరం జరిగిన 30 రోజులలో విచారణను పూర్తి చేసి నివేదికను పై అధికారులకు అందచేయాలి. వాస్తవానికి ఈ కేసుల పరిష్కారంలో జాప్యం జరుగుతుంది. కాని సాక్షి మానవ హక్కుల నిఘా తరపున వేసిన ప్రజా వ్యాజ్యంలో డిజిపి ఆంధ్రప్రదేశ్ వారు 2007 నాటికి 14452 కేసులలో 30 రోజుల కంటే మించి జాప్యం జరిగిన కేసులు వున్నాయని తెలిపినారు. సగటు ప్రతిజిల్లాలో 70% కేసులు 30 రోజుల్లో విచారణకు నోచుకోకుండా పెండింగులో వుంటున్నాయి.

ఈ చట్టం ప్రకారం అత్యాచారం జరిగినప్పుడు డియస్‌పి స్థాయి కంటే తక్కువకాని అధికారితో 30 రోజులలో విచారణ జరిపి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలి. అయితే జిల్లాల వారీగా పరిస్థితి ఎలా వుందో ఈ క్రింది పట్టికలో గమనించవచ్చు

| క్రమ సంఖ్య | జిల్లా | 30 రోజులలో విచారణ పూర్తి చేయని కేసుల వివరాలు శాతంలో |
|---|---|---|
| 1 | ఆదిలాబాద్ | 74% |
| 2 | అనంతపూర్ | 73% |
| 3 | చిత్తూరు | 57% |
| 4 | కడప | 73% |
| 5 | తూర్పుగోదావరి | 72% |
| 6 | గుంటూరు | 74% |
| 7 | హైదరాబాద్ | 96% |
| 8 | కరీంనగర్ | 66% |
| 9 | ఖమ్మం | 64% |
| 10 | కృష్ణా | 24% |
| 11 | కర్నూలు | 73% |
| 12 | మహబూబ్‌నగర్ | 79% |
| 13 | మెదక్ | 77% |
| 14 | నల్గొండ | 57% |
| 15 | నెల్లూరు | 60% |
| 16 | నిజామాబాద్ | 84% |
| 17 | ప్రకాశం | 85% |
| 18 | రంగారెడ్డి | 93% |
| 19 | శ్రీకాకుళం | 29% |
| 20 | విశాఖపట్నం | 77% |
| 21 | విజయనగరం | 68% |
| 22 | వరంగల్ | 68% |
| 23 | పశ్చిమ గోదావరి | 63% |

అలాగే ఈ క్రింది కారణాల వలన కేసుల విచారణ ఆలస్యమవుతుందని అధికారులు తమ నివేదికలో తెలిపారు.

- అధికారుల ఆమోదం, న్యాయాభిప్రాయలు, పై అధికారుల ఉత్తర్వులు పొందడంలో ఆలస్యమైనందు వలన.
- సాక్ష్యాధారాలు సేకరించటంలో ఆలస్యం
- కుల ధృవీకరణ పత్రం పొందుటలో
- ఎక్కువ సాక్షులు ఉన్నందువలన,
- మెడికల్ సర్టిఫికెట్, గాయాలకు సంబంధించిన సర్టిఫికెట్, పోస్టుమార్టమ్ రిపోర్టు పొందటంలో ఆలస్యం
- నిందితులు పరారీలో ఉన్నందున
- సాక్షులను కనిపెట్టి, పరీక్షించడంలో
- అధికారులకున్న పని ఒత్తిడి, సమయాభావం వలన
- ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టు, డియన్ఎ రిపోర్టు మరణ ధృవీకరణ పత్రం పొందటంలో
- విచారణ జరుగుతూ ఉందని లేదా కారణాలు తెలుపక పోవడం.
- 164 మరియు 161 వాంగ్మూలాల సేకరణలో ఆలస్యం
- అధికారుల బదిలీ వలన
- హైకోర్టు మరియు కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చినందువలన
- సిడి ఫైలు అందుబాటులో లేనందువలన
- సిఐడి మరియు సిబిసిఐడి వారు కేసు విచారించినందువలన
- ఎస్సీ, ఎస్టీ చట్టంలోని సెక్షన్లను తొలగించి తప్పుడు కేసుగా ధృవీకరించినందువలన
- కేసు రాజీ చేసినందువలన
- రికార్డు లేనందువలన
- పునర్విచారణ జరపడం వలన
- నిందితుడు మృతి చెందినందు వలన
- సాక్షులు లేనందువలన
- ఫిర్యాదు ఆలస్యంగా ఇచ్చినందువలన
- ఆస్తుల జప్తు చేయడం వలన

మొదలైన కారణాలను అధికారులు చూపించారు.

**అలాగే కోర్టులలో ఉన్న ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల కేసుల వివరాలు జిల్లాల వారీగా పరిశీలిస్తే**

| క్ర. సం. | జిల్లాపేరు | మొత్తం కేసుల సంఖ్య (గడిచిన సం॥ చివరికి పెండింగ్‌లో ఉన్న కేసులతో సహా) | శిక్షలు వేసిన కేసుల సంఖ్య | నిర్దోషులుగా విడుదల చేసి కొట్టివేసిన కేసుల సంఖ్య | కొట్టేసిన కేసులలో అప్పీలు చేసిన కేసుల సంఖ్య | 31.08.08 నాటికి పెండింగ్ లో ఉన్న కేసుల కేసుల సంఖ్య | పెండింగ్ కేసుల శాతం |
|---|---|---|---|---|---|---|---|
| 1 | శ్రీకాకుళం | 61 | 3 | 26 | 0 | 32 | 52% |
| 2 | విజయనగరం | 36 | 2 | 7 | 0 | 27 | 75% |
| 3 | విశాఖపట్నం | 55 | 0 | 23 | 0 | 32 | 58% |
| 4 | తూర్పుగోదావరి | 132 | 7 | 70 | 0 | 54 | 41% |
| 5 | పశ్చిమగోదావరి | 221 | 6 | 70 | 0 | 143 | 65% |
| 6 | కృష్ణా | 37 | 2 | 16 | 0 | 18 | 49% |
| 7 | గుంటూరు | 187 | 8 | 99 | 0 | 80 | 43% |
| 8 | ప్రకాశం | 92 | 6 | 39 | 0 | 46 | 50% |
| 9 | నెల్లూరు | 301 | 3 | 41 | 0 | 251 | 83% |
| 10 | చిత్తూరు | 83 | 8 | 3 | 0 | 72 | 87% |
| 11 | కడప | 128 | 3 | 57 | 0 | 67 | 52% |
| 12 | అనంతపూర్ | 384 | 22 | 268 | 0 | 92 | 24% |
| 13 | కర్నూలు | 303 | 18 | 95 | 0 | 187 | 64% |
| 14 | మహబూబ్‌నగర్ | 284 | 4 | 90 | 2 | 183 | 64% |
| 15 | రంగారెడ్డి | 223 | 0 | 11 | 0 | 211 | 95% |
| 16 | హైదరాబాద్ | 38 | 5 | 17 | 0 | 15 | 39% |
| 17 | మెదక్ | 80 | 5 | 25 | 0 | 50 | 63% |
| 18 | నిజామాబాద్ | 100 | 1 | 53 | 2 | 40 | 40% |
| 19 | ఆదిలాబాద్ | 86 | 10 | 38 | 0 | 38 | 44% |
| 20 | కరీంనగర్ | 136 | 3 | 64 | 4 | 68 | 50% |
| 21 | వరంగల్ | 254 | 1 | 67 | 0 | 180 | 71% |
| 22 | ఖమ్మం | 228 | 5 | 67 | 0 | 155 | 68% |
| 23 | నల్గొండ | 212 | 6 | 105 | 0 | 99 | 47% |
| | మొత్తం | 3661 | 128 | 1351 | 8 | 2140 | 58% |
| | % శాతం | | 8.6% | 91% | 0.5% | 58.5% | |

**పై పట్టికలో కోర్టులలో కేసులు ఎటువంటి కదలిక లేకుండా పెండింగ్‌లో ఉన్న కేసులు అత్యధికంగా ఉన్నట్లు మనం చూస్తున్నాము.**

చట్ట ప్రకారం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసినప్పటికీ, పరిస్థితి యధాతథంగానే ఉంది. అలాగే నిందితులను కూడా నిర్దోషులుగా విడుదల చేసిన కేసుల సంఖ్య మనకు ఎక్కువగా కనిపిస్తుంది. ఇక కొట్టేసిన కేసులు చెత్తకుండీలో వేసినట్లుగా వాటిపై అప్పీలు చేయకపోవడం, శిక్షలుపడిన కేసులు వేళ్ళమీద లెక్కించే విధంగా తక్కువ సంఖ్యలో ఉండడం గమనిస్తే, దళిత, గిరిజనులకు న్యాయం ఏ మేరకు అందుతున్నదో మనకు స్పష్టమవుతున్నది.

చట్టం సక్రమంగా అమలు కావడానికి, బాధితులకు సత్వర న్యాయం అందడానికి, నోడల్ ఆఫీసర్లు, స్పెషల్ ఆఫీసర్లు, స్పెషల్ కోర్టులు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకూ విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీల నియామకాలు, ఈ కమిటీలు ప్రతి 3 నెలల్లో కనీసం ఒక సమీక్షా సమావేశం నిర్వహించడాలు, ఇలా అనేక అవకాశాలను, సదుపాయాలను ఈ చట్టంలోను, నిబంధనలలోను పొందుపరచారు. మరి ఇన్ని నిర్మాణాలు, నియామాకాలు ఏమైనట్లు? 20 ఏండ్లుగా ఈ చట్టం సక్రమ అమలుకు చిత్తశుద్ధిగా చేసిన ప్రయత్నమెంత? ఈ చట్టం అమలుకు కేటాయించిన నిధులెంత? ఖర్చయిన నిధులెన్ని? 100కి 99 కేసులు వీగిపోవడానికి కారణం ఎవరు? రక్షణ కోసం, న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వెళ్ళిన బాధితులపైనే తప్పుడు కేసు బనాయించి వారిని మరింత నిస్పృహకు గురిచేయడానికి బాధ్యులెవరు? నిందితులపై వెంటనే చర్యలు తీసుకోకుండా, విచారణ ముగించకుండా జాప్యం చేయడం వలన బాధితులపై ఒత్తిడిపెంచి కేసును వెనక్కు తీసికొనేటట్లు చేయడం లేక రాజీపడేటట్లు చేయడానికి కావలసినంత అవకాశాన్ని నిందితులకు కల్పిస్తున్న ఈ పరిస్థితిని సమీక్షించేదెవరు? చక్కదిద్దే దెవరు?

కులసామాజిక చట్రంలో నిరంతరంగా నలిగిపోతున్న షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలకు ఒక మహత్తర అవకాశంగా అందివచ్చిన ఈ చట్టాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుంది. దీన్ని బలోపేతంగా మలచుకోవడానికి చట్టం తీసుకొనిరావాలి. ఇందుకు దేశవ్యాప్తంగా ప్రయత్నాలు జరుగుతుండటం అభినందించతగ్గ విషయం. జరుగుతున్న పరిమాణాలను, మారుతున్న పరిస్థితులను సభ్యసమాజం కూడా సమీక్షించుకొంటుందనీ, చట్టం సక్రమ అమలుకు దోహదపడుతుందని, తన సభ్యతను పెంచుకొంటుందని ఆశిద్దాం...

**- వి. నందగోపాల్**

# స్వచ్ఛతా ఉత్సవ్

## అక్టోబర్ 2 నుండి నవంబర్ 19, 2011 వరకు

**సరిగ్గా 12 సంవత్సరాలకు ముందు అంటే 1999 వ సంవత్సరంలో భారత దేశంలో సంపూర్ణ పారిశుధ్య ఉద్యమం ప్రారంభమైనది.**

### ముఖ్య ఉద్దేశ్యం

మానవ విసర్జితాల సమర్థ నిర్వహణ, పాఠశాల పారిశుద్ధ్యం, అంగన్‌వాడీ పారిశుద్ధ్యం, వ్యక్తిగత పారిశుద్ధ్యం, ఘన ద్రవ వ్యర్థాల సమర్థ నిర్వహణ సాధించడం. ఇందుకు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ప్రజల పారిశుధ్యపు ప్రవర్తనా సరళిలో మార్పు తీసుకు రావడానికి గానూ ఐ.ఇ.సి కార్యక్రమాలు అనగా పారిశుధ్యపు సమాచారం, అందుకు అవసరమగు విద్య, ఆవశ్యకతపై ప్రచారం నిర్వహించాల్సి ఉంది.

ప్రతి రాష్ట్రంలో పారిశుధ్యపు స్థితి గతులను అంచనా వేసుకుని, తదనుగుణంగా ఐ.ఇ.సి కార్యక్రమాలు అనగా పారిశుధ్యపు సమాచారం, అందుకు అవసరమగు విద్య, ఆవశ్యకతపై ప్రచారం నిర్వహించాల్సి ఉంది. ఈ క్రమంలో సంపూర్ణ పారిశుధ్య సాధనలో కొన్ని రాష్ట్రాలు ముందుండగా, మరికొన్ని రాష్ట్రాలు చాలా వెనుకబడి ఉన్నాయి. జమ్ముకాశ్మీర్, బీహార్, మణిపూర్, జార్ఖండ్ వంటి రాష్ట్రాలు పారిశుధ్య సాధనలో వెనుకబడి ఉండగా, హిమాచల్‌ప్రదేశ్, సిక్కిం, కేరళ, గుజరాత్ వంటి రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాల విషయానికొస్తే, ముఖ్యంగా మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొంతమేరకు మెరుగైన స్థితిలో ఉన్నదని చెప్పవచ్చు.

భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా సంపూర్ణ పారిశుధ్యాన్ని సాధించాలనే లక్ష్యంతో, ఐ.ఇ.సి. కార్యరకమాలను గ్రామస్థాయికి విస్తరింపచేయాలనే సంకల్పంతో ఈ సంవత్సరంలో (2011) అక్టోబర్ 2 నుండి సెప్టెంబర్ 2వ తేదీ వరకూ అంటే 30 రోజుల పాటు స్వచ్ఛతా ఉత్సవాలు నిర్వహించవలసినదిగా కోరుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీచేసింది.

మరుగుదొడ్ల నిర్మాణం, వాడుక విషయంలో వివిధ రాష్ట్రాల విజయ పరంపర ఈ విధంగా ఉన్నది

| రాష్ట్రం పేరు | దారిద్ర్య రేఖకు | | సగటు | పాఠశాల | అంగన్‌వాడీ |
|---|---|---|---|---|---|
| | దిగువన కుటుంబాలు | ఎగువన కుటుంబాలు | కుటుంబాలు | మరుగుదొడ్లు | మరుగుదొడ్లు |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| సిక్కిం | 100% | 100% | 100% | 100% | 100% |
| కేరళ | 100% | 100% | 100% | 100% | 100% |
| హిమాచల్‌ప్రదేశ్ | 100% | 100% | 100% | 100% | 100% |
| గుజరాత్ | 93.87% | 68.85% | 78.35% | 96.80% | 100% |
| ఆంధ్రప్రదేశ్ | 75.55% | 71.02% | 73.95% | 90.47% | 45.95% |

### ఆంధ్రప్రదేశ్ "స్వచ్ఛతా ఉత్సవ్"

మన రాష్ట్రంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య మంత్రిత్వ శాఖలు సమిష్టిగా స్వచ్ఛతా ఉత్సవ్‌ల నిర్వహణకు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశాయి. పారిశుధ్యపు వారోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తూ నాలుగు ప్రత్యేక దశలలో ఉత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం తలపెట్టింది. అందులో భాగంగా మన రాష్ట్రంలో అక్టోబర్ 2 నుండి నవంబర్ 19తేదీ వరకూ స్వచ్ఛతా ఉత్సవ్‌ను నిర్వహించాలని నిర్ణయించింది.

## ముఖ్య ఉద్దేశ్యాలు

- శిశుమరణాలు, 5 సంవత్సరాలలోపు పిల్లల మరణాల రేటును తగ్గించడం.
- నీటి వలన సంక్రమించే వ్యాధుల నిర్మూలన
- బడిమానివేసే వారి శాతాన్ని తగ్గించడం.
- బహిరంగ మల విసర్జనను మానివేసి, మరుగుదొడ్లు వాడేలా చేయడం
- చేతులు శుభ్రపరచుకోవలసిన అవసరాన్ని గుర్తించేలా చేయగలడం. ఈ ఉద్దేశ్యాలతో స్వచ్ఛతా ఉత్సవ్‌ను నిర్వహించడం జరుగుతున్నది.

## ఏ రోజు ఏమిటి?

| | | |
|---|---|---|
| అక్టోబర్ 2 | • గాంధీజయంతి ప్రారంభం | • స్వచ్ఛతాఉత్సవ్ |
| అక్టోబర్ 15 | • గ్లోబల్ హాండ్ వాష్‌డే | • పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాలలో కార్యక్రమాలు |
| నవంబరు 14 | • బాలల దినోత్సవం/ నెహ్రూ జయంతి | • పారిశుద్ధ్య అవశ్యకతపై పలు కార్యక్రమాలు |
| నవంబరు 19 | • ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం | • పారిశుద్ధ్య ప్రగతి విశ్లేషణ, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పన |

## స్వచ్ఛతా ఉత్సవ్ ప్రారంభోత్సవం

అక్టోబర్ 2వ తేదీన లాంఛనంగా ప్రతి జిల్లా ప్రధాన కేంద్రం స్వచ్ఛతా ఉత్సవ్‌ను ప్రారంభించారు. ఇప్పటికే అక్టోబరు 2న, అక్టోబరు 15న 2 ఉత్సవాలు జరుపుకున్నాం. అందులో భాగంగా :-

- అధికారులు, అనధికారులతో సమావేశాలు నిర్వహించడం.
- ర్యాలీల నిర్వహణ
- పని - ప్రణాళిక తయారీ
- ప్రచార ప్రణాళికను సిద్ధం చేయడం
- జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటు వంటివి జరగుతాయి.

## నవంబర్ 14 - కార్యక్రమాలు

- పాఠశాలలలో పారిశుద్ధ్యంపై పలు కార్యక్రమాల నిర్వహణ.
- గ్రామాలలో ప్రచార కార్యక్రమాలు.
- సమావేశాలు, చర్చల నిర్వహణ మొదలగునవి.

## నవంబరు 19 - కార్యక్రమాలు

- స్వచ్ఛతా ఉత్సవ్ చివరి వారంలో భాగంగా ఐ.ఇ.సి. విధానం రూపకల్పన.
- ఐ.ఇ.సి. అమలుకు దీర్ఘకాలిక ప్రణాళిక రూపకల్పన
- మరుగుదొడ్ల వాడకం దిశగా కార్యక్రమాల నిర్వహణ.

## ఆంధ్రప్రదేశ్‌లో మరుగుదొడ్ల వాడకం తీరుతెన్నులు

**మరుగుదొడ్డి సౌకర్యాల పరంగా గ్రామాల స్థితిగతులు**

| శాతం పరంగా గ్రామాలు | మరుగుదొడ్డి సౌకర్యం (శాతంలో) |
|---|---|
| 0-25% | 52.86% |
| 25-50% | 12.37% |
| 50-75% | 5.93% |
| 75-100% | 4.05% |
| 100% | 24.79% |

నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్ 2008-09 నివేదిక ప్రకారం కేవలం 35.70% కుటుంబాలు మరుగుదొడ్లను వాడుతున్నట్లు వెల్లడైనది. అదే సంవత్సరం సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమం లెక్కల ప్రకారం 63.94% వాడుతున్నట్లు గణాంకాలు చెప్తున్నాయి. 2010 సంవత్సరంలో యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు ప్రకారం 53.90% కాగా, నేషనల్ లిటరసీ మిషన్ లెక్కల ప్రకారం కేవలం 30% మాత్రమే ఉపయోగిస్తున్నట్లు తెలుస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం గ్రామపంచాయితీలు 21,878 కాగా, నేటి వరకూ 1132 గ్రామాలు నిర్మల గ్రామ పురస్కారాన్ని అందుకున్నాయి. అయితే 5423 గ్రామాలు నూరుశాతం మరుగుదొడ్ల సౌకర్యాలను కలిగి ఉన్నాయి. కేవలం 1132 గ్రామాలకే నిర్మల పురస్కారం లభించింది. అంటే వాడుకలో నూరుశాతం సాధించలేక పోతున్నాం అన్నమాట. "స్వచ్ఛతా ఉత్సవ్" పారిశుద్ధ్య పరంగా ప్రజల ప్రవర్తనా సరళిలో మార్పు తీసుకు రాగలదని, బహిరంగ మల విసర్జన స్థానే మరుగుదొడ్ల వాడకం చేపట్టి సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించగలమని ఆశిద్దాం.

**- పి.మాధురి**

# పంచాయితీల పరిపుష్టికి 13వ ఆర్థిక సంఘం నిధులు

**కేంద్ర ఆర్థిక సంఘం గ్రాంటులు పదవ ఆర్థిక సంఘం కాలం నుండే స్థానిక సంస్థలకి కూడా మంజూరు చేసే విధానం ప్రారంభమైనది. 13వ ఆర్థిక సంఘం కాల పరిమితి 1-4-2010 నుండి 31-3-2015 వరకు ఐదేళ్ళ కాలమునకు విస్తరించినది.**

13వ ఆర్థిక సంఘం నిధులతో స్థానిక సంస్థలు ఈ క్రింది అంశాలకి సంబంధిచిన సేవలు అందించాలి.

1. ప్రాథమిక విద్య
2. ఆరోగ్యం
3. పారిశుద్ధ్యం
4. త్రాగునీరు
5. వీధిలైట్లు

**13వ ఆర్థిక సంఘం గ్రాంటు రెండు రకాలుగా వర్గీకరించబడింది**

1. సాధారణ మౌలిక గ్రాంటు
2. పనితీరు ఆధారంగా ఇచ్చే గ్రాంటు

2010-11 సంవత్సరంలో రాష్ట్రానికి రూ.7,195 కోట్లు మౌలిక సదుపాయముల కల్పన కొరకు కేటాయించబడినవి. ఇందులో రూ.5,226 కోట్లు పంచాయితీ రాజ్ సంస్థలకు, రూ.1919 కోట్లు మున్సిపాలిటీలకు, ప్రత్యేక గ్రాంటుగా రూ.50 కోట్లు వస్తాయి. 2011-12 సం॥లో మౌలిక సదుపాయముల గ్రాంటుతో పాటు పనితీరు ఆధారంగా ఇచ్చే గ్రాంటు కూడా కేటాయించబడుతుంది.

13వ ఆర్థిక సంఘం నిధులలో అత్యధిక భాగం మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ కొరకు వినియోగించవలసి ఉంటుంది.

### 13వ ఆర్థిక సంఘం నిధులతో మంచినీటి సరఫరా కొరకు నియమనిబంధనలు

1. రక్షిత మంచినీటి సరఫరా పథకాల నిర్వహణ, మరమ్మత్తులు కొరకు ఈ నిధులు వినియోగించవచ్చు.
2. 13వ ఆర్థిక సంఘం నిధులలో త్రాగునీటి సరఫరా కొరకు కేటాయించిన నిధులను ఖచ్చితంగా త్రాగునీటి సరఫరా కొరకే వినియోగించవలెను.

### 13వ ఆర్థిక సంఘం నిధులతో పారిశుద్ధ్య నిర్వహణకై నియమనిబంధనలు

1. గ్రామ పంచాయితీలలో కనీసం నెలకు ఒకసారైనా ప్రత్యేకంగా పారిశుద్ధ్యమును నిర్వహించాలి.
2. చెత్తా చెదారాల తొలగింపు, డ్రైనేజీలలో పూడిక తొలగింపు మరియు వీధులను శుభ్రపర్చటం కూడా ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణలో భాగమే.
3. గ్రామంలో సేకరించినటువంటి చెత్తాచెదారాలను గుర్తించబడిన, నిర్ణీత ప్రదేశమునకు మాత్రమే తరలించవలెను. చెత్త తరలింపునకై, ఆవాసాలకు దూరంగా వున్నటువంటి సరియైన పోరంబోకు స్థలాన్ని గుర్తించాలి.
4. ప్రతి సంవత్సరం విడుదల కాబడిన నిధులలో బ్లీచింగు మరియు క్రిమిసంహారక చర్యల కొరకు వినియోగించు పదార్థాలకై చేయు ఖర్చు 5% మించరాదు.
5. 13వ ఆర్థిక సంఘం నిధుల నుండి సిబ్బంది జీతభత్యాలను చెల్లించరాదు. కానీ ప్రత్యేకంగా పారిశుద్ధ్యం నిర్వహిచే సమయంలో వినియోగించే కూలీలకు దినసరి వేతనాలను ఈ నిధుల నుండి చెల్లించవచ్చును.
6. మేజరు గ్రామపంచాయితీలు తప్పనిసరిగా ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ పద్ధతులను అనుసరించాలి.
7. చెత్త తరలింపునకై మూడు చక్రాల రిక్షాలను ఈ నిధులతో సమకూర్చుకొనవచ్చును.
8. అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పారిశుద్ధ్యాన్ని నిర్వహించాలి.
9. చేతిపంపులు, బోర్‌వెల్స్ చుట్టూ ప్లాట్‌ఫారంలు నిర్మించుటకు కూడా ఈ నిధులను వినియోగించవచ్చును.

సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమం క్రింద పారిశుద్ధ్య కమిటీ పై తెల్పిన పనులన్నింటినీ పర్యవేక్షిస్తుంది. విస్తరణాధికారి (పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి) వారు ఒక నెల ముందుగా కార్యక్రమ ప్రణాళిక తయారుచేసి, తదనుగుణంగా పంచాయితీలకు సూచనలిస్తూ పర్యవేక్షించాలి. ఈ కార్యక్రమం అమలుపరచవలసిన బాధ్యత పూర్తిగా పంచాయితీ కార్యదర్శిదే.

స్థానిక సంస్థలలో లెక్కల నిర్వహణ, ఆడిట్‌కి సంబంధించి 13వ ఆర్థిక సంఘం స్పష్టమైన సూచనలు చేసింది. అవి

1. అన్ని స్థాయిల్లోని స్థానిక సంస్థలకి క్రమంతప్పకుండా ఆడిట్ జరగాలి.
2. కంట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సి.& ఎ.జి.) వారికి అన్ని స్థానిక సంస్థలకి సంబంధించిన గణాంక ఆడిట్ వ్యవహారాలపై పర్యవేక్షణ అధికారం ఉండాలి.
3. కంట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సి.& ఎ.జి.) మరియు రాష్ట్ర ఆడిట్ విభాగానికి సంబంధించిన సాంవత్సరిక నివేదికలు సంబంధిత శాసన సభకి సమర్పించాలి.
4. స్థానిక సంస్థల ఆడిట్‌ను నిర్వహించే రాష్ట్ర ఆడిట్ శాఖను మెరుగుపరచి తగు రీతిలో సిబ్బంది సామర్థ్యాలను పెంచాలి.

### రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు (యస్.యఫ్.సి.)

ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయుచున్నటువంటి రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను ఈ దిగువ పనుల నిమిత్తం వినియోగించాలి.

అ) గ్రామ పంచాయితీ భవన నిర్మాణముల కొరకు.

ఆ) అంతర్గత రహదారుల కొరకు.

ఇ) త్రాగునీటి సరఫరా స్కీములు నిర్మాణము కొరకు.

ఈ) డ్రైనేజీలు మరియు శానిటరీ లెట్రిన్స్‌ను నిర్మించుట మొదలైన క్యాపిటల్ పనులు.

అ) రక్షిత మంచినీటి సరఫరా పథకాల రిపేర్లు మరియు విద్యుత్ చార్జీలు.

ఆ) వీధి విద్యుత్ దీపముల చార్జీలు.

ఇ) డ్రెయిన్లు శుభ్రపరచుట మరియు పారిశుధ్య పనులు చేపట్టుట వంటి నిర్వహణకు సంబంధించిన పనులు. ■

## బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009

**బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009 ఏప్రిల్ 1, 2010 నుంచి అమలులలోనికి వచ్చింది.**

**ముఖ్యాంశాలు :**

1. 6 సం॥ల నుంచి 14సం॥ల వయస్సులో ఉన్న పిల్లలందరికీ ఉచితంగా విద్యను (8వ తరగతి పూర్తి) తప్పనిసరిగా అందించాలి.
2. బడి బయట పిల్లలందరినీ వయస్సుకు తగిన తరగతిలో బడిలో చేర్పించి, ప్రత్యేక శిక్షణ ద్వారా విద్యనందిస్తూ బడిలో కొనసాగేటట్లు చూడాలి.
3. 3 సం॥ల నుంచి 5 సం॥ల వరకు వయస్సున్న పిల్లలను అంగన్ వాడీ కేంద్రంలో చేర్పించి విద్యను అందించాలి.
4. విద్యార్థులను అదే తరగతిలో ఒకటి కంటే ఎక్కువ సం॥రాలు కొనసాగించటం, బడి నుంచి తీసివేయడం నిషేధం.
5. ప్రవేశ రుసుము, ప్రవేశ పరీక్ష నిషేధం.
6. బాల బాలికలను శారీరకంగా, మానసికంగా శిక్షించడం చట్టరీత్యా నేరం.

### స్థానిక సంస్థల పాత్ర

1. గ్రామ పంచాయితీ పరిధిలోని 0-14 సం॥ల వయస్సు గల పిల్లలందరి రికార్డును నిర్వహించాలి.
2. పాఠశాల యాజమాన్య కమిటీ (School Management Committee-SMC) (సర్పంచ్) ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేయాలి. ఈ యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి.
3. పాఠశాల భవనం, బోధనా సిబ్బంది, బోధనా పరికరాలతో సహా అన్ని మౌలిక సదుపాయాల కల్పనలో సహకరించాలి.
4. క్రమం తప్పకుండా ప్రతినెల యాజమాన్య కమిటీ సమావేశాలను నిర్వహించి కార్యాచరణ రూపొందించాలి.

ఈ చట్టం రాజీవ్ విద్యా మిషన్ ఆధ్వర్యంలో అమలు చేయ బడుతుంది. ■

## నవంబరు 15లో గ్రామపంచాయతీ బడ్జెట్ రూపొందించాలి

ప్రతి గ్రామ పంచాయతీ తన సాంవత్సరిక బడ్జెట్టును క్రింది విధంగా రూపొందించుకోవాలి. (సెక్షన్ 77).

- ప్రతి సంవత్సరమున నవంబర్ 15న గానీ అంతకు ముందుగానీ పంచాయితీ కార్యదర్శి, రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను తయారు చేసి, ప్రత్యేకాధికారి ఆమోదంతో గ్రామసభకు నివేదించాలి.
- ఆమోదం పొందిన బడ్జెట్‌ను కార్యదర్శి డిశంబర్ 25లోగా డివిజనల్ పంచాయితీ అధికారికి, విస్తరణాధికారి(పం.రా & గ్రా.అ) వారి ద్వారా పంపాలి.
- అవసరమని భావించిన సలహాలతో డివిజనల్ పంచాయితీ అధికారి నెల రోజుల్లోగా గ్రామ పంచాయితీకి త్రిప్పి పంపాలి.
- నెలరోజుల్లోగా సదరు సూచనలను, మార్పులను పరిశీలించి, అట్టి మార్పులతో కానీ, ఎట్టి మార్పులు లేకుండాకానీ ప్రత్యేకాధికారి ఆమోదం పొందాలి.
- సంవత్సరము మధ్యలో బడ్జెట్‌లో చూపిన పద్దులను మార్చాల్సిన అవసరం వస్తే సప్లిమెంటరీ బడ్జెట్‌ను తయారు చేసి పై క్రమాన్ని పాటించి మంజూరు చేసి ఆమోదించాలి.
- బడ్జెట్‌లో చూపిన వర్కింగ్ బ్యాలెన్సు ఆ సంవత్సరానికి చూపిన ఆదాయములో 5%నకు తక్కువ కాకుండా చూసుకోవాలి
- బడ్జెట్‌లో లేని ఖర్చులను గ్రామ పంచాయితీ ఆమోదించరాదు.
- బడ్జెట్‌లో చూపిన మొత్తాలను ఖర్చు చేయుటకు అవసరమైన అన్ని సందర్భాలలో పై అధికారుల అనుమతి పొందాలి.
- మంజూరు చేయబడిన బడ్జెట్ నకళ్లను ఆడిట్ అధికారికి పంపాలి.
- బడ్జెట్‌లో చూపే ఖర్చుల మొత్తాలు నియమాలలో నిబంధించిన పరిమితికి మించరాదు.
- బడ్జెట్ కేటాయింపులు జి.ఓ.యం.ఎస్.నెం.69, తేదీ:09.02.2000 ప్రకారం ఖచ్చితంగా చేయాలి.

పౌర సదుపాయాల కల్పనలో గ్రామ పంచాయితీ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు నివసించే ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తూ తగు కేటాయింపులు చేసి బడ్జెట్ రూపొందించుకొని కార్యక్రమాలు అమలుచేయాలి. ■


*'ఇద్దరు తెల్గువాండ్రు తమ యింటివి కష్టసుఖాలు చెప్పుకో*
*న్నద్దిర మాతృభాష తగదా మరి యింకొక పెద్ద రోగమే*
*కద్దు వచింతు రాంగ్లము మొగంబు నెరుంగని రతోతముందు దు*
*ర్బుద్ధులు కూయుచుండ్రు పలు పోకల నెంగిలిపీసు కూతలన్'*

**ఇద్దరు తెలుగు వాళ్ళు కలిస్తే ఆంగ్లంలో మాటాడే దౌర్భాగ్యం ఈ నాటిది కాదనడానికి పై తుమ్మలవారి పద్యం నిదర్శనం. తెలుగువారి మాటల్లో, రాతల్లో, చదువుల్లో అసలు తెలుగే లేదు. ఇంక తేటతెలుగు మాటేమిటి? అచ్చమైన తెలుగును స్పష్టంగా వీనులవిందుగా పలికే వారేరీ? భాష సమాజపు ఉమ్మడి సొత్తు. అది నిలబడాలంటే వేలకొద్దీ పుస్తకాలు రాస్తే చాలదు. మాట్లాడితేనే భాష బతుకుతుంది. లేకపోతే చచ్చిపోతుంది.**

భాషను సహజ లక్షణాలతో మాట్లాడాలి. అదే భాషకు జీవనది. అన్యభాషల నుండి భాషను వేరు చేసి,కొత్త సొగసు దిద్దేది సహజత్వమే. పలుకుబడుల పొహళింపులు, నుడికారాల సొబగులు, సామెతల సయ్యాటలు భాషని కండపట్టించి, నిగనిగలాడేలా చేస్తాయి. ఎంతో సువ్యవస్థ ఉన్న సంస్కృతం, లాటిన్ భాషలు మృతభాషలవడానికి కారణం మాట్లాడకపోవడమే. 'మాట జారనివ్వకు' అని సామెత. మాట జారితే భాషే జారిపోతుంది. జాతి అస్తిత్వానికి మూలం భాషే. భాష జారిపోతే జాతీ, సంస్కృతి మట్టిలో కలిసిపోతాయి. ఇదీ ఒక ప్రళయమే. దీనికి కారణం ప్రకృతి వైపరీత్యం కాదు. మానవ నిర్లక్ష్యం.

### తెలుగు 'పలుకే' బంగారమాయెనా?

భాషకు రెండు రూపాలుంటాయి. 1. మౌఖికం. 2. లేఖనం. మాట్లాడే



# ఆంగ్లంపైనే గురి . . . తెలుగు మాటకు ఉరి !

భాష రాసే స్థితికి రావడానికి కొన్నివేల సంవత్సరాలు పడుతుంది. ఇది మానవ క్రమాభివృద్ధిలో, జాతి వికాసంలో ఒక భాగం. దీనికి కాలపరిమితి ఉండదు. రాసే భాషా, మాట్లాడే భాషా పరస్పరాశ్రితాలు, ప్రభావితాలు కూడా. అందుకే మాట్లాడే భాష మీదే భాష మనుగడ ఆధారపడి ఉంటుంది.

తెలుగు భాషను 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్' అన్నా 'కలకండ' అంటూ రాయలవారు 'బాసాడి' కీర్తించినా మాట్లాడే భాషను బట్టి చెప్పినవే. అచ్చమైన, స్వచ్ఛమయిన తెలుగుదనం - పలకడం, చదవడం, వినడం అనే మూడు క్రియల ద్వారానే తెలుస్తుంది. తెలుగుకి మాధుర్యగుణం ఉందని దేశీయులు, విదేశీయులు నొక్కి వక్కాణించిందీ ఉచ్చారణ వల్లనే. అయితే ఈ మూడింటిలో ఉన్న లోపాలే నేడు అచ్చమైన తెలుగు చుట్టూ ఉచ్చు బిగించేలా చేస్తున్నాయి.

చక్కగా తెలుగు పలకాలంటే ముందుగా చక్కగా నేర్చుకోవాలి. నేర్పేవారికి అశ్రద్ధ, నేర్చేవారికి అనాదరణ. తెలుగు వర్ణమాలలోని ధ్వనులు, దంత్యతాలవ్య చజలభేదం, అనునాసిక, అల్పమహాప్రాణ వర్ణాల ఉచ్చారణలు పిల్లలకి సరిగ్గా నేర్పడం లేదు. అసలు తెలుగు నేర్పడానికి ప్రాథమిక పాఠశాలలలో తెలుగు పండితులే లేరు. భాషకి సంబంధించిన ఏ ప్రస్తావన వచ్చినా అది కేవలం భాషా పండితులదేనంటారు. మరి భాషని నేర్పడానికి మాత్రం భాషా పండితుల్ని నియమించరు. అసలు తెలుగు భాషకున్న వర్ణాలెన్నో చాలామందికి తెలీదు. అక్షరాలు రాసేందుకూ కొన్ని పద్ధతులున్నాయి. వాటిపై దృష్టి కేంద్రీకరించేవారే లేరు.

తెలుగు చదవడానికీ, చదివించడానికీ మొదటనుండీ విముఖత పెరిగిపోయింది. మన భాషని మార్చడం ద్వారా మన భావజాలాన్ని తమ వైపునకు తిప్పుకోవడానికే మెకాలే 1830లో ఆంగ్ల విద్యని ప్రవేశపెట్టాడు. ఆలోచనలపై భాష ప్రభావం ఉంటుందని నాడే మెకాలే గుర్తించాడు. నేటికీ మనం గుర్తించలేకపోతున్నాం. మాతృభాషలో చదివితే ఉద్యోగాలు రావన్న అపోహ, ఆంగ్లంపై మోజు తెలుగు చదువుల్ని కొడిగట్టేలా చేస్తున్నాయి.

'ఉద్యోగాలు అందరికీ అందకపోవడానికి కారణం ఆర్థిక అసమానతలు. మాతృభాషాధ్యయనం కాదు. ఆంగ్లానికి ఎంత శక్తి ఉన్నా అది భారత ప్రజాబాహుళ్య భాష కాదు. తెల్లవారి పాలన కొనసాగితే


Sthanika_BW_Nov11.indd 27 01/11/11 3:08 PM

ఆంగ్లమే అధికార భాష అవుతుంది. మాతృభాషలు దెబ్బతింటాయి. ఈ సంప్రదాయం కొనసాగకూడదు' అని మాతృదేశ భాషల పరిరక్షణను స్వాతంత్ర్య పోరాటంలోని అంశంగా గుర్తించిన గాంధీజీ మాటలు అక్షర సత్యాలు.

మాతృభాషలోనే బోధన - అధ్యయనం - జ్ఞానార్జన జరిగితేనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యం. ఒక సర్వే ప్రకారం - మన దేశంలోని 142 అత్యుత్తమ ఆంగ్ల పాఠశాల ల్రపమాణాలు విదేశీయులతో పోలిస్తే మెరుగ్గా లేవు. ఆంగ్లంలో చదివిన వారికంటే మాతృభాషలో చదివినవారే గణితాది శాస్త్రాధ్యయనంలో చురుగ్గా ఉంటారని చైనా వాళ్ళు నిరూపించారు. భాష అడ్డంకిగా ఉంటే శాస్త్రంపై దృష్టి లగ్నం కాదు. ఆంగ్లంలో చదివినవారి పాండిత్యమూ అంతంత మాత్రమే.

మన దేశంలో బహుళజాతి సంస్థలకి పనికి వచ్చే ఆంగ్ల భాషా జ్ఞానం ఉన్నవారు మొత్తం విద్యావంతులలో 13 శాతమేనట. సివిల్స్‌లోనూ తెలుగులో చదివినవారు నెగ్గుతున్నారు. కానీ వారు చదవాల్సిన ప్రామాణిక పుస్తకాలు ఆంగ్లంలో ఉండడం ఒక ఇబ్బంది. ప్రస్తుతం ఎన్ని భాషలు వస్తే అన్ని అవకాశాలు. మాతృభాషపై ఎంత పట్టు ఉంటే వేరే భాషలు నేర్చుకోవడం అంత సులభం. అయినా తెలుగు నుండి దూరం కాబోతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని యునెస్కోవారి సర్వే.

తెలుగుభాషపై అంగ్ల, సంస్కృత, హిందీ, ఉర్దూ భాష ప్రభావాలున్నాయి. ఒక భాషపై వేరొక భాషా ప్రభావం ఉంటుంది. దీన్ని ఎవరూ కాదనరు. అయితే ఆ ప్రభావం ఒక భాషలోని సహజలక్షణాలను నాశనం చేసేంతగా ఉంటే దాన్ని ప్రయత్నపూర్వకంగానైనా ఎదుర్కోవాలి.

'పొరుగింటి పుల్లకూర' రుచి ఎంత వరకు? మితంగా ఉన్నంతవరకే. ఈ యత్నాన్ని విద్యావంతులే చేయగలరు. చేయాలి కూడా. ఎందుకంటే పండితుల భాషను పామరులు అనుకరిస్తారు. అయితే దురదృష్టవశాత్తు భాషని ఎక్కువగా వినిపించే అవకాశం ఉన్న 'ఎలక్ట్రానిక్ మీడియా'లో ఉచ్చారణకు ప్రాధాన్యత తక్కువ. పూర్వం అకాశవాణిలో వార్తలు వింటే చాలు భాష వంటబట్టేది. ఉచ్చారణ, భాషా పటుత్వం వ్యాఖ్యాతలకు రెండు కళ్ళు.


నేడు టీవీ వ్యాఖ్యాతలు ల-ళలను, శషసలను ఒకేలా పలుకుతున్నారు. 'కళ'ను 'కల'గా, 'అశోక్' ను 'అషోక్'గా మార్చేస్తున్నారు. పద, వాక్య, క్రియ, సమాస, వ్యాకరణదోషాలు అసంఖ్యాకం. 'అధికారికం'లోని దీర్ఘాన్ని తీసి 'అధికారికం' అనీ, దీర్ఘంలేని అపేక్ష, అధీనం, కర్కటకం, కార్తికం లాంటి పదాలను అపేక్ష, అధీనం, కర్కాటకం, కార్తీకం అని వాడడం కనిపిస్తోంది.

తెలుగేతర, పాలాభిషేకం, శంఖుస్థాపన, శాఖాహారం, సమైఖ్యాంధ్ర, మహత్యం, మహాత్య్మం, యాత్రీకులు, తీక్షణం, అయిష్టం, అప్రమత్తమయిన అధికారులు లాంటి దోషాలు దొరల్లా చెలామణిలో ఉన్నాయి. కొలు-కవులు, ప్రదానం -ప్రధానం, క-ఖ, ర-ఋ, ఒ-వ ల మధ్య భేదాన్ని పాటించడం లేదు. శీర్షికలలో సైతం అంగ్లభాషా వినియోగం అధికం. ఒక వాక్యంలో కర్త కర్మ క్రియలు మూడూ అంగ్లంలోనే ఉంటాయి. క్రియకు మాత్రం 'చేయు' అనే తెలుగు క్రియ చేరుతుంది. వాక్యంలోని వ్యాకరణ తెలుగులో ఉంటుంది కానీ, పదాలన్నీ ఆంగ్లంలో ఉంటాయి.

'దరఖాస్తులు కోరబడుతున్నాయి'. 'ఈ ఫోరమ్ ప్రారంభిస్తున్నామని చెప్పడానికి సంతోషిస్తున్నాం' లాంటి అసహజ ప్రయోగాలు మౌఖిక భాషలో ఉండవు. కానీ వాడుతున్నారు.

## భాషా విధ్వంసాన్ని అరికట్టాలి

మాట్లాడే భాషలో వైవిధ్యానికి- వ్యక్తి, ప్రాంత, సంస్కృతి, అన్య భాషా సంపర్కం, వయోభేదాలు కారణాలు. దీని ప్రభావం లిఖిత భాషపై కూడా కనిపిస్తుంది. ప్రసార మాధ్యమాలలో సృజనరంగాలలో ప్రజ్ఞావంతులు, సుశిక్షితులు ఉండాలి. వ్యాఖ్యాతలకు రూపంతో పాటు భాష కూడా కావాలి. నటులకు నేపథ్యగళ సమర్పకులకు, గాయకులకు, రచయితలకు భాషపై పట్టు లేకపోతే ఆయా రంగాల ద్వారా అప శబ్దాలు ప్రజలకు అందుతాయి.




రేడియో, టీవీలే నేడు మాట్లాడే భాషా మనుగడకు కేంద్రాలు. రేడియోలో కేవలం శ్రవణ సౌలభ్యమే ఉంది. అంశాలు శ్రోతలను చేరాలంటే భాష స్పష్టంగా ఉండాలి. వాక్యాలు అన్వయంతో, చిన్నవిగా ఉండాలి. ప్రతి పదాన్నీ సరైన అర్థాలలో ప్రయోగించాలి. వ్యవహారంలో ఉండే పదజాలాన్ని వాడుకను అను-సరించి వాడాలి. అలా కాకపోతే శ్రోతలకు సందిగ్ధత తప్పదు.

దృశ్యం, శ్రవణం రెండు సౌలభ్యాలూ ఉన్న దూరదర్శన్‌లో శ్రవణానికి దృశ్యం తోడవుతుంది. శ్రవణం ద్వారా బోధనపరచలేని కొన్ని అంశాలను దృశ్యం



Sthanika_BW_Nov11.indd 28 01/11/11 3:08 PM

[redacted]

ద్వారా స్పష్టపరచవచ్చు. మాటలో ఉండే లోటును దృశ్యం కొంతమేరకు పూడుస్తుంది. టీవీల్లో వార్తల్ని రాసి చూపేటప్పుడు తప్పులు దొర్లకుండా చూసుకోవాలి. అలంకారికత కోసమో, ప్రాసల కోసమో భాషకు ఉండే సహజత్వాన్ని నాశనం చేయకూడదు. 'ఆయనకు అంత సీను లేదు', 'రవి క్లాసు పీకాడు' మొదలైన వ్యవహారంలో స్థిరపడిన వాటిని వాడడంలో తప్పులేదు.

లేఖనభాషలో అజ్ఞానం, ముద్రణల వల్ల దొర్లిన తప్పులు మాట్లాడే భాషలోనూ దొర్లుతాయి. 1. సంధివల్ల వచ్చిన మూర్ధన్య ధ్వనుల్ని దంత్యధ్వనులుగా రాయకూడదు. పలకకూడదు. ఉదా: అతడు + ని = అతడి + ని = అతడిని = అతణ్ణి, రాముణ్ణి, శంకరుణ్ణి మొదలైనవి. 'అతన్ని' కాదు.

2. తత్సమపదాలలోని 'ణ'ను 'న'గా వాడకూడదు. ఉదా: 'రామాయణం'. 'రామాయనం' కాదు.

3. మూర్ధన్య. 'ళ' ని 'ల'గా రాయకూడదు. ఉదా: 'వాళ్ళు'. వాల్లు కాదు.

4. పదాది వకారాన్ని లేఖనంలో నిలపాలి. వాడు, వచ్చాడు. ఆడు, అచ్చాడు కాదు.

5. అలాగే రెండు పదాలను వెంటవెంటనే పలికేటప్పుడు రెండోపదాదిలో ఉన్న 'వ'ను అచ్చుగా మార్చకూడదు. ఉదా: హస్తినకు ం వెళ్ళిన - హస్తినకెళ్ళిన.

6. 'ఫ' ఉచ్చారణలలో ఫ (ఌ) గా మారింది. 'Philosophy' ని 'filasafi' గా పలుకుతున్నాం. అంటే అక్కడ స్పర్శధ్వని ఊష్మ ధ్వనిగానే మారింది. కారణం ఆంగ్ల భాషా ప్రభావం. కాబట్టి ఈ ఆలను పలికే తీరుగానే రాయాలి. అయితే ఈ 'ఫ'ను లిఖించడానికి తెలుగులో లిపి రూపం లేదు.

7. ఆంగ్లంలో Rat, Fat మొదలైన పదాలలో ఉన్న అచ్చు మధ్యార్ధవివృతాచ్చు. దీనికి కూడా తెలుగులో లిపి చిహ్నం లేదు. దీనిని 'ఆ' అనే దీర్ఘాచ్చుతోనూ, యకార సంయుక్తంగానూ రాస్తున్నాం. రాయడాన్ని బట్టికాక ఉచ్చారణని బట్టి వాడాలి.

8. లోకము + నకు - 'లోకంనకు' కాదు. 'లోకానికి' అనాలి.

9. 'బ్రహ్మ'ను బమ్మ, బ్రంహ, 'చిహ్నం'ను చిన్నం, చింహం అనీ వాడకూడదు. ఈ రెండు పదాలకు రాయడం, పలకడంలో ఉన్న తేడాలను గర్తించాలి. ఆంగ్లంలోనూ Psychology, Tsunami వంటి పదాల లేఖన, మౌఖిక రూపాలలో అంతరాలు ఉన్నాయి.

10. ఆధునిక తెలుగు వాక్యంలో కర్మణి ప్రయోగాలు, యత్తదర్థక ప్రయోగాలు విరివిగా కనిపిస్తాయి. ఇవి భాషకి అసహజం. ఉదా : ఎవరైతే వెళ్ళారో వాళ్ళింకా రాలేదు. (వెళ్ళిన వాళ్ళింకా రాలేదు).

మౌఖిక భాష ఆధారంగా లిఖిత భాషను రూపొందించుకొనేటప్పుడు నియమాలు అవసరం. ఈ నియమాలు అభివ్యక్తి సారళ్యంతో పాటు నిర్దుష్టమైన భాషా పుష్టికి దోహదం చేయాలి. పామరులకు, అవిద్యావంతులకు అర్థం కాదేమోనన్న ఆలోచనతో భాషను దిగజార్చకూడదు. సక్రమమైన వ్యావహారిక భాషను రాతకూతల్లో వాడి వారిలో భాషా చైతన్యం తీసుకువచ్చే దిశగా ప్రయత్నం జరపాలి.

ఆధునిక తెలుగు భాషకు ఒక ప్రామాణికమైన వ్యాకరణం రూపొందాలి. ఇది అన్ని మండలాలను సమన్వయపరిచేదిగా ఉండాలి. దీనిలో విశాల దృక్పథం ఉండాలి. జీవద్భాషకు వ్యాకరణం రచించడం కష్టం. అయినా చేతనైంతలో ప్రామాణికతను సంతరింపజేయడం కూడా అవసరం. ఎలాగంటే - చిన్నయసూరి బాల వ్యాకరణాన్ని లక్ష్యంగా చేసుకొని నీతిచంద్రికను వెలయించాడు. ఆ రచనా వైశిష్ట్యం చేత తెలుగు కావ్య భాషాధ్యయనం కొనసాగించినంత కాలం బాల వ్యాకరణ పఠనం తప్పనిసరి అవుతుంది.

అలాగే గిడుగు రామ్మూర్తి పంతులు ప్రచారం చేసిన వ్యావహారిక భాషోద్యమానికి గురజాడ వారి కన్యాశుల్కం లక్ష్యమని చెప్పవచ్చు. గిడుగువారు కూడా ప్రామాణిక భాషకు ఒక వ్యాకరణం ఉండాలని భావించారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని, ఆధునిక వ్యావహారిక భాష అవసరాలను సంపూర్ణంగా తీర్చగలిగే వ్యాకరణాన్ని రూపొందించే ప్రయత్నం జరగాలి. వీటన్నింటినీ మించి అందరికీ మాతృభాషా క్షీరాన్ని సమృద్ధిగా అందేలా చూడాలి. బిడ్డ శరీర పోషణకు తల్లిపాలు ఎంత అవసరమో మనోవికాసానికి మాతృభాష కూడా అంతే అవసరం. శిశువు తొలిపాఠం తల్లి దగ్గరే నేర్చుకొంటుంది. కాబట్టి బిడ్డలపై పరభాషలను రుద్దడం దేశద్రోహమే.

*-డా. అద్దంకి శ్రీనివాస్,*
*తెలుగు బోధకులు*
*హైదరాబాద్ విశ్వవిద్యాలయం*



Sthanika_BW_Nov11.indd 29 01/11/11 3:08 PM

# భారత దేశ మానవాభివృద్ధి సూచిలో మెరుగుదల




దేశంలో మానవాభివృద్ధి సూచి గణనీయంగా 21 శాతం మేరకు పెరిగింది అయితే ఆరోగ్యం, పౌష్టికాహారం, పారిశుద్ధ్యం వంటి అంశాలు ఇప్పటికీ కీలకమైన సవాళ్లుగానే నిలుస్తున్నట్టు 2011 భారత మానవాభివృద్ధి సూచి నివేదిక హెచ్చరించింది. గ్రామీణాభివృద్ధి మంత్రి జైరాం రమేశ్ సమక్షంలో... ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు మాంటెక్ సింగ్ అహ్లువాలియా శుక్రవారం ఈ నివేదికను విడుదల చేశారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అప్లయిడ్ మ్యాన్‌పవర్ రీసెర్చి రూపొందించిన ఈ నివేదికలో కేరళ అన్ని రాష్ట్రాల్లోకెల్లా అగ్రస్థానంలో నిలిచింది. అక్షరాస్యత, నాణ్యమైన ఆరోగ్యసేవలు, ప్రజల వినియోగ వ్యయం వంటి విషయాల్లో కేరళ అన్నింటికన్నా ముందు నిలవటం గమనార్హం. మానవాభివృద్ధి సూచిలో ఢిల్లీ రెండోస్థానంలో, హిమాచల్ ప్రదేశ్ మూడోస్థానంలో నిలవగా... గోవా నాలుగోస్థానం దక్కించుకోంది. తాజా మానవాభివృద్ధి సూచిలో పేర్కొన్న ముఖ్యమైన అంశాలు

- గత దశాబ్దంలో మన మానవాభివృద్ధి సూచి గణనీయంగా వృద్ధి చెంది. 199-2000లో 0.387గా నమోదైన సూచి 2007-08లో 21% మేరకు పెరిగి 0.467కు చేరుకుంది.
- దేశంలో మూడింట రెండువంలతుల కుటుంబాలు పక్కా గృహాల్లో నివసిస్తున్నాయి. నాలుగింట మూడొంతుల కుటుంబాలు గృహావసరాల కోసం విద్యుత్తు సదుపాయం పొందుతున్నాయి.
- జనాభాలో 66% మంది ప్రజలు పక్కా గృహాల్లో నివసిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పక్కా ఇళ్లు గల కుటుంబాల శాతం 2002-03లో 36% ఉండగా... 2008-09లో 55 శాతానికి ఎగబాకింది.
- దేశంలో 6-17 ఏళ్ల పిల్లల్లో 19% మంది ఇంకా బడి బయటే ఉండిపోతున్నారు. ఇలాంటి వారిలో బీహార్, అస్సాం పిల్లల సంఖ్యే అధికం.
- విద్యాహక్కు చట్టం అమలవుతున్నప్పటికీ పాఠశాల విద్యను నాణ్యత, సిబ్బంది కొరత వంటి పలు సవాళ్లు పట్టి పీడిస్తున్నాయి.
- మన దేశంలో 74% మంది అక్షరాస్యులు ఉన్నారు. ఈ విషయంలో ఎస్సీ,ఎస్టీ, ముస్లింలు క్రమంగా జాతీయ సగటును అందుకుంటున్నారు.
- ఎస్సీ, ఎస్టీలతో పోలిస్తే ముస్లింలు అధికసంఖ్యలో పక్కా గృహాల్లో నివసిస్తున్నారు. ఇందుకు వాళ్లు పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా కేంద్రీకృతం కావటమే కారణమవుతోంది.
- ఛత్తీస్‌గఢ్, ఒడిషా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్,రాజస్థాన్, అస్సాం రాష్ట్రాలు అభివృద్ధి సూచిలో వెనకబాటుతనాన్ని కొనసాగిస్తూనే వస్తున్నాయి. జాతీయ సగటుకన్నా కిందనే ఉండిపోతున్నాయి.
- బీహార్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిషా, అస్సాం వంటి కొన్ని రాష్ట్రాలు మానవాభివృద్ధి సూచి మెరుగుదలలో గుణాత్మక పరిణితి సాధించాయి.
- మొత్తంమీద దేశవ్యాప్తంగా చదువు సూచిక28.5 శాతం పెరగటంతో మానవాభివృద్ధి సూచిక కూడా గణనీయంగా మెరుగునపడటానికి దోహదం చేసింది చదువు సూచికలో కేరళ 0.92తో కేరళ అన్నింటికన్నా ముందు నిలవగా... 0.41తో బీహార్ అట్టడుగున ఉంది.
- ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో చదువు సూచీ గణనీయంగా మెరుగుపడింది.
- చదువు సూచితో పోలిస్తే ఆరోగ్యసూచి తక్కువ వృద్ధిని సాధించింది. ఇది కేరళలో 0.82 ఉండగా... అస్సాంలో 0.41గా నమోదైంది.
- దేశంలోని సగం మందికి పైగా మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు.
- 2008-09లో జనాభాలో సగం మందికి పారిశుద్ధ్య సదుపాయం అందుబాటులో ఉన్నప్పటికీ ఈ విషయంలో రాష్ట్రాల మధ్య చాలా వ్యత్యాసం కనబడుతోంది.
- మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒరిస్సా, ఉత్తరాఖండ్‌లోని 75% కుటుంబాలకు మరుగుదొడ్ల సౌకర్యాలు లేనేలేవు.
- నిర్మల్ గ్రామ్ పురస్కారాలను పొందిన గ్రామాల్లోనూ మరుగుదొడ్లను స్నానం చేయటానికి, బట్టలు ఉతకటానికి,

వస్తువులు దాచుకోవటానికే ఉపయోగిస్తుండటం గమనార్హం.

- ఆహారంలో కేలరీల వినియోగం పడిపోతోంది. పేదవాళ్లు. సిఫారసు చేసిన మోతాదు కన్నా చాల తక్కువగా కేలరీలు తీసుకుంటున్నారు.
- పారిశ్రామికంగా తలసరి ఆదాయం అత్యధికంగా గల రాష్ట్రాల పరంగా చూస్తే. ఆకలి, పౌష్టికాహారం విషమయంలో గుజరాత్ పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. ఎస్సీ, ఎస్టీ మహిళల్లో పౌష్టికాహార లోపం గుజరాత్‌లోనే ఎక్కువ. మానవాభివృద్ధి సూచిలో గుజరాత్ స్థానం 10 నుంచి 11వ స్థానానికి దిగజారింది.
- తక్కువ బరువు పిల్లల జననం, పిల్లలు తగినంత బరువు లేకపోవటం వంటి విషయాల్లో మనదేశం పరిస్థితి బ్రిక్, సార్క్ దేశాల్లోని మిగతావాటికన్నా చాలా అధ్వానంగా ఉంది.
- టెలీ- సాంద్రత వృద్ధి వేగం గణనీయంగా పెరిగింది. ఇది 2008లో 22% మాత్రమే కాగా. 2010 డిసెంబర్ కల్లా 66 శాతానికి చేరుకుంది.
- వివిధ ఆరోగ్యపరమైన సూచికల్లో ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని ఎస్సీ, ఓబీసీలు... బీహార్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని ఎగువ కులాల వారి కన్నా మెరుగ్గా ఉన్నారు. ఇందుకు సుపరిపాలన, సామాజికంగా సంఘటితం కావటం దోహదం చేస్తున్నాయి.
- మొత్తం పేదవారి సంఖ్యలో 60% మంది బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌ల్లోనే ఉన్నారు. కొన్ని సంవత్సరాలుగా పేదరికం తగ్గుతున్నప్పటికీ. పేదరిక నిర్మూలనలో ఈ రాష్ట్రాలు అట్టడుగు స్థాయిలోనే ఉన్నాయి. ■

# సమర్థసేవలే పంచాయతీలకు గీటురాయి

**పంచాయతీల సంఖ్యను పెంచుకుంటూ వెళ్లడం వల్ల ఉపయోగం లేదని, అవి ప్రజలకు సమర్థంగా సేవలు అందించేలా ఉండాలని పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి రాజీవ్ శర్మ చెప్పారు. ఈ విషయంలో కేరళ ఆదర్శంగా నిలిచిందని, అక్కడ 25-30 వేల మంది జనాభాకు ఒక పంచాయతీ ఉండటం వల్ల పాలనాపరంగా మెరుగైన సేవలు అందించడానికి వీలుందని తెలిపారు.**



1959 నుంచి గ్రామీణాభివృద్ధిలో పంచాయతీల పాత్రపై ఆదివారమిక్కడ 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ)' ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. చాలా పంచాయతీలు ఆర్థికంగా నిలదొక్కుకునే స్థితిలోలేని కారణంగా ఆ ప్రభావం పనితీరుపై పడుతోందని తెలిపారు. రాజ్యాంగంలోని 11వ షెడ్యూలు ప్రకారం 29 అంశాలను పంచాయతీరాజ్ సంస్థలకు బదలాయించాల్సి ఉండగా, రాష్ట్రంలో 15 వరకు ఇచ్చినట్లు చెప్పారు. అయితే నియంత్రణ లేకుండా కేవలం సమీక్షలకే పరిమితమవడం వల్ల ప్రయోజనం ఉండదని అభిప్రాయ పడ్డారు. "రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) సిఫార్సులను అమలు చేయకపోయినా తాత్కాలిక ప్రాతిపదికన ప్రభుత్వం రూ. 100 కోట్లు కేటాయిస్తోంది.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సంబంధించిన కార్యక్రమ రూపకల్పన సర్పంచుల ఆధ్వర్యంలోనే జరుగుతున్నా నిధులు మాత్రం పంచాయతీలకు రావడం లేదు. ఆయా శాఖలే నేరుగా ఖర్చు చేస్తున్నాయి. ఉపాధి హామీ పథకం నిధులను పంచాయతీల ద్వారా వెచ్చిస్తే... అందులో పరిపాలన ఖర్చుల కింద కేటాయించే ఆరు శాతం సొమ్మును అవి వాడుకునే వెసులుబాటు లభిస్తుంది. అలాగే క్షేత్రస్థాయిలో వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలను సమ్మిళితం చేయాల్సి ఉంది" అని వివరించారు.

మండల పరిషత్‌లు, జిల్లా ప్రాదేశిక నియోజక వర్గాల (జడ్పీటీసీ) పరిధి ఒకటే కావడం వల్ల ఏర్పడిన గందరగోళం, రిజర్వేషన్‌లో రొటేషన్ విధానాన్ని ఒక ఎన్నికకే పరిమితం చేయడం వల్ల ప్రజా ప్రతినిధుల్లో ఆసక్తి తగ్గుతోందని, దీనిపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరముందని రాజీవ్ శర్మ అభిప్రాయపడ్డారు. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ ఎంపీ రావు మాట్లాడుతూ... పంచాయతీరాజ్ సంస్థలు కేవలం అమలు చేసే సంస్థలు కావని, అవి స్వయం ప్రభుత్వాలనే విషయాన్ని గుర్తించాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రంలో 64 శాతం పంచాయతీల ఆదాయం రూ. లక్షలోపే ఉందని ఐఐపీఏ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ శాఖ ఛైర్మన్ ఎం. గోపాలకృష్ణ పేర్కొన్నారు. ■

# గ్రామపంచాయితీ ప్రత్యేకాధికారుల శిక్షణకై శిక్షకులకు శిక్షణా కార్యక్రమం

**73వ రాజ్యాంగ సవరణ చట్టంననుసరించి పంచాయతీరాజ్ సంస్థలకు గత 3 దఫాలుగా ఎన్నికలు సక్రమంగా నిర్వహించబడుతూ వచ్చినవి. కానీ నాలుగవ సాధారణ ఎన్నికలు జరుగవలసిన తరుణంలో వివిధ కారణాల వల్ల స్థానిక సంస్థలకు జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 269, ది.22.8.2011 ద్వారా ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. పంచాయితీరాజ్ సంస్థల పాలనా వ్యవహారాలను సక్రమంగా నిర్వహించేందుకు వారికి శిక్షణ యివ్వవలసిన అవసరం ఎంతైనా ఉందనే ఉద్దేశ్యంతో అపార్డులోని ప్రణాళిక మరియు పరిపాలనా వికేంద్రీకరణ కేంద్రం ఒక ప్రత్యేక శిక్షణా కార్యక్రమమును రూపొందించింది.**

పంచాయతీరాజ్ సంస్థలోని గ్రామస్థాయి సంస్థల పరిపాలన చట్టబద్ధమైనది కనుక గ్రామ పంచాయతీ పాలనా వ్యవహారాలపై ప్రత్యేకాధికారులకు అవగాహన కల్పించుటకు గాను ముందుగా గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారుల శిక్షణకు గాను ప్రణాళిక రూపొందించబడినది. ఈ శిక్షణ నిమిత్తం సి.డి.పి.& ఎ వారు ప్రత్యేకాధికారుల ఉపయోగార్థమై దైనందిన పరిపాలన సజావుగా నిర్వహించుటకు అవసరమైన కరదీపికను కూడా రూపొందించియున్నారు వేల సంఖ్యలో ఉన్న ప్రత్యేకాధికారులందరినీ ఒకచోట చేర్చి శిక్షణ యివ్వడం అసాధ్యమైన అంశం కనుక, వారి ఉద్యోగ నిర్వహణకు ఆటంకం కలుగకుండా వుండే విధంగా ప్రతి జిల్లాలోని రెవెన్యూ డివిజన్ కేంద్రాలలో రెండు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించుటకుగాను నిర్ణయించబడినది.

రాష్ట్రమంతటా సుమారుగా 5400 మంది గ్రామ పంచాయితీ ప్రత్యేకాధికారులున్నందున మొదటి విడతగా సామర్లకోట, బాపట్ల మరియు శ్రీకాళహస్తి విస్తరణ శిక్షణా కేంద్రాల పరిధిలోని 13 జిల్లాలలో శిక్షణా కార్యక్రమం నిర్వహించుటకు గాను ఏర్పాట్లు చేయబడినాయి. ఈ ఏర్పాట్లలో భాగంగా 2011 అక్టోబర్ 18వ తేదీ నుండి డివిజన్ స్థాయిలో శిక్షణ యివ్వవలసినటువంటి 13 జిల్లాల శిక్షకులకు రాష్ట్ర ప్రధాన కేంద్రంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా విస్తరణ శిక్షణా క ఏంద్రం, బాపట్లలో అక్టోబర్ 10 నుండి 12వ తేదీ వరకు టి.ఓ.టి. శిక్షణా కార్యక్రమం నిర్వహించబడినది.



ప్రత్యేకాధికారుల శిక్షణ నిమిత్తం వారికుపయోగపడే విధంగా రూపొందించబడిన వివిధ అంశములు అనగా గ్రామ పంచాయితీ విధులు, అధికారాలు, ప్రత్యేకాధికారి విధులు, బాధ్యతలు, పంచాయితీ కార్యదర్శి విధులు, బాధ్యతలు, గ్రామ సభ ప్రాముఖ్యత - నిర్వహణ, గ్రామ పంచాయతీలలో ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, ఆడిట్లు. లే అవుట్లు, భవన నిర్మాణ నియమ నిబంధనలు, ల్యాబ్ టు ల్యాండ్ మరియు ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నటువంటి పథకాలు, విడుదల చేస్తున్నటువంటి నిధులు (యం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్., వాటర్ షెడ్, బి.ఆర్.జి.ఎఫ్., ఆర్.జి.ఎస్వై. నిధులు, త్రాగునీటి సరఫరా, ప్రజారోగ్యం - పారిశుధ్యం, 13వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిదులు, సాక్షర భారత్ మరియు బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009) మొదలైన విషయాలపై శిక్షణకు హాజరైన వారికి సమగ్ర అవగాహన కల్పించటం జరిగింది.

ఈ శిక్షణా కార్యక్రమానికిగాను మొత్తం 13 జిల్లాల నుండి 54 మంది అభ్యర్థులు హాజరైనారు. శిక్షణ ప్రారంభమైన నాటి నుండి అంతమయ్యే రోజు వరకూ వివిధ శిక్షణాంశాలపై జరిగిన చర్చలలో శిక్షణార్థులందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొంటూ, ఏ రోజు ప్రనాళిక ఆ రోజే పూర్తి చేయుటకు, శిక్షణా కార్యక్రమం విజవంతం కావడానికి ఎంతో సహకరించారు. అలాగే ఈ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగియడానికి గాను విస్తరణా కేంద్రం, బాపట్ల ప్రిన్సిపల్ శ్రీ బి. ఆశీర్వాదం గారు, వైస్ ప్రిన్సిపల్ శ్రీ సజ్జా సుబ్బారావు గారు, ఫ్యాకల్టీ సభ్యులు మరియు యితర సిబ్బంది ఎంతగానో తమ సహాయ సహకారాలనందించారు.

శిక్షణార్థులకు పై అంశాలపై శ్రీ పి. నాగరాజు, రిటైర్డ్ డి.పి.ఓ. శ్రీ యం. వెంకట్రావు, రిటైర్డ్ డి.పి.ఓ. శ్రీ కె. శ్రీపతిరావు, కన్సల్టెంట్ అపార్డ్ శ్రీమతి జి. సత్యవాణి, ఫ్యాకల్టీ సభ్యులు, సి.డి.పి. & ఎ మరియు విస్తరణ శిక్షణా కేంద్రం ఫ్యాకల్టీ సభ్యులు శ్రీ కె.యమ్.నాధ్, శ్రీమతి ఇందిర, శ్రీ జయరాం, శ్రీ ప్రసాద్‌లు శిక్షణ యివ్వటం జరిగింది. ■

# సూర్యరశ్మి ఆధారిత నీటి శుద్ధి విధానం

**అభివృద్ధి చెందుతున్న దేశాలలో 1/3 వంతు జనాభాకు సురక్షిత త్రాగునీరు నేటికీ అందని ద్రాక్షే. ఈ పరిస్థితి నీటి ద్వారా సంక్రమించే జబ్బులకు దారితీస్తున్నది. ప్రతిరోజూ దాదాపుగా ఈ దేశాలలో 6000 మంది పిల్లలు డయేరియా కారణంగా మృతి చెందుతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO), యునిసెఫ్ (UNICEE), రెడ్‌క్రాస్ (RED CROSS) వంటి సంస్థలు సిఫార్సు చేసిన సులభమైన, అతి తక్కువ ఖర్చుతో కూడుకున్న నీటి చికిత్సా విధానాలలో "సోడిస్" (SODIS) టెక్నాలజీ ఒకటి. ఈ పద్ధతిననుసరించి ఉచితంగా లభించే సూర్యరశ్మి ద్వారా ఇంటి వద్దనే నీటి శుద్ధి విధానాన్ని (Water Treatment) చేపట్టవచ్చు. ఈ విధానంతో ప్రస్తుతము ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఖండాలలోని 20 దేశాలలో 20 లక్షల మందికి పైగా ప్రజలు డయేరియాను, నీళ్ళ విరేచనాలు, కలరా వంటి జబ్బులను ఫలవంతంగా ఎదుర్కొంటున్నారు.**

సౌరశక్తి ద్వారా కలుషిత నీటిలో ఉన్న వ్యాధికారక సూక్ష్మజీవులను నశింపజేసి, నీటి నాణ్యతను పెంచడమే. ఈ విధానంలోని మూలసూత్రం సూర్యరశ్మి ద్వారా వెలువడే అతినీలలోహిత (అల్ట్రావయొలెట్) కిరణాలు మరియు పరారుణ (ఇన్‌ఫ్రారెడ్) కిరణాల వలన ఈ సూక్ష్మ జీవులు నశిస్తాయి.

### కావలసిన పరికరాలు

1. రంగులేని, పారదర్శకంగా ఉన్న 1.2 లీటర్ల సైజు కలిగిన PET (పెట్) బాటిల్స్.
2. కలుషిత నీరు. (నీటి టర్బిడిటీ కన్నా తక్కువగా ఉండాలి. రసాయనికంగా కలుషితమైన నీరు అనగా ఉప్పునీరు, పురుగు మందుల ప్రభావము, ఆర్సెనిక్, ఫ్లోరైడ్ మొదలగునవి వాటితో కూడిన నీటికి ఈ విధానం పనిచేయదు)
3. ఇనుపరేకు లేదా అల్యూమినియం రేకు.

**కాల వ్యవధి :-** రోజులో సూర్యరశ్మి తీవ్రంగా ఉండే 6 గంటల సమయము.

- ఆకాశము మేఘావృతమైనపుడు 2 రోజుల సమయం.

**విధానము**

1. వాతావరణ పరిస్థితులు ఈ విధానానికి అనుకూలంగా ఉన్నదీ, లేనిదీ మొదట గమనించాలి.
2. పరిశుభ్రమైన చేతులతో PET బాటిల్స్‌ను శుభ్రం చేయాలి. ఒక కుటుంబ సభ్యునికి కనీసం 4 బాటిల్స్ చొప్పున తయారీగా ఉంచాలి, పాతబడిన, గీతలు పడిన బాటిల్స్‌ను వాడకూడదు.
3. బాటిల్స్‌లో 3వ వంతు వరకు నీరు నింపి మూతపెట్టి 20 సెకన్లు బాటిల్‌ను కదిలించి, తర్వాత మూత తెరచి బాటిల్‌తో నీటిని పూర్తిగా నింపాలి.
4. ఈ విధంగా నీటితో నింపిన బాటిల్స్‌ను ఇనుపరేకు లేదా అల్యూమినియం రేకుపై ఏటవాలుగా (పటంలో చూపిన విధంగా) ఎండ బాగా తగిలే చోట 6 గంటల పాటు ఉంచిన యెడల వ్యాధికారక సూక్ష్మజీవులు నశిస్తాయి. ఈ నీరు తాగడానికి సురక్షితంగా ఉంటుంది.


### లాభాలు

- నీటి నాణ్యత పెరుగుతుంది.
- ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటుంది. సులభమైన, తక్కువ ఖర్చుతో కూడుకున్న విధానం.
- సమయం ఆదా అవుతుంది.
  సాంప్రదాయ ఇంధన వనరులైన కిరోసిన్, గ్యాస్, కట్టెలు మొదలగు వాటి వినియోగం తగ్గుతుంది.
- కుటుంబ ఆరోగ్య పరిస్థితులు మెరుగ్గా ఉన్నప్పుడు వైద్య ఖర్చులు తగ్గుతాయి.
- నీటి రుచి మారదు.
- ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అవసరం లేదు.

### పరిమితులు

- సూర్యరశ్మి ఆధారిత విధానం కాబట్టి వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.
- ఎక్కువ పరిమాణంలో ఈ విధానం ద్వారా నీటిని శుద్ధిచేయలేము.
- ఎక్కువ కాలుష్యత కల్గిన నీరు (టర్బిడిటీ 30 NTU కంటే ఎక్కువ) మరియు రసాయనాలతో కూడిన నీటిని ఈ విధానం ద్వారా శుద్ధి చేయలేము. ఇటువంటి నీటికి Pre-treatment అవసరము.

ఈ విధానంపై మరిన్ని వివరాలకొరకు http ://sodis.ch వెబ్‌సైట్ logon అవ్వండి.





**బి. శ్రీలక్ష్మి**
**ఫ్యాకల్టీ మెంబర్, అపార్డ్**





# బాలల హక్కులపై అంతర్జాతీయ ఒడంబడిక

**ఆటపాటలతో, విద్యాబుద్ధులతో ఆనందంగా సాగవలసిన బాల్యం కొందరి జీవితాలలో చిరునవ్వులు కురిపిస్తుంటే మరికొందరి జీవితాలలో విషాదాన్ని నింపుతుంది. ఎందుకు అలా జరుగుతుంది? వాళ్ళు చేసిన పాపం ఏమిటి?**

ఓ ప్రక్కన తల్లిదండ్రులను కోల్పోయిన అభాగ్యులు, పేదరికపు విషవలయంలో చిక్కుకున్న నిర్భాగ్యులు. ఫలితం కిరాణా షాపులతో, హోటళ్ళలో, దుకాణాలలో, కర్మాగారాలలో, పొలాలలో, యిండ్లలో పాలేరులుగా, రోడ్లపైన చెత్త ఏరుకుంటూ, బిచ్చమెత్తుకుంటూ పలు రకాలుగా బాలకార్మికులుగా నిత్యం మనం చూస్తూనే ఉన్నాం.

మరో ప్రక్క తల్లిదండ్రులుండీ ఆటపాటలకు, చదువుకు దూరమైన చిన్నారులు... వయసుకు మించిన బాధ్యతలు మోస్తూ. ఇంటి పనులలో, వంట పనులలో, పిల్లలను పెంచడంలో ఒకటేమిటి అన్నింటా తామే అయి శారీరకంగా కృంగి కృశించి పోతూ బాల్యం గడుపుతున్నవారు. పన్నెండు, పదమూడు సంవత్సరాలకే పెళ్ళిచేసుకొని, మరో ఏడాదికి చంకన బిడ్డనెత్తుకొని ఇరవై ఏళ్ళకే సగం జీవితాన్ని కాచి వడబోసిన పడతులు. వ్యసనాలకు బానిసలై మృత్యుముగింటిలోకి జారుతున్న చిన్నారులు... ఇలా చెప్పకుంటూ పోతుంటే ఎన్నో ఎన్నెన్నో నగ్న సత్యాలు.

ఇది కేవలం మన భారతదేశపు సమస్య మాత్రమే అనుకుంటే పొరపాటే. ప్రపంచ వ్యాప్తంగా బాలలు ఎదుర్కొంటున్న సమస్య. అందుకే ప్రపంచ వ్యాప్తంగా బాలల హక్కుల గురించి వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు అనుసరించవలసిన ప్రమాణాల గురించి అంతర్జాతీయ స్థాయిలో బాలల హక్కుల పరిరక్షణకై ఒక ఒడంబడిక (1990) జరిగింది. ఈ ఒడంబడికపై 1992లో భారతదేశం సంతకం చేసింది. 194 దేశాలు ఈ ఒడంబడికపై సంతకం చేశాయి. ప్రపంచ చరిత్రలోనే అంతర్జాతీయ స్థాయిలో అత్యధిక దేశాలు ఆమోదించిన మానవహక్కుల పరిరక్షణ సాధనం ఈ ఒడంబడిక. ప్రతి బిడ్డ సామరస్య పూర్వక వాతావరణంలో ఎదగడానికి, గౌరవ ప్రదంగా జీవించడానికి అనుగుణంగా విధానాలు రూపొందించడం, చర్యలు తీసుకోవడం ప్రతి దేశం యొక్క బాధ్యత. ఈ నేపథ్యంలో ఈ ఒడంబడికలో ఏమేం అంశాలు పొందుపరచారో చూద్దాం.

- 18 సంవత్సరాలు లోపు వయస్సు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ఒడంబడిక పరిధిలోకి వస్తారు.
- జాతి, మత, కుల, లింగ, సామర్థ్యలతో పని లేకుండా బాలలందరికీ వర్తిస్తుంది.
- ఈ ఒడంబడికను పిల్లలకు, వారి తల్లిదండ్రులకి అందుబాటులో ఉంచాలి.
- పిల్లలతో సంబంధం ఉన్న అన్ని సంస్థలు ఈ ఒడంబడికకు అనుగుణంగా కృషి చేయాలి.
- పిల్లలందరికీ ఈ హక్కులు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.
- ఆరోగ్యకర వాతావరణం, పరిశుభ్రమైన త్రాగునీరు, పౌష్టిక ఆహారం పొందగలిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలి.



- పెద్దలు తీసుకొనే నిర్ణయాలు పిల్లలపై దుష్ప్రభావాలు చూపేవిధంగా ఉంటే, ఖచ్చితంగా పిల్లల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి.
- ప్రతి పిల్లవానికి, పిల్లకు తన పేరును, జాతీయతను కలిగిఉండటంతోపాటు, తన తల్లిదండ్రులెవరో తెలుసుకొనే హక్కు, వారి పర్యవేక్షణలోనే పెరిగే హక్కు ఉన్నది.
- పిల్లలకు మంచి భవిష్యత్ కోసం మినహా తల్లిదండ్రులనుండి వేరు చేయరాదు.
- పిల్లల ఆలనా పాలనలను కుటుంబసభ్యులు చూడలేకపోయిన సందర్భంలో వారి మతాన్ని, సంస్కృతిని, భాషను గౌరవించి సంరక్షణ చేయగలవారు ఎవరైనా పిల్లల ఆలనాపాలనా చూడవచ్చు.
- ఇతర దేశాలకు శరణార్థులుగా వెళ్ళినను పిల్లలకు అన్ని హక్కులు లభిస్తాయి.
- అంగవైకల్యం గల పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపవలసిన అవసరం ఉన్నది.
- బీదవారైన పిల్లల ఆలనా పాలనకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందించాలి.
- భౌతిక మానసిక అవసరాలకు తగినట్లు మంచి జీవన ప్రమాణాలు కల్పించే స్థోమత తల్లిదండ్రులకి లేకపోతే ప్రభుత్వం ఆదుకోవాలి.
- పిల్లల వ్యక్తిత్వాన్ని ప్రతిభను పెంచే విధంగా విద్య ఉండాలి.
- ప్రతి ఒక్కరు వారి వారి మాతృభాషను, ఆధారాలను కొనసాగించుకోవచ్చు
- ఆటలు ఆడుకోవడానికి, తగినంత విశ్రాంతి తీసుకోవడానికి పిల్లలకు హక్కు ఉంది.
- పిల్లలను వేధించడం, అవమానించడం, హింసించడం, నిర్లక్ష్యంగా చూడడం వంటివి తల్లిదండ్రులైనా, పిల్లల ఆలనాపాలనా చూసే వారైనా సరే చేయరాదు.
- ప్రమాదకరమైన, పిల్లల చదువుకు, ఆరోగ్యానికి హాని కలిగించే పనులలో పిల్లలను చేర్చకుండా ప్రభుత్వం చూడాలి.
- పిల్లల ప్రగతికి అవరోధం కలిగించే ఎటువంటి కార్యకలాపాలు జరగకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకోవాలి.
- పిల్లల అపహరణలు, అమ్మకాలకు గురికాకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి.
- లైంగిక పరమైన వేధింపులనుండి ప్రభుత్వం రక్షించాలి.
- చిన్న చూపు చూడడం, క్రూరమైన శిక్షలు విధించడం జరగకుండా ప్రభుత్వం చూడాలి.
- పిల్లలు చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించినట్లు ఋజువైనప్పటికీ, వారిని ప్రత్యేకమైన ప్రదేశంలో ఉంచడం, తల్లిదండ్రులతో మాట్లాడనివ్వడం చేయాలి. ఎంతో తీవ్రమైన నేరాలకు మాత్రమే జైలు శిక్ష విధించడం జరగాలి.
- పిల్లలకు గానీ, ఇతరులకు గానీ హాని కలగనంత వరకు ఏవైనా సంస్థలతో, వ్యక్తులతో కలసి ఉండేందుకు, సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకునేందుకు పిల్లలకు హక్కు ఉంది.
- పిల్లలకు కావాల్సిన సమాచారాన్ని అర్థమయ్యే విధంగా టెలివిజన్, రేడియో, వార్తాపత్రికల ద్వారా తెలియచేయాలి.

పై హక్కులన్నీ ప్రపంచదేశాలు ఒప్పుకొని, ఒడంబడికపై సంతకం చేశాయి. భారతప్రభుత్వం ఈ హక్కుల కల్పనలో భాగంగా తగు చర్యలు తీసుకోవడం జరిగింది. బాల కార్మికుల నిరోధక చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, తప్పనిసరి జనన, వివాహ రిజిస్ట్రేషన్లు, ఉచిత ప్రాథమిక విద్య, లైంగిక వేధింపులపై కఠిన చర్యలు, బాల నేరస్థుల కోసం ప్రత్యేక కారాగారాలు, వాటి అభివృద్ధికై చర్యలు, అనాథ బాల బాలికల కోసం ప్రత్యేక వసతి గృహాలు, బాలబాలికల ఆటపాటలకు అవసరమైన పార్కులు, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం మొదలగు కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. అయితే వాటి అమలులో చిత్తశుద్ధి చూపినప్పుడే బాలల హక్కులను పరిరక్షించిన వారిమి అవుతాము. ఇది మనందరి బాధ్యత. దీనిని మనందరం గుర్తెరిగి వ్యవహరిద్దాం. బాల దినోత్సవ శుభాకాంక్షలతో.

**- పి.మాధురి**
**ఫ్యాకల్టీ అపార్డ్**

# గుట్కా వినియోగం నిషేధించిన గంగదేవిపల్లి



సమాజాభివృద్ధికి తోడ్పడుతూ, భావితరాలకు మార్గదర్శకంగా ఉండవల్సిన యువత నేడు గుట్కాలకు, అంబర్ లాంటి చెడు వ్యసనాలకు బానిసలు అవుతూ క్యాన్సర్ లాంటి ప్రాణాంతకమైన వ్యాధులకు గురై అనేక మంది తమ ప్రాణాలు కోల్పోవడం వలన కుటుంబాలు అనాథలుగా మారిపోతున్నాయి. క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నవారు యువకులె అధికంగా ఉన్నారని తెలుసుకొని మా గ్రామంలో ఏ ఒక్క యువకుడు గుట్కాలకు, అంబర్‌లకు బానిసలు కాకుండా చూడాలని అపార్డులో శిక్షణ పొంది వచ్చిన గంగదేవిపల్లి గ్రామంలోని భారత నిర్మాణ్ వాలంటీర్లు బాధ్యతలు తీసుకొని గత రెండు నెలల నుండి పలు దఫాలుగా యువకులతో మహిళ సంఘాలతో, ప్రజలతో సమావేశాలు నిర్వహించి గుట్కాలు, అంబర్‌లు తినడం వలన ఏవిధంగా క్యాన్సర్ వ్యాధి బారినపడి ఆర్థికంగా, శారీరకంగా నష్టపోయి మరణిస్తున్నారో కండ్లకు కట్టినట్లుగా ఈ వ్యాధి బారిన పడి మరణించిన వారి కుటుంబ పరిస్థితుల గురించి చెప్పడం జరిగింది.



గ్రామ పంచాయితీలోని వికాస కేంద్రంలో తేది: 08.10.2011న గ్రామ సభ ఏర్పాటు చేసుకొని గుట్కాలను, అంబర్‌లను నిషేధిస్తూ ఈ క్రింది నియమ నిబంధనలు రూపొందించుకోవడం జర్గినది.

1) గ్రామంలోని ప్రజలు ఎవరు కూడా గుట్కాలు, అంబర్‌లు తినకూడదు.

2) గ్రామంలో వున్న షాపుల వారు ఎవరు కూడా గుట్కాలు, అంబర్‌లు అమ్మకూడదు. అమ్మినచో రూ॥500/-లు జరిమానా వసూలు చేయడం జర్గుతుంది. వీటిని అమ్మిన షాపు యాజమానిని ఆధారాలతో పట్టించిన వారికి ప్రోత్సాహకంగా రూ॥200/-లు ఇవ్వాలని గ్రామ సభ తీర్మానించడం జరిగింది.

ది. 12.10.2011 మరునాటి ఉదయం భారత్ నిర్మాణ్ వాలంటీర్ల ఆధ్వర్యంలో ప్రజలందరూ గుట్కాలకు,అంబర్‌లకు వ్యతిరేకంగా **గుట్కాలు తినకురో-గుటుక్కుమనకురో,అంబర్లు తినకురో- ఆగమాగం కాకురో, గుట్కాలు, అంబర్‌లు తినకండి-క్యాన్సర్ వ్యాధికి గురి కాకండి** క్షణిక తృప్తి కోసం దీర్ఘకాలం దిక్కు లేనికుటుంబంగా మార్చకు, అనే నినాదాలు చేస్తూ గ్రామంలోని ప్రధానదారుల గుండా ప్లేకార్డ్లు, బ్యానర్లు చేతబూని గ్రామస్తులు ర్యాలీ నిర్వహించి గ్రామంలోని కిరాణషాపులలో నిల్వ ఉన్న గుట్కాలు,అంబర్‌లను తీసుకొని వచ్చి గాంధీ విగ్రహం ముందు కాల్చడం జరిగింది. ఈ సందర్భంగా ర్యాలీని ఉద్దేశించి మాజీ సర్పంచ్ కూసం రాజమౌళి గారు మాట్లాడుతూ..యువత గుట్కాలు, అంబర్‌లు తిని వాటికి బానిసలై ప్రాణాంతకమైన క్యాన్సర్‌లాంటి వ్యాధులకు గురికాకూడదని, మిమ్ములను కన్న తల్లిదండ్రులకు కడుపు కోత మిగల్చవద్దని వారిని అనాథలగా చేయకూడదని, ఇలాంటి చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండి భావితరాలకు మార్గదర్శకంగా నిలచి గ్రామాభివృద్ధికి ఎంతగానో తోడ్పడాలని కోరుతూ అందరి చేత గుట్కాలు, అంబర్ లాంటివి తినవద్దని ప్రతిజ్ఞ చేయించి ఈ రోజు నుండి గ్రామంలో వీటిని నిషేదించినట్లుగా. గ్రామసభ ఆమోదాన్ని ప్రకటించడం జరిగింది.

## ప్లాస్టిక్ భూతాన్ని పారద్రోలి - పర్యావరణాన్ని కాపాడుకుందాం!

గ్రామంలో ప్లాస్టిక్ ఉపయోగించటం వలన పంట భూములలో భూసారం దెబ్బ తిని పంటలు పండకుండపోయే అవకాశం వున్నందున పర్యావరణానికి హాని కలిగిస్తుందనే ఆలోచనతో అపార్డులో శిక్షణ పొంది వచ్చిన గంగదేవిపల్లి భారత్ నిర్మాణ్ వాలంటీర్లు మాజీ సర్పంచ్ కూసం రాజమౌళి, ప్రజలకు మహిళ సంఘాలకు,రైతులకు పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్ళను ఉపయోగించటం వలన కలిగే అనర్థాలపై పూర్తి అవగాహన కల్పించిన తర్వాత ప్లాస్టిక్ నివారణకు ప్రజలు ముందుకు రావడం జర్గింది సాంప్రదాయబద్ధంగా గ్రామసభను నిర్వహించుకొని ప్రజల సమక్షంలో చర్చించి ఏకగ్రీవంగా ప్లాస్టిక్ నివారణ కమిటిని వేసుకొని ఈ క్రింది నియమ నిబంధనలు రూపొందించుకున్నారు.

1. గ్రామంలో క్రమంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి గాను ప్రమాదాల గురించి ప్రజలలో పూర్తి అవగాహన కల్పించి గ్రామంలో ప్లాస్టిక్‌ను లేకుండా (గుడ్డ/పేపర్) చేతి సంచుల వాడకాన్ని పెంచి పూర్తి స్థాయిలో ప్లాస్టిక్‌ను నిషేదించుటకుగాను కుటుంబాల అవసరాలకు తెస్తున్న వివిధ వస్తువుల ప్యాకింగ్‌ల ద్వారా ప్లాస్టిక్‌ను ఇంటి పరిసరాలలో గల ఒక చోట జమ చేసి ప్రతి నెల 1వ తేది, 15వ తేదిన వాటర్ ట్యాంక్ వద్దకు తీసుకవచ్చిన వారికే ఆ రోజు క్యాన్ వాటర్ ఇవ్వాలని ప్లాస్టిక్ తేని వారికి ఆ రోజు క్యాను వాటర్ ఇవ్వకూడదని గ్రామసభ చేసిన తీర్మాణాన్ని అమలు చేయుటకు డ్వాక్రా గ్రూపులకు బాద్యతలను ఇస్తూ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు పర్యవేక్షణ చేస్తున్నారు.
2. మా ఇంట్లో కవర్ళు లేవు అని చెప్పినప్పుడు కమిటి వారు వెళ్ళి వారి ఇల్లును, ఇంటి పరిసరాలను పరిశీలించినప్పుడు, ప్లాస్టిక్ కవర్స్ దొరికినట్లయితే రూ॥500/-లు జుర్మాణ వసూలు చేయాలని గ్రామ సభ చర్చించి ఏకగ్రీవముగా నిర్ణయించడం జరిగింది.



ప్రజలందరికి తెలిసే విధంగా గంగదేవిపల్లి గ్రామములో గల భారత్ నిర్మాణ్ వాలంటీర్ల ఆధ్వర్యంలో ప్రజలు ప్లేకార్డులు, బ్యానర్లు చేతబూని బారీ ఎత్తున ప్రజలను సమీకరించి ర్యాలీ నిర్వహించడం జరిగినది. **ప్లాస్టిక్ కవర్లు వాడవద్దు- చేతిసంచులనే వాడండి పర్యవరణాన్ని కాపాడండి, గొనె సంచులను వాడండి -పర్యవరణాన్ని కాపాడండి!** అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం వద్దకు చేరుకొని ప్లాస్టిక్ కవర్స్‌ను కాలపెట్టినారు. తదనంతరం మాజీ సర్పంచ్ కూసం రాజమౌళి గారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి ఎలాంటి పరిణామాలు తలెత్తుతున్నాయో తెలియపర్చడం జరిగింది. గ్రామ సభలో ప్లాస్టిక్ నివారణ గురించి తీసుకున్న నిర్ణయాలను ప్రకటించడం జర్గినది.

**వనపర్తి కర్ణాకర్**
**జిల్లా శిక్షణా మేనేజర్, జిల్లా శిక్షణా కేంద్రం, జిల్లా ప్రజా పరిషత్, వరంగల్.**





Printed & Published by: K. Chandra Mouli, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : K. Chandra Mouli**



010-11 ను విడుదల చేస్తున్న
ర్ సెక్రటరీ శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్.



ారుల కరదీపికను విడుదల చేస్తున్న
షనర్ శ్రీ హనుమంత రావు



# గోండ్వానా విప్లవ జ్యో